తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 03.05.2025 | సంపుటి :11 సంచిక : 284 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370



ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698







## 600 చ.అడుగులు మించొద్దు

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపై మంత్రి పొంగులేటి స్పష్టత**

**లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఇందిరమ్మఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా ఇన్‌ఛార్జి మంత్రులు ఆమోదం పొందాలన్నారు. ఇళ్లు విస్తీర్ణం 600 చదరపు అడుగులు మించకూడదన్నారు. ప్రతి నియోజకవర్గంలో పట్టణప్రాంతంలో 500 ఇళ్లు నిర్మించాలని చెప్పారు. మిగతా 2లో..





## కులగణనకు తెలంగాణే రోల్‌మోడల్

**ఒక గొప్ప సామాజిక విప్లవానికి నాంది పలికే ప్రక్రియ**

**ఇది తెలంగాణరాష్ట్రానికి గర్వకారణం : సీఎం రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జన గణనలో కుల గణనకు తెలంగాణ మోడల్ ను పరిగణనలోకి తీసుకోవాలని అఖిల భారత కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి ఐన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన సమావేశ వివరాలు వెల్లడించారు. " నాలుగు గోడల మధ్య నలుగురి ఆలోచనలతో కాక మొత్తం పౌర సమాజం తెలంగాణ మేధావులు వివిధ కుల సంఘ నాయకులు విద్యావేత్తల నుండి అత్యంత పారదర్శకంగా సలహాలు, సూచనలు స్వీకరించి శాస్త్రీయంగా తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేపట్టిన విషయాన్ని తన తీర్మానంలో ప్రస్తావించింది. ఇది తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంఒక గొప్ప సామాజిక విప్లవానికి నాంది పలికే ప్రక్రియ విషయంలో దేశానికే మిగతా 2లో..

### పహల్గాంపై కానరాని ప్రతివ్యూహం

దాడి జరిగి రోజులు గడుస్తున్నా కేంద్రం నుంచి సరైన స్పందన లేదు

దేశ భద్రత విషయంలో కేంద్రానికి అండగా విపక్షం 2లో

సీడబ్ల్యూసీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే






## అమరావతికి కేంద్ర సాయం

**ఆంధ్రుల చిరకాల స్వప్నం సాకారం కాబోతోంది**

- స్వర్ణాంధ్ర నిర్మాణానికి ఈ నగరం ఎంతో కీలకం
- అన్ని రంగాల్లో అద్భుతంగా ఆవిర్భవిస్తుంది
- అన్ని విధాలా అండగా ఉంటానని హామీ
- రూ.60వేలకోట్ల పనులకు శంకుస్థాపనలు
- ఇవన్నీ ఏపి ప్రగతికి..వికసిత్ భారత్‌కు పునాదులు
- అమరావతి పునర్నిర్మాణ సభలో మోడీ ప్రసంగం

**అమరావతి(జనంసాక్షి):** ఏపీ ప్రజల చిరకాల స్వప్నం అమరావతి సాకారం కాబోతుందని ప్రధాని మోడీ అన్నారు. అమరావతి ఒక పుణ్య భూమి అని.. నేను ఈ పుణ్య భూమిపై నిలబడి మీ అందరితో మాట్లాడటం ఆనందంగా ఉందన్నారు. అమరావతి అంటే సాంప్రదాయం, పురోగతి అని.. స్వర్ణాంధ్ర నిర్మాణానికి అమరావతి ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. మిగతా 2లో..

### కేరళలో డీప్ వాటర్ సీపోర్టు

ప్రారంభించిన ప్రధాని

మోడీకి స్వాగతం పలికిన కాంగ్రెస్ నేత శశిథరూర్

థరూర్‌ను చూసి కొందరికి నిద్ర పట్టదంటూ ప్రధాని చురకలు

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

వార్త 2లో

## యువతకు ఉపాధి కల్పిస్తాం

- సింగరేణి ఉద్యోగాల గనిగా మారాలి
- సంస్థ ఉజ్వల భవిష్యత్తుకు శ్రమతో కూడిన అడుగులు పడాలి
- ఇతర రంగాల్లోకి సింగరేణి విస్తరణ
- జూన్ 2న రాజీవ్ యువ వికాసం
- లబ్ధిదారులకు పత్రాల అందిస్తాం
- డీప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్(జనంసాక్షి):** 13దశాబ్దాల చరిత్ర ఉన్న సింగరేణి కాలరీస్ ఇక ముందు కూడా అభివృద్ధి పథంలో ముందుకు పోతూ కేవలం బొగ్గు గని గానే కాక వేల మందికి ఉపాధి చూపే ఉద్యోగాల గనిగా రూపుదిద్దుకోవాలని ఆ దిశగా కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. మన ముందు తరాల వారు ఆరోగ్యంగా, ఆర్థికంగా బలమైన సింగరేణి సంస్థను మనకు అందించారని, మనం కూడా మన వారసులకు ఉజ్వల సింగరేణిని అందించకపోతే భావి తరాలకు తీరని నష్టం చేసిన వాళ్లం అవుతామని హెచ్చరించారు. సింగరేణి అభివృద్ధిలో కింది ఉద్యోగి నుంచి సీఎండీ వరకు అందరికీ సమాన బాధ్యత ఉంటుందని, సంస్థ ప్రయోజనాల దృష్ట్యా కఠినమైన మిగతా 2లో..



## గ్రూప్-1 అంశంపై విచారణ వాయిదా

**గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు జూన్ 11 వరకు పొడిగించిన హైకోర్టు**



**హైదరాబాద్(జనంసాక్షి):** టీజీపీఎస్సీ గ్రూప్-1 వ్యవహారంపై హైకోర్టులో విచారణ జూన్ 11కి వాయిదా పడింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు జూన్ 11 వరకు పొడిగిస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయని పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గత కొన్ని రోజులుగా విచారణ కొనసాగుతోంది. మిగతా 2లో..

## జై శ్రీరామ్.. భారత్ మాతా కీ జై నినాదాలతో..



## దళిత యువకుడిని నగ్నంగా ఊరేగింపు

**కాళ్లూ చేతులు గుడిగోడకు కట్టేసి దాడి**

**చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో దారుణం**

ఆలస్యంగా వెలుగులోకి ఘటన .. సోషల్ మీడియాలో వైరల్

**ఆలయంలో ప్రవేశించాడనే నెపంతో కొట్టినట్టు బాధితుల ఫిర్యాదు**

కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో 9 మందిపై కేసు.. మరికొందరి కోసం ఆరా

బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శిస్తున్న పలు సంఘాలు, పార్టీల నాయకులు

*సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో దారుణం జరిగింది. బేడ బుడగ జంగాల కులానికి చెందిన (మతిస్థిమితం లేని) ఊపిరి అజయ్‌కుమార్ అనే దళిత యువకుడిపై ఆర్ఎస్ఎస్, బిజెపి, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్‌కు సంబంధించిన నాయకులు దాష్టీకానికి ఒడిగట్టారు. మద్యం తాగి హనుమాన్ ఆలయంలోకి వచ్చాడనే నెపంతో గత మూడురోజుల క్రితం అతనిపై కొంతమంది దాడికి దిగారు. కాళ్ళు చేతులు కట్టేసి.. రోడ్డుపై బట్టలు విప్పి నగ్నంగా ఊరేగించారు. గుడి గోడకు కట్టేశారు. అయితే ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూడడం గమనార్హం. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి.*



2లో

## లష్కరే తోయిబా, ఐఎస్ఐల పనే..



**పహల్గాం ఉగ్రదాడిపై ప్రాథమిక విచారణలో తేల్చిన ఎన్ఐఏ**

- దాడికి కొన్ని వారాల ముందే భారత్‌లో ప్రవేశించి రెక్కీనిర్వహించిన మిలిటెంట్లు
- దర్యాప్తు సంస్థకు చేతికి కీలక ఆధారాలు
- జైసల్మేర్‌లో పాక్ గూఢచారిని అదుపులోకి తీసుకున్న రాజస్థాన్ ఇంటెలిజెన్స్

**ఢిల్లీ(జనంసాక్షి):** జమ్మూకశ్మీర్ పహల్గాంఉగ్రదాడిలో కీలక పరిణామం చోటు చేసుకుంది. పహల్గాం ఉగ్రదాడి ఆర్మీ, లష్కరే తోయిబా కన్నుసన్నల్లో జరిగినట్లు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ నిర్ధారించింది. పహల్గాం ఉగ్రదాడిలో ఎన్ఐఏ దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ ఎన్ఐఏ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పాక్ ఐఎస్ఐ,ఉగ్రసంస్థ లష్కరే తోయిబాలు కలిసి ఈ కిరాతక దాడికి పాల్పడినట్లు ఎన్ఐఏ తేల్చింది. పాకిస్తాన్‌లోని లష్కరే తోయిబా ఆఫీస్‌లో పహల్గాం ఉగ్రదాడికి కుట్ర జరిగినట్లు ప్రాథమిక నివేదికల్లో పేర్కొంది.ఇక పహల్గాంలో దాడికి పాల్పడ్డ ఇద్దరు ఉగ్రవాదుల్ని ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. షమీమ్ మూసా అలియాస్ అస్మీన్ మూసా,అలీబాయ్ అలియాస్ తల్హా నేరుగా ఉగ్రదాడికి పాల్పడినట్లు ఎన్ఐఏ తెలిపింది.పాకిస్తాన్ పౌరులైన ఆ ఇద్దరు ఉగ్రవాదులు పహల్గాం ఉగ్రదాడికి కొన్ని వారాల ముందు భారత్ భూభాగంలోకి ప్రవేశించినట్లు మిగతా 2లో..

### ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు పూర్తి మద్దతు

- మరోసారి స్పష్టం చేసిన అమెరికా
- పహల్గాం ఉగ్రదాడిపై జరుగుతున్న
- దర్యాప్తులో భారత్‌కు సహకరించండి..
- పాక్‌కు జేడీ వాన్స్ సూచన వార్త 2లో

### కమ్ముకున్న యుద్ధమేఘాలు 2లో

- రెండు నెలలకు సరిపడా ఆహారం నిల్వచేసుకోండి
- పీఓకేలో ప్రజలను అలర్ట్ చేసిన అక్కడి అధికారం యంత్రాంగం
- పాక్ ప్రధాని యూట్యూబ్‌పై వేటు
- ప్రసారాలు నిలిపివేసిన భారత ప్రభుత్వం
- ఉగ్రవాదులతో బంధం నిజమే
- అంగీకరించిన బిలావల్ భుట్టో
- భారత్, పాక్ యుద్ధం జరగొచ్చు
- ఫరూక్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు

### గొర్రెల పంపిణీ స్కాం కేసులో కీలక పరిణామం

**ఏసీబీ అదుపులో ప్రధాన నిందితుడు**

**హైదరాబాద్,మే2(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన గొర్రెల పంపిణీ స్కాం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో మొదటి నుంచి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటు-న్న ఏ1 నిందితుడు మొయిను ద్దీన్‌ను శుక్రవారం ఉదయం ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. గతంలో మొయినుద్దీన్‌పై పోలీసులు ఎల్‌వోసీ జారీ చేశారు. మొయినుద్దీన్ కొడుకు ఈక్రముద్దీన్ ఇద్దరి పాస్ పోర్టును మిగతా 2లో..

## త్వరలోనే భారత్‌తో వాణిజ్య ఒప్పందం

**పరస్పర సుంకాలను నివారించడానికి డీల్ కుదుర్చుకున్న మొదటి దేశాల్లో భారత్ కూడా ఉండొచ్చు**

**అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రకటన**



**వాషింగ్టన్(జనంసాక్షి):** భారత్- అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై తాజాగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందిస్తూ..త్వరలోనే భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు ప్రకటించారు. పరస్పర సుంకాలను నివారించడానికి వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న మొదటి దేశాల్లో భారత్ కూడా ఉండొచ్చని అన్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ గురించి మాట్లాడుతూ..మోదీ చాలా మెరుగ్గా బేరసారాలు ఆడతారని, అందుకే తాము ఆయనను గౌరవిస్తామని అన్నారు.భారత్ యూఎస్‌కు వ్యవసాయ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధించడం వల్ల తమ దేశంలోని రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాన్స్ అన్నారు. కానీ, భారత్ మాత్రం తమ దేశం నుంచి ఎన్నో ఏళ్లుగా ప్రయోజనం మిగతా 2లో..



### ప్రభాకర్ రావుకు హైకోర్టులో చుక్కెదురు

**ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు లో నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మిగతా 2లో..

### సోనియా, రాహుల్‌కు నోటీసులు

**నేషనల్ హెరాల్డ్ కేసులో ఢిల్లీ కోర్టు తాఖీదులు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు దిల్లీ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఛార్జిషీట్‌పై న్యాయబద్ధమైన విచారణ జరిగే సమయంలో ఎప్పుడైనా అవతలి పక్షంవారు తమ వాదనలు వినిపించే హక్కు ఉంటుందని ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ విశాల్ గోగ్నే అన్నారు. దీనిపై తదుపరి విచారణను మే8కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.కొత్త చట్ట మిగతా 9లో..

## గంగాఎక్స్‌ప్రెస్‌వేపై యుద్ధవిమానాల గర్జన



**అత్యవసర పరిస్థితుల్లో టేకాఫ్, ల్యాండింగ్‌పై సాధన**

**లక్నో(జనంసాక్షి):** వాయుసేన యుద్ధవిమానాలు అత్యవసర పరిస్థితుల్లో ఎక్స్‌ప్రెస్‌వేపై టేకాఫ్, ల్యాండింగ్‌ను సాధన చేస్తున్నాయి. శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని షాజహాన్‌పుర్‌లోని గంగాఎక్స్‌ప్రెస్‌వేపై ఉన్న దాదాపు 3.5 కిలోమీటర్ల ఎయిర్ స్ట్రిప్‌పై ఈ సాధన జరుగుతోంది. దీనిని యుద్ధవిమానాలు ల్యాండింగ్‌కు అనుకూలంగా నిర్మించారు. ఎక్స్‌ప్రెస్ రహదారి రన్‌వేకు మిగతా 9లో..

## ఆలోచించి చెప్తాం

**ట్రంప్ చర్చల ప్రతిపాదనపై డ్రాగన్**

**బీజింగ్(జనంసాక్షి):** అమెరికా, చైనాల మధ్య పరస్పర సుంకాల నేపథ్యంలో వాణిజ్య యుద్ధం నెలకొన్న విషయం తెలిసిందే. టారిఫ్‌లపై విస్తృతస్థాయిలో చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం చైనా అధికారులను సంప్రదించింది. తాజాగా ఈ విషయంపై బీజింగ్ స్పందిస్తూ.. వాషింగ్టన్ ఇటీవల తీసుకున్న వాణిజ్య విధాన నిర్ణయాలు, సుంకాల తగ్గింపు విషయంపై అగ్రరాజ్యంతో మిగతా 2లో..



# లష్కరేతోయిబా,ఐఎస్ఐల పనే

ఎన్ఐఏ విచారణలో తేలింది. వారికి ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ సహాయం చేసినట్లు నిర్ధారించింది. అదే సమయంలో పహల్గాంలో కాల్పులు జరిగిన ప్రాంతంలో ఎన్ఐఏ ఫోరెన్సిక్, ఎలక్ట్రానిక్ డేటా సేకరించింది. ఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్న 40కి పైగా తుపాకుల బాలిస్టిక్, కెమికల్ టెస్టులు జరిపేందుకు ల్యాబ్‌కు పంపింది.ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డ తీరును గుర్తించేందుకు లేజర్ స్కానర్ల సాయంతో త్రీడీ మ్యాపింగ్ చేసింది. ఈ 3డీ మ్యాపింగ్ సాయంతో కాల్పుల జరిగే సమయంలో ఉగ్రవాదులు పొజిషన్‌తో పాటు టూరిస్టులు ఎలా కుప్పకూలారు. బ్లడ్ శాంపిల్స్, కాల్పులు జరిగినప్పుడు బుల్లెట్ల నుంచి వెలువడ్డ రసాయనాలు వంటి వాటిని సేకరించారు. లోయ చుట్టూ ఉన్న మొబైల్ టవర్ల నుండి డంప్ డేటాను కలెక్ట్ చేశారు. ఈ డేటా ఆధారంగా ఉగ్రదాడి ముందు రోజుల్లో కాల్పులకు తెగ బడ్డ ప్రదేశం నుంచి శాటిలైట్ ఫోన్‌లను వినియోగించారని, ముఖ్యంగా బైసరీన్, దాని చుట్టు పక్కల ప్రదేశాల్లో కనీసం మూడు శాటిలైట్ ఫోన్లను నిందితులు వినియోగించగా.. రెండు శాటిలైట్ ఫోన్ల సిగ్నల్స్‌ను గుర్తించారు. ఉగ్రదాడిపై మొత్తం 2,800 మందికి పైగా ఎన్ఐఏ, భద్రతా సంస్థలు ప్రశ్నించాయి. మే2 నాటికి మరో 150 మందిని విచారించేందుకు కస్టడీలోకి తీసుకున్నాయి. వీరిలో అనుమానిత ఓజీడబ్ల్యూ, జమాత్-ఇ-ఇస్లామి వంటి నిషేధిత గ్రూపులు, హురియత్ కాన్ఫరెన్స్‌లోని వివిధ వర్గాలతో సంబంధాలు ఉన్న వ్యక్తులు ఉన్నారు.ఉగ్రవాద సంస్థలు, తిరుగుబాటు గ్రూపులకు సాయుధ కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా పాల్గొనకుండా లాజిస్టికల్, ఆర్థిక సమాచార సహాయాన్ని అందించే వ్యక్తులను ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ (%ూ+ఔ%లు) అంటారు.కాల్పులు జరిపిన తరువాత మిగిలి ఉన్న మందుగుండు సామాగ్రి భాగాన్ని కార్ట్రిడ్జ్ అంటారు. వాటిల్లో బుల్లెట్‌లు,మందుగుండు సామగ్రిలో చేర్చే షెల్, గన్ పౌడర్, గన్‌లో ఉండే బులెట్లను మండించే ప్రైమర్ల అనే భాగాలున్నాయి.

జైసల్మేర్‌లో పాక్ గూఢచారి అరెస్ట్

పాకిస్థాన్ ఐఎస్ఐ కోసం గూఢచర్యం చేస్తున్నట్లు ఆరోపణలపై 40 ఏళ్ల జైసల్మేర్ నివాసి పఠాన్ ఖాన్‌ను రాజస్థాన్ ఇంటెలిజెన్స్ అరెస్ట్ చేసింది. భారత సైన్యం కదలికల సమాచారం పంపినట్లు విచారణలో తేలింది.జైసల్మేర్.. పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలో ఉండటం వల్ల గూఢచర్యకు కేంద్రంగా మారిందని అధికారులు గుర్తించారు.2022లో ఆపరేషన్ సర్హద్‌లో 36 మంది అనుమానిత గూఢచారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఐఎస్ఐ.. భారత సైనిక కార్యకలాపాల సమాచారం సేకరించేందుకు పదేపదే ప్రయత్నిస్తోందని గుర్తించారు. భారత దేశ జాతీయ భద్రతను దెబ్బతీసేందుకు గూఢచర్యం పాకిస్తాన్‌కు ఒక సాధనంగా మారింది. భారత్-పాకిస్థాన్‌ల భౌగోళిక-రాజకీయ పోరాటంలో భాగంగా ఈ సంఘటనలు జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు.

# కమ్ముకున్న యుద్ధమేఘాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణ నెలకొంది. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు సూచనలు వినిపిస్తున్నాయి.ఇలాంటి తరుణంలో ఆహారం నిల్వ చేసుకోవాలంటూ స్థానికులను పీఓకే యంత్రాంగం అప్రమత్తం చేసింది.‘‘రెండు నెలలకు సరిపడా ఆహారాన్ని నిల్వ చేసుకోవాలని వాస్తవాధీన రేఖకు సమీపంలో ఉన్న 13 నియోజకవర్గాల ప్రజలకు సూచనలు చేశాం’’ అని చౌధ్రీ అన్వర్ ఉల్‌హక్ స్థానిక అసెంబ్లీలో శుక్రవారం వెల్లడించారు. కాగా, భారత సంతతికి చెందిన బ్రిటీష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ ఇటీవల మాట్లాడుతూ.. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. ఉగ్రవాదులను శిక్షించడానికి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే.. భారత్ కఠినంగా జవాబివ్వాలని కోరారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలా క్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేశారు. కశ్మీర్ వివాదంలో ఈ ఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

ఉగ్రవాదులతో బంధం నిజమే : బిలావల్ భుట్టో

పహల్గాం దాడి తర్వాత భారత్‌పై ప్రేలాపనలు చేస్తోన్న పాకిస్థాన్ మధ్యమధ్యలో నోరు జారి నిజాలు మాట్లాడుతోంది. ఉగ్రవాద సంస్థలతో పాకిస్థాన్‌కు సంబంధాలు నిజమేనంటూ తాజాగా ఆ దేశ విదేశాంగశాఖ మాజీ మంత్రి, పాక్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో అంగీకరించారు. ఉగ్రవాద సంస్థలకు మద్దతు, ఆర్థిక సాయం పాక్ అందించిందని ఇటీవల ఆ దేశ రక్షణశాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ అంగీకరించిన సంగతి తెలిసిందే. తాజాగా మీడియాతో మాట్లాడుతూ భుట్టో అదేతరహా వ్యాఖ్యలు చేశారు.‘‘రక్షణ మంత్రి చెప్పిన ప్రకారం.. పాకిస్థాన్‌కు గతం ఉందనేది రహస్యం కాదని నేను భావిస్తున్నా. ఫలితంగా మనం బాధపడ్డాం. పాకిస్థాన్ నష్టపోయింది. ఆ పరిణామాల నుంచి పాఠాలు నేర్చుకున్నాం. ఈ సమస్య పరిష్కారానికి అంతర్గత సంస్కరణలు చేపట్టాం. పాకిస్థాన్ తీవ్రవాద చరిత్ర తిరస్కరించలేనిది. అయితే, అది ముగిసిన అధ్యాయం. అది మన చరిత్రలో ఒక దురదృష్ట భాగం’’ అని భుట్టో వెల్లడించారు. పహల్గాం దాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ ‘స్కై న్యూస్’ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ తరుణంలో నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య యుద్ధం జరిగే అవకాశం లేకపోలేదని చెప్పుకొచ్చారు. అలాగే, ఈ ఘటనకు భద్రత, నిఘా లోపాలు కూడా ఒక కారణమని అన్నారు.పహల్గాం ఘటనపై తాజాగా ఫరూక్ అబ్దుల్లా స్పందిస్తూ ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించారు. తాజాగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ యూట్యూబ్ ఛానల్ స్ట్రీమింగ్‌ను మనదేశంలో నిలిపివేసింది. జాతీయ భద్రతకు సంబంధించి భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కంటెంట్ ప్రస్తుతం ఈ దేశంలో అందుబాటులో లేదని ఆ ఛానల్ క్లిక్ చేసిన వారికి ఒక సందేశం దర్శనమిస్తోంది.

## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు పూర్తి మద్దతు

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా నుంచి పాకిస్థాన్‌కు మరోసారి చేదు ప్రకటన వెలువడింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తాము భారత్ పక్షాన నిలబడతామని అగ్రరాజ్యం పేర్కొంది. ప్రధాని నరేంద్రమోదీకి సంపూర్ణ మద్దతు ఇస్తామని అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి టామీ బ్రూస్ వెల్లడించారు. ఆమె రోజువారీ ప్రెస్ బ్రీఫింగ్స్‌లో భాగంగా గురువారం ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్-పాక్‌లు బాధ్యతయుతంగా సుదీర్ఘ శాంతి కోసం అవసరమైన పరిష్కారంపై పనిచేయాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వ్యాఖ్యలను ఆమె పునరుద్ఘాటించారు. భారత్-పాక్ ఉద్రిక్తతలను అమెరికా చాలా జాగ్రత్తగా గమనిస్తోందని పేర్కొన్నారు.’’ అధ్యక్షుడు ట్రంప్ గత వారం ప్రధాని మోదీతో మాట్లాడుతూ తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ట్రెర్రరిజానికి వ్యతిరేకంగా భారత్ పక్షాన నిలుస్తామని పేర్కొన్నారు. ఇక మా విదేశాంగ మంత్రి ఇరుదేశాలు చర్చలకు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారు. అదే దక్షిణాసియాలో శాంతి నెలకొల్పుతుందని పేర్కొన్నారు. మేము ఇరుదేశాల ప్రభుత్వాలతో టచ్‌లో ఉన్నాం’’ అని బ్రూస్ వెల్లడించారు.ఇటీవల అమెరికా విదేశాంగ మంత్రి రూబియో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిని ఖండించాలని సూచించారు. అదే సమయంలో పాక్ అధికారులు దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని కోరారు.పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడిలో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ పరిణామాలపై తాజాగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ దాడి విషయంలో భారత్ ప్రతిస్పందన ప్రాంతీయ సంఘర్షణలకు దారితీయకుండా ఉండాలని కోరారు. అంతేగాక, ఉగ్ర వేటలో న్యూఢిల్లీకి పాక్ సహకరించాలని పిలుపునిచ్చారు. ‘‘పర్యాటకులపై ఉగ్రదాడి ఘటన తీవ్ర దిగ్భ్రాంతికరం. అయితే, దీనికి భారత్ ప్రతిస్పందించడం సరైనదే. అయితే, అది విస్తృత ప్రాంతీయ సంఘర్షణలకు దారితీయనివిధంగా ఉంటుందని మేం విశ్వసిస్తున్నాం. ఇక, పాకిస్థాన్ కూడా ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆశిస్తున్నాం.

# పహల్గాంపై కానరాని ప్రతివ్యూహం

- దాడి జరిగి రోజులు గడుస్తున్నా కేంద్రం నుంచి సరైన స్పందన లేదు
- దేశ భద్రత విషయంలో కేంద్రానికి అండగా విపక్షం
- పహల్గాం దాడి తరువాత ప్రపంచానికి ఇదే సందేశం ఇచ్చాం
- సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



**ఢిల్లీ(జనంసాక్షి):** దేశ భద్రత విషయంలో మొత్తం విపక్షం కేంద్రానికి మద్దతుగా నిలుస్తుందన్నారు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం ప్రపంచానికి కూడా ఇదే సందేశం ఇచ్చామన్నారాయన. శుక్రవారం జరిగిన సీడబ్యూసీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. ‘ పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిగా ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన వ్యూహం కనిపించలేదు. రాహుల్ గాంధీ కాన్పూర్ లో చనిపోయిన శుభం ద్వివేదీ కుటుంబాన్ని కలిశారు. చనిపోయిన వారికి ‘అమరుల’ హోదా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.దేశ భద్రత విషయంలో మొత్తం విపక్షం కేంద్రానికి మద్దతుగా నిలుస్తుంది. ప్రపంచానికి ఇదే సందేశం ఇచ్చాం. మోదీ ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన నిర్వహించాలని నిర్ణయించింది. ఇది రాహుల్ గాంధీ దీర్ఘకాలిక ఉద్యమ ఫలితమే. ఆయన ‘‘భారత్ జోడో న్యాయ యాత్ర’’ ద్వారా దీనిని ప్రధాన అజెండాగా మార్చారు. తెలంగాణ, కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పటికే కుల సర్వే పూర్తి చేశాయి.50% రిజర్వేషన్ సీలింగ్ ఎత్తివేయాలి. గణన నుండి వచ్చిన సమాచారాన్ని ప్రభుత్వం మంచి పాలన కోసం ఉపయోగించాలి.కులగణన కచ్చితంగా జరగాలి. ఫలితాలను అమలు చేయాలి. పాలసీలు, చట్టాలు దానికి అనుగుణంగా ఉండాలి. 2021 సాధారణ జనగణన కూడా జరగలేదు. ఇప్పటికీ 2011 డేటానే ఉపయోగిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ యొక్క రిజర్వేషన్ వ్యతిరేక దృక్పథమే ఈ ఆలస్యం వెనుక కారణం’ అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# కులగణనకు తెలంగాణే రోల్‌మోడల్

ఒక గొప్ప సామాజిక విప్లవానికి నాంది పలికే ప్రక్రియ తెలంగాణ రోల్ మోడల్‌గా నిలవడం నాకెంతో గర్వంగా ఉంది. అత్యద్భుతంగా, అత్యంత పారదర్శకంగా కుల గణన నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను దేశ స్థాయిలో చాటిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా మరొక్కసారి నా అభినందనలు’’ అని తెలిపారు.

## 600 చ.అడుగులు మించొద్దు

ఈ నెల 5 నుంచి 20 వరకు 28 మండలాల్లో భూభారతి సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మంత్రి సచివాలయం నుంచి సీఎస్ రామకృష్ణారావుతో కలిసి భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులని తేలితే ఇళ్ల నిర్మాణం మధ్యలో ఉన్నా సరే రద్దు చేస్తామని, జాబితా -1, జాబితా -2, జాబితా -3లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపిక చేయాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెల 4న జరగనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అధికారుల్ని ఆదేశించారు.

## గ్రూప్-1 అంశంపై విచారణ వాయిదా

శుక్రవారం పిటిషనర్ల తరపున న్యాయవాది రచనారెడ్డి, టీజీపీఎస్సీ తరపున న్యాయవాది రాజశేఖర్ తమ వాదనలు వినిపించారు.రీకౌంటింగ్‌లో ఓ అభ్యర్థికి 60 మార్కులు తగ్గాయని రచనారెడ్డి కోర్టుకు తెలపడంతో ఆ అభ్యర్థి జవాబు పత్రాలు కోర్టుకు సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి విచారణలో సమర్పిస్తామని టీజీపీఎస్సీ తరపు న్యాయవాది రాజశేఖర్ కోర్టుకు తెలిపారు. వెకేషన్‌లోగా స్టేపై నిర్ణయం తీసుకోవాలని డివిజన్ బెంచ్ చెప్పిందని టీజీపీఎస్సీ కోర్టుకు తెలిపింది. కాగా.. విచారణను వేగంగా ముగించలేమని జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. వేలాది మందికి సంబంధించిన విషయం గనక తొందరపడవద్దని, వెంటనే తీర్పు కావాలని ఒత్తిడి చేయొద్దని టీజీపీఎస్సీకి సూచించారు. అనంతరం విచారణను జూన్ 11కు వాయిదా వేశారు.

# త్వరలోనే భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటాం

పొందుతోందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో అమెరికన్ వస్తువులకు కొత్త మార్కెట్లను తెరవడం, కార్మికులకు హాని కలిగించే అన్యాయమైన పద్ధతులను తొలగించడం వంటి విషయాలపై భారత్‌తో చర్చిస్తున్నామన్నారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్‌తో పాటుగా జపాన్, కొరియా వంటి దేశాలతోనూ చర్చలు జరుపుతున్నామని వాన్స్ పేర్కొన్నారు.ఇటీవల జేడీ వాన్స్ భారత పర్యటనకు వచ్చిన సమయంలో ప్రధాని నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత్, అమెరికా కొనసాగిస్తున్న చర్చల్లో పురోగతిపై ఇరుదేశాల నేతలు సంతృప్తి వ్యక్తంచేశారు. ఇంధనం, వ్యూహాత్మక సాంకేతికతలు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవడంపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు

# అమరావతికి కేంద్ర సాయం

అమరావతి అంటే కేవలం ఒక నగరమే కాదని.. ఒక శక్తి అని అభివర్ణించారు. అమరావతి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్న ప్రధాని.. రాష్ట్రంలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుందని వ్యాఖ్యానించారు. అమరావతి పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. తన ప్రసంగాన్ని తెలుగులో మొదలు పెట్టిన ఆయన.. దుర్గాభవానీ కొలువైన ఈ పుణ్య భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉందని అన్నారు. తన ప్రసంగం మధ్యమధ్యలో తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు. ఇవాళ దాదాపు రూ.60 వేల కోట్ల పనులకు శంఖుస్థాపనలు చేశా.. అయితే ఇవి కేవలం శంఖుస్థాపనలే కాదు.. ఏపీ ప్రగతికి, వికసిత్ భారత్‌కు బలమైన పునాదులని పేర్కొన్నారు. శుక్రవారం వెలగపూడిలో అమరావతి పునర్నిర్మాణ పనులను మోదీ ప్రారంభించారు. మొత్తం 18 ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. మోడీ చేతుల మీదుగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభంఅయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మోడీ మాట్లాడుతూ.. ఏఐ, ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్ ఇలా అన్ని రంగాల్లో అమరావతి కీలకంగా మారబోతుందని అన్నారు. అమరావతి ప్రతి వ్యక్తి కలల నిర్మాణమని.. త్వరలోనే వారి స్వప్నం సాకారం కాబోతుందని చెప్పారు. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు ఐటీ విజన్ అద్భుతమని.. ఆయన ఐటీ విజన్ ను నేను అప్పుడు గుజరాత్ సీఎంగా ఉండి పరిశీలించానని తెలిపారు. నాణ్యమైన ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలంటే చంద్రబాబు తర్వాతే ఎవరైనా అని ప్రశంసించారు. 2015లో అమరావతి నిర్మాణానికి నేనే శంఖుస్థాపన చేశా.. పదేండ్లు ఏపీ అభివృద్ధి కోసం సహకరించామని పేర్కొన్నారు. ఏపీని వికసిత్ భారత్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తయారు చేయాలని కోరారు. ఏపీలో కనెక్టివిటీ-కి కొత్త అధ్యాయం మొదలైందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌కు ఇది శుభ సంకేతమని చెప్పారు. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలని ప్రధాని ఆకాంక్షించారు. టెక్నాలజీ నాతో మొదలైనట్లు- చంద్రబాబు ప్రశంసించారు. నేను గుజరాత్ సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీని ఎలా అభివృద్ధి చేశారో తెలుసుకున్నా. అధికారుల్ని పంపించి హైదరాబాద్ ఐటీ- అభివృద్ధిని అధ్యయనం చేయించా. పెద్ద ప్రాజెక్టులు చేపట్టాలన్నా.. త్వరగా పూర్తి చేయాలన్నా చంద్రబాబుకే సాధ్యం. పెద్ద పెద్ద పనుల్ని చేపట్టి పూర్తి చేయడంలో చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు. 2015లో ప్రజా రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేశా. గత పదేళ్లలో అమరావతికి కేంద్రం మద్దతుగా నిలిచింది. అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించింది. ఇప్పుడూ అమరావతి అభివృద్ధికి కేంద్రం సహకారం కొనసాగుతుంది. అమరావతిలో అన్ని రకాల నిర్మాణాలకు కేంద్రం తోడ్పాటు- అందిస్తుందని అన్నారు.ఎన్టీఆర్.. వికసిత ఏపీ కోసం కలలుగన్నారు. మనందరం కలిసి ఆయన కలల్ని నిజం చేయాలి. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి. పవన్ కల్యాణ్ గారూ ఇది మనం చేయాలి. మనమే చేయాలి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచింది. ఏపీలో రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం రూ.వేల కోట్లు సాయం చేస్తోంది.

# కేరళలో డీప్ వాటర్ సీపోర్టు

**తిరువనంతపురం(జనంసాక్షి):**కాంగ్రెస్ నేత శశిథరూర్ కేరళలో ప్రధాని మోదీ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనిపై మోదీ సెటైర్లు వేసారు. ఇది చూసి కొందరికి నిద్రపట్టదని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం కేరళలో పర్యటించారు. తిరువనంతపురం సమీపంలో రూ.8,900 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన విఝింజమ్ ఇంటర్నేషనల్ డీప్‌వాటర్ మల్టీపర్పస్ సీపోర్టును ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరువనంతపురం ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ హాజరయ్యారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. ప్రతిపక్ష పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఈ ఫొటో చూసి కొందరికి నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు.ఈ రోజు శశిథరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ ప్రోగ్రామ్ కొందమందికి నిద్ర లేని రాత్రిని మిగులుస్తుంది. ఈ సందేశం ఎక్కడికి వెళ్లాలో అక్కడికి వెళ్లిపోయిందని మోదీ చమత్కరించారు. కాగా.. గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధానిని థరూర్ వ్యక్తిగతంగా వెళ్లి స్వాగతించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. దిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల ఆలస్యం ఉన్నప్పటికీ.. సమయానికి తిరువనంతపురం చేరుకోగలిగా. నా నియోజకవర్గానికి వచ్చిన మోదీని సాదరంగా స్వాగతించానని థరూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ అధినాయత్వంతో శశిథరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా థరూర్ తన సొంత పార్టీపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

# గొర్రెల పంపిణీ స్కాం కేసులో కీలక పరిణామం

అధికారులు సస్పెండ్ చేశారు. ఈ క్రమంలోనే మొయినుద్దీన్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

# ప్రభాకర్ రావుకు హైకోర్టులో చుక్కెదురు

హైకోర్టు కొట్టివేసింది. ప్రభాకర్‌రావు 30ఏళ్లకు పైగా వివిధ హోదాల్లో విధులు నిర్వహించారని, రాష్ట్రపతి అవార్డును సైతం పొందారని ఆయన తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. ఫోన్ ట్యాపింగ్ కేవలం కక్షసాధింపు మాత్రమేనని వాదించారు. కొందరు రాజకీయ నేతలను లక్ష్యంగా చేసుకొని పెట్టిన కేసులో ప్రభాకర్‌రావుని నిందితుడిగా చేర్చారన్నారు. ఫోన్ ట్యాపింగ్ జరగలేదని.. కీలకమైన పరికరాలను ధ్వంసం చేశారనడంలో వాస్తవంలేదని తెలిపారు.65 ఏళ్ల వయసు ఉన్న ప్రభాకర్‌రావు క్యాన్సర్ చికిత్స కోసం అమెరికాలో ఉన్నారని.. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభాకర్‌రావు ఆదేశంతోనే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, ఆయనకు బెయిల్ మంజూరు చేయొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. పదవీ విరమణ పొందిన తర్వాత అప్పటి ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో ఓఎస్డీగా కీలకమైన ఎస్ఐబీలో కొనసాగారన్నారు. ప్రధాన నిందితుడైన ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తే కీలక సమాచారం వస్తుందని పీపీ వాదించారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

# ఆలోచించి చెప్తాం

చర్చలు జరపాలా..? వద్దా.. అని యోచిస్తున్నట్లు వెల్లడించింది. ‘‘టారిఫ్ సమస్యలపై బీజింగ్‌తో చర్చలు జరపాలనే ఆశను వ్యక్తంచేస్తూ అమెరికా సంబంధిత వర్గాల ద్వారా అనేకసార్లు సందేశాలను పంపింది. దీంతో చర్చల విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోవాలనే విషయాన్ని అధికారులతో సంప్రదించి ఓ అంచనాకు వస్తాము’’ అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.అయితే తమపై టారిఫ్ విధిస్తూ.. వాణిజ్య యుద్ధాన్ని అమెరికా ఏకపక్షంగా ప్రారంభించిందని వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రతినిధి అన్నారు. ఇప్పుడు ఆ దేశం తమతో చర్చలు జరపాలంటే తమతో నిజాయతీగా ఉండాలని తెలిపారు. బీజింగ్‌తో వ్యవహరిస్తున్న తప్పుడు పద్ధతులను సరిదిద్దుకొని.. తమపై విధించిన ఏకపక్ష సుంకాలను ఎత్తివేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే అమెరికాతో బీజింగ్ సానుకూల చర్యలు చేపడుతుందని తెలిపారు.మరోవైపు చైనానే టారిఫ్‌లపై చర్చల కోసం తీవ్రస్థాయిలో యత్నిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. బుధవారం కూడా ఆయన మాట్లాడుతూ డీల్ కుదుర్చుకోవడానికి బలమైన అవకాశాలున్నాయని చెప్పారు. ‘‘చర్చల్లో మా నిబంధనలకు లోబడే ఒప్పందం చేసుకోనున్నాం. అదే మంచిది’’ అని ఆయన న్యూస్‌నేషన్ టౌన్ హాల్ కార్యక్రమంలో వెల్లడించారు. దాదాపు వారం రోజుల క్రితం ట్రంప్ ఇటువంటి ప్రకటనే చేయగా.. చైనా బహిరంగానే ఖండించింది. నాడు బీజింగ్ ప్రతినిధి గువో జియాకున్ మాట్లాడుతూ ‘‘ఇరుదేశాల మధ్య సంప్రదింపులు ఏమీ జరగడం లేదు.

# యువతకు ఉపాధి కల్పిస్తాం

నిబంధనలు అమలు చేస్తూ ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. ఉద్యోగులకు కష్టంగా ఉంటుందని ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల రాబోయే రోజుల్లో ఇబ్బందుల పాలవుతామని, నిబంధనలతో, శ్రమతో కూడిన అడుగులు వేయాలన్నారు.మహాత్మా జ్యోతిరావ్ పూలే ప్రజా భవన్ లో శుక్రవారం సాయంత్రం ఆయన సింగరేణి కారుణ్య నియామకాల వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచడం వల్ల లబ్ధి పొందిన వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కారుణ్య ఉద్యోగాలలో గరిష్ట వయోపరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచాలని కార్మికులు, కార్మిక సంఘాలు కోరిన ఎదుట దీనిపై తక్షణమే మానవతా దృక్పథంతో స్పందించి అంగీకరించామని, దీనివల్ల 35 సంవత్సరాల వయో పరిమితి దాటిన అనేక వందల మందికి ఉద్యోగాలు లభించే అదృష్టం దక్కిందన్నారు. సింగరేణి సంస్థ నేడు పోటీ మార్కెట్లో ఇతరులతో పోటీపడి నిలవాల్సిన పరిస్థితి ఉందని, కనుక సింగరేణి కార్మికులు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ పూర్తి పనిగంటలు పనిచేస్తూ కంపెనీని కాపాడుకోవాలని భవిష్యత్తు తరాలకు దీనిని ఒక వారసత్వంగా అందించాలన్నారు. సింగరేణిని ఇతర రంగాల్లోకి, ఇతర రాష్ట్రాల్లోకి కూడా విస్తరిస్తున్నామని,కొత్తగా ఉద్యోగంలో చేరిన సింగరేణి వారసులు తేలికపాటి ఉద్యోగం కోసం విఫల ప్రయత్నాలు చేయకుండా, ఇచ్చిన పనిని సమర్థంగా నిర్వహిస్తూ కంపెనీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అదే సమయంలో తమ ప్రభుత్వం రాష్ట్రంలో నిరుద్యోగులకు పెద్ద ఎత్తున స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో 9 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినం జూన్ 2వ తేదీన పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. . ఆయన ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరో ఆరు గనులు.. 20వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.



# గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కాంగ్రెస్ నేతల భేటీ

**బిసి బిల్లు ఆమోదించి రాష్ట్రపతికి పంపినందుకు మంత్రుల కృతజ్ఞతలు**

హైదరాబాద్,మే2(జనంసాక్షి):కాంగ్రెస్ బీసీ నేతలు శుక్రవారం ఉదయం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి కృతజ్ఞతలు తెలియచేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, కేకే, మధుయాష్కీ నేతృత్వంలో గవర్నర్‌ను కలిశారు. బీసీలకు రాజకీయ, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఉభయ సభల్లో చేసిన బిల్లుకు గవర్నర్ ఆమోదం పొంది రాష్ట్రపతికి పంపినందుకు కాంగ్రెస్ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా గవర్నర్‌ను కలిసిన వారిలో ప్రభుత్వ విప్ బీర్ల ఆయిలయ్య, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, మేయర్ విజయలక్ష్మి తదితరలు ఉన్నారు. స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు మంత్రి పొన్నం మార్చి 18 శాసనసభలో ప్రవేశపెట్టిన రెండు బిల్లులు ఆమోదం పొందాయి. ఆ మరుసటి రోజు మంగళవారం వాటిని శాసన మండలిలో ప్రవేశపెట్టి ఆమోదంపొందిన అనంతరం వాటిని ప్రభుత్వం గవర్నర్‌కు పంపారు. ఆయన వాటిని పరిశీలించి.. రాష్ట్రపతికి పంపారు.


## జై శ్రీరామ్.. భారత్ మాతా కీ జై నినాదాలతో..

# దళిత యువకుడిని నగ్నంగా ఊరేగింపు

- కాళ్ళు, చేతులు గుడిగోడకు కట్టేసి దాడి
- చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో దారుణం
- ఆలస్యంగా వెలుగులోకి.. సోషల్ మీడియాలో వైరల్
- ఆలయంలో ప్రవేశించాడనే నెపంతో కొట్టినట్టు బాధితుల ఫిర్యాదు
- కొమురవెల్లి పోలీస్ స్టేషన్ లో 9 మందిపై కేసు..
- మరికొందరి కోసం ఆరా
- బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శిస్తున్న పలు సంఘాలు, పార్టీల నాయకులు



చేర్యాల, మే 02 (జనంసాక్షి) సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో దారుణం జరిగింది. బేడ బుడగ జంగాల కులానికి చెందిన (మతిస్థిమితం లేని) ఊపిరి అజయ్ కుమార్ అనే దళిత యువకుడిపై ఆర్ఎస్ఎస్, బిజెపి, విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్‌కు సంబం ధించిన నాయకులు దాష్టీకానికి ఒడిగట్టారు. ఎల్లదాసునగర్ కు చెందిన దళిత యువకుడు అజయ్ కుమార్ మద్యం తాగి హనుమాన్ ఆలయంలోకి వచ్చాడనే నెపంతో గత మూడురోజుల క్రితం అతనిపై కొంతమంది దాడికి దిగారు. కాళ్ళు చేతులు కట్టేసి.. రోడ్డుపై బట్టలు విప్పి నగ్నంగా ఊరేగించారు. గుడి గోడకు కట్టేశారు. అయి తే ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూడడం గమనార్హం. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో దళితసంఘాలు ఆందోళనకు దిగాయి. ఘటనా విషయాన్ని శుక్రవారం రోజు తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సభ్య సమాజం తలదించుకునేలా విపరీతంగా కర్రలతో కొడుతూ నగ్నంగా ఊరేగించిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు చేసి శిక్షించాలని ఎమ్మార్పీఎస్, దళిత హక్కుల పోరాట సమితి, కుల వివక్ష పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ టిఎస్, మాల మహానాడు, బహుజన సమాజ్ పార్టీ, చేర్యాల అంబేద్కర్ సంఘం, షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి, కరెన్సీ నోటుపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చేర్యాల సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్రీనుకు ఫిర్యాదు చేశారు. ఆలయంలోకి ప్రవేశించాడనే నెపంతో ఇది కులదురహంకారపు దాడిగానే భావిస్తున్న ట్టు చెప్పారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులను తక్షణమే చట్ట ప్రకారం అరెస్టు చేసి కేసులు నమోదు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదిం చుకునేలా మతం పేరుతో భారత్ మాతాకీ జై అంటావా లేదా అని దళితుల మీద దాడి చేయడం అమానుషమని తెలిపారు. ఇలాంటి ఘటనలు ఈ చేర్యాల ప్రాంతంలో జరగడం ఇదే మొదటి సారి అని, వెంటనే ఈ చర్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించా లని అన్నారు. అప్పటివరకు దళిత సంఘాలుగా ఉద్యమిస్తా మని తెలియజేశారు. అయితే ఈ ఘటనలో బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిమీద కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఘటనకు కారణమైన మరికొందరిని గుర్తించే పనిలో ఉన్నామని అన్నారు. వాళ్లందరిపై ఖచ్చితంగా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినవారిలో ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా నాయకులు మల్లిగారి యాదగిరి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రామగాళ్ళ నరేష్, టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు భూమిగా రాజేందర్, కుల వివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బక్కెల్లి బాలకిషన్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నాల ప్రసాద్, అంబేద్కర్ సంఘం నాయకులు జేరిపోతుల పరుశరాములు, మల్లిగారికి రాజు, షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి నాయకులు బుట్టి బిక్షపతి, మాల మహా నాడు రాష్ట్ర నాయకులు బుట్టి సత్యనారాయణ, పుట్ట రాజు, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కొంద్ర మల్లేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మల్యాల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు భూమిగారి మధుకర్, బిఆర్ఎస్వీ, ప్రేమ్ కుమార్, భూమిగారి దామోదర్, తదితరులు పాల్గొన్నారు.



# పహల్గాం ఘటన కేంద్ర ప్రభుత్వ వైఫల్యం

- ప్రధాని నరేంద్ర మోడీ, హెూం మంత్రి అమిత్ షాలు నైతిక బాధ్యత వహించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి




**చిగురుమామిడి, మే01(జనం సాక్షి) :** పహల్గాం ఘటన కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్ లో సీపీఐ మండల 19వ మహాసభ అందె చిన్న స్వామి, గోలీ బాపు రెడ్డి, కయ్యం సుజాత అధ్యక్షతన జరిగింది. మహాసభ ప్రారంభ సూచికగా కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సీపీఐ జెండాను మాజీ మండల కార్యదర్శి, సీనియర్ నాయకులు తేరాల సత్యనారాయణ ఎగురవేశారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు ఎవడుస్తున్న పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదని నరేంద్ర మోడీ పరిపాలనలో కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు మేలు కలిగించే విధానాలకు పాల్పడుతున్నాడని, నిరుద్యోగం పెరిగిపోయిందని, ఏటా కోటి ఉద్యోగాల మాట నీటి మూటలై నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాడని, నల్ల డబ్బు వెనక్కు తీసుకరాకపోగా బడా పెట్టుబడిదారులకు అనేక రాయితీలు కల్పిస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నాడని ఆరోపించారు. పహల్గాం లో ఉగ్రవాదుల దాడి జరగడం దురదృష్టకరమని, బిజెపి పరిపాలన వైఫల్యం కొట్టొచ్చు నట్టు కనబడిందని అందుకు నైతిక బాధ్యత నరేంద్ర మోడీ అమిత్ షాలు వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సిపిఐ సహకారంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు పరచాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డి సర్కార్ పై ఉందని, సంక్షేమ పథకాల అమల్లో అర్హులైన పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇతర సంక్షేమ పథకాలు అందించాలని, పూర్తి స్థాయి లో రైతులకు రుణమాఫీ చేసి భూ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి చాడ వెంకటరెడ్డి కితుకు పలికారు. భారత దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలలోకి అడిగినందున గల్లీ నుండి డిల్లీ వరకు ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామని, ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేసి భూసంస్కరణ చట్టం సమాచార హక్కు చట్టం రాజభరణాల రద్దు, గ్రామీణ ఉపాధి హామీ పథకం లాంటి ప్రజా ఉపయోగకర పథకాలు తీసుకురావడానికి సిపిఐ ఎంతో కృషి చేసిందని అన్నారు. రానున్న రోజుల్లో మండలంలో పార్టీని బలోపేతం చేయడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ మండలంలో సిపిఐ కి ఎంతో బలముందని,ఎన్నో పోరాటాలు,ఉద్యమాలు నిర్వహించి అనేక త్యాగాలు చేసిన పార్టీగా మంచి గుర్తింపు ఉందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు సర్పంచులుగా ఎంపీటీసీలుగా మండలంలో గెలిచి ప్రజల కోసం పనిచేయాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ జెడ్పిటిసి అందె స్వామి, బోయిని అశోక్,గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్నస్వామి,చాడ శ్రీధర్ రెడ్డి,బోయిని సర్దార్ వల్లభాయ్ పటేల్, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, బూడిద సదాశివ, ముద్రకోల రాజయ్యలతో పాటు, అన్ని గ్రామాల కార్యదర్శులు, ప్రతినిధులు హాజరయ్యారు.

## యూఎస్ వీసా కోసం కాన్సులేట్‌కు కెసిఆర్



**హైదరాబాద్, మే2 (జనంసాక్షి) :** యూఎస్ వీసా కోసం మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ గచ్చిబౌలిలోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయానికి వచ్చారు. అమెరికా వీసా కోసం కాన్సులేట్ కార్యాలయానికి వచ్చారని సన్నిహితులు తెలిపారు. ఇప్పటికే సికింద్రాబాద్ పాస్ పోర్ట్ కార్యాలయంలో పాస్‌పోర్ట్ రెన్యువల్ కోసం పత్రాలు సమర్పించారు.. ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి నేరుగా అమెరికన్ కాన్సులేట్ కి చేరుకున్న కేసీఆర్ తో పాటు జోగినపల్లి సంతోష్, జీవన్ రెడ్డి ఉన్నారు.. ఈ ఏడాది ఫిబ్రవరి 19 కేసీఆర్ సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి వచ్చిన విషయం తెలిసిందే. పాస్ పోర్ట్ రెన్యువల్ కోసం ఆయన కార్యాలయానికి వచ్చారు. ఆయన తన డిప్లమాటిక్ పాస్‌పోర్ట్ ను సబ్మిట్ చేసి సాధారణ పాస్‌పోర్ట్ ను తీసుకున్నారు. ఇప్పుడు గచ్చిబౌలిలోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయానికి వచ్చారు. అమెరికాకు కెసిఆర్ దరఖాస్తు చేశారని సమాచారం.

## ఫైరింగ్ ప్రాక్టీస్ చేయాలి

- విధి నిర్వహణలో ప్రతిఏటా తప్పనిసరి
- ఐజి చంద్రశేఖర్ రెడ్డి



**మెదక్ జిల్లా బ్యూరో, మే2 (జనం సాక్షి):** విధి నిర్వహణలో పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ఏటా ఫైరింగ్ ప్రాక్టీస్ ఉంటుందని ఐజి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మెదక్‌లో శుక్రవారం ఫైరింగ్ రేంజ్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐజి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా పోలీస్ సిబ్బందికి ప్రతి సంవత్సరం ఫైరింగ్ ప్రాక్టీస్ ఉంటుందని అన్నారు. దానిలో బాగంగా మెదక్ సిబ్బంది ఫైరింగ్ చేయుటకు సిద్దిపేట జిల్లాలోని రాజగోపాల్‌పేట వద్ద ఉన్న ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ ప్రాక్టీస్‌కు వెళ్లేవారని అన్నారు. ఇప్పుడు ఇక్కడ చూట్టుప్రక్కల చేస్తే రాళ్లు రప్పలతో ఉన్న దానిని కూడా ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దినందుకు కృషి చేసిన జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రత్యేక శ్రద్ధ వహించి పోలీస్ సిబ్బందికి ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు భూమిని కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఫైరింగ్ రేంజ్ లో రేంజ్ డిసిప్లేన్ పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీయస్పి ఎస్.వెంకట్ రెడ్డి, మెదక్ డీయస్పీ ప్రసన్న కుమార్, సీఐ లు, ఎసై లు, రెవిన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దోస్త్ నోటిఫికేషన్ విడుదల

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, మే2 (జనంసాక్షి) :** తెలంగాణలో డిగ్రీ ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి 'దోస్త్' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మూడు విడతల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించారు. మొదటి దశలో మే 3 నుంచి 21 వరకు మొదటి ఫేజ్ దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. మే 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మే 29న మొదటి ఫేజ్ సీట్ల కేటాయింపు చేస్తారు. రెండోదశలో మే 30 నుంచి జూన్ 8 వరకు దరఖాస్తుల స్వీకరణ చేపడతారు. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు. జూన్ 13న సీట్ల కేటాయింపు ఉంటుంది. మూడోదశలో జూన్ 13 నుంచి 19 వరకు దరఖాస్తుల స్వీకరణ. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు. జూన్ 23న సీట్ల కేటాయింపు పూర్తి చేస్తారు. జూన్ 30 నుంచి డిగ్రీ కళాశాలల్లో తరగతులు ప్రారంభం అవుతాయి.

## కులగణన సర్వేలో రేవంత్ విజయం

- జీర్ణించుకోలేకే కిషన్ రెడ్డి విమర్శలు: జగ్గారెడ్డి



**హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) :** కులగణన విషయంలో తెలంగాణ బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. అసెంబ్లీలో జరిగిన చర్చలో బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్ కూడా పాల్గొన్నట్లు- తెలిపారు. క్షేత్ర స్థాయికి సర్వే వెళ్ళిందని.. కిషన్ రెడ్డి ఈ విషయం తెలుసుకోవాలన్నారు. ఇంటింటికి అధికారులు వెళ్లి సర్వే చేశారన్నారు. కుల గణనపై కిషన్ రెడ్డి విమర్శలపై స్పందిస్తూ..దీనిపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కులగణనలో రేవంత్ సక్సెస్ అయ్యాడు కాబట్టి డైవర్ట్ చేసి బురద జల్లే ప్రయత్నం చేయకండన్నారు. 100 శాతం సర్వే సక్సెస్ ఫుల్ గా జరిగిందని.. గవర్నర్ కూడా ఆమోదముద్ర వేశారన్నారు. అంటే సర్వే సరిగా జరిగింది అనే కదా..? అని అన్నారు. సర్వే జరిగిన నెల రోజుకు కిషన్ రెడ్డి తెలంగాణలో లేరని అనుకుంటా అన్నారు. అందుకే ఆయనకు కుల గణన మీద పూర్తిస్థాయిలో అవగాహన లేదని జగ్గారెడ్డి అన్నారు. అసెంబ్లీలో మీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని.. వాళ్ళు కూడా మద్దతు ఇచ్చినట్లు- తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యేల మీద కూడా అనుమానం ఉందా..? అని ప్రశ్నించారు. సర్వేలో పాల్గొనని వాళ్ళ కోసం మళ్ళీ సమయం పొడిగించారు కదా..? అన్నారు. కిషన్ రెడ్డి మాటలు నమ్మకండని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కిషన్ రెడ్డికి సెంట్రల్ పార్టీ మొట్టికాయలు వేసిందని.. అందుకే ఈ మధ్య తరచూ ప్రకటనలు ఇస్తున్నారన్నారు.

# తక్షణమే డిగ్రీ పరీక్షలు నిర్వహించాలి

- ఫీజు రీయంబర్స్, స్కాలర్‌షిప్స్ ప్రభుత్వం విడుదల చేయాలి
- ఉన్నత విద్యామండలి జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కారం చేయాలి
- భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు
- ఉన్నతవిద్యామండలి చైర్మన్‌కు వినతిపత్రం అందజేత

**హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) :** తక్షణమే డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాకతీయ, పాలమూరు,తెలంగాణ ,శాతవాహన ,మహాత్మా గాంధీ, యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ విద్యార్థుల పరిస్థితి గందరగోళంగా ఉందని పేర్కొన్నారు. పరీక్షలు ఏప్రిల్ చివరి నాటికి పూర్తి కావాల్సినది కానీ పూర్తి చేయలేదని, మళ్లీ షెడ్యూల్ ఇంకా ప్రకటించలేదని తెలిపారు. ఇప్పటికే రెండు సార్లు వాయిదాలు వేయటంతో తీవ్ర గందరగోళం ఏర్పడిందని, తక్షణమే ప్రభుత్వం పరీక్షలు జరిగేలా జోక్యం చేసుకుని పరీక్షలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాల కిష్టారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుంటే డిగ్రీ పరీక్షలకు సహకరించమని ఆయా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లకు ప్రైవేట్ యాజమాన్యాలు విన్నవించుకున్నాయని, ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో వారు మళ్ళీ పరీక్షలు జరపలేమని తెలిపారు. ఇటూ ప్రభుత్వం ,అటూ యాజమాన్యాలు వైఖరి వల్ల పేద విద్యార్థులు చదువులు నష్టపోతున్నారని ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఈ ఐదు యూనివర్సిటీ పరిధిలో 4.80లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఫైనల్ ఇయర్ 1 లక్ష మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ పరీక్షలు జరగకుంటే చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నష్ట పోయే అవకాశముందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ ప్రవేశ పరీక్షలకు తేదీలు ప్రకటించిన నేపథ్యంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షలు పూర్తి కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని, ఉన్నత విద్యామండలి ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తక్షణమే తీసుకువెళ్లి పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేసి, యాజమాన్యాలతో సంప్రదించి పరీక్షలు నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. తెలుగు యూనివర్శిటీ లో ఈ మధ్యకాలంలో భర్తీ చేసిన పి.హెచ్.డి.అడ్మిషన్లలో అవకతవకలు పాల్పడాలని వాటిని తక్షణమే రద్దు చేసి తిరిగి మరల న్యాయంగా అర్హులైన వారికి ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ కోరుతుంది. తెలుగు యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ అర్హత లేనివారికి, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఫుల్ టైం పి.హెచ్.డి. అడ్మిషన్లు ఇచ్చారని ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టీ నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

- శాంతి చర్చలు జరపాలి
- ఖమ్మంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల మానవహారం




**ఖమ్మం, మే 2 (జనంసాక్షి) :** ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, శాంతి చర్చలు జరపాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక హక్కుల సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మం అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. కాకి భాస్కర్, రవి మారుత్ నిర్వాహకులుగా వ్యవహరించగా సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాస్ లైన్ జిల్లాకార్యదర్శి గోకనపల్లి వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు, తెలంగాణ పీపుల్స్ జేఏసీ జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్, జర్నలిస్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి చిర్ర రవి,సేవాలాల్ సేన అధ్యక్షులు కిషన్ నాయక్,ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు, భారత్ బచావో జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.ఎఫ్ గోపీనాథ్,డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. మావోయిస్టులను తుద ముట్టించడమే మా లక్ష్యం అని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మాట్లాడడం ప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజల పైన నరమేధాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ దేశ ప్రజలైనటువంటి ఆదివాసులను నిర్బంధంగా అణిచివేయడం సహించరానిదని దీన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మన్నారు. మరొక ప్రక్క కాల్పుల విరమణ పాటించండి అని మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు మేము సిద్ధంగా ఉన్నామని తెలియజేసినప్పటికీ నేటికీ కనీస స్పందన లేకపోవడం నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. ఆదివాసులపై కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేసి కేంద్ర బలగాలని వెనక్కి పంపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ మానవహారం కార్యక్రమంలో యలమండి కృష్ణయ్య,గుంతటి వీరభద్రం, సీఎల్‌సీ రాష్ట్ర నాయకులు విప్లవ కుమార్, హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖాదర్ బాబా, తెలంగాణ విద్యావం తుల వేదిక ఉపాధ్యక్షులు నరేందర్, రమేష్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు మోదం వెంకన్న, అశోక్, తెలం గాణ కార్మిక సంఘం నాయకులు దాసరి శ్రీను,దశరథ, జానీ, మహిళా సంఘం నాయకురాలు ఝాన్సీ,పోటు కళావతి,శోభ మంగతాయి, విద్యార్థి సంఘాల నాయకులు మస్తాన్, ప్రవీణ్,రామకృష్ణ,వెంకటేష్ అంబేద్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు లింగాల రవికుమార్,టిఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు పేర్ల మధు, మాల మహానాడు నాయ కులు సుధాకర్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు వై విక్రం, సింగు నర్సింగరావు,రషీద్, పగడాల నాగరాజు, లక్ష్మీనారాయణ, సర్దార్ హుస్సేన్ మానవహారంలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు పాల్గొన్నారు.



## ఈఎన్‌సీ అమ్జద్ హుస్సేన్‌కు సన్మానం

**కరీంనగర్, మే 2 (జనంసాక్షి) :** తెలంగాణ మైనారిటీస్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రియాజ్ అలీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం హెదరబాద్ జలసౌధ కార్యాలయంలో తన చాంబర్లో కలుసుకోని ఘనంగా సన్మానించారు. టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు యండీ రియాజ్ అలీ ఈఎన్‌సీ అమజ ద్ హుస్సేన్‌కు అభినందనలు తెలిపారు. మైనారిటీస్ గెజిటెడ్ అధికారుల పలు సమస్యలను వివరించారు. ఈఎన్‌సీ స్పందిస్తూ తప్పకుండా సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ దస్తగిరు, టీఎంజీవో మహిళా రాష్ట్ర కార్యదర్శి రేష్మ తబస్సుమ్, మొహమ్మద్ సిరాజ్, అయూబ్ అలీ, మొహమ్మద్ అబ్దుల్ ఖాదిర్, ఇతరులు హాజరయ్యారు. దాదాపు 25 సంవత్సరాల తరువాత, ఒక మైనారిటీకి ఇంజనీర్-ఇన్-చీఫ్ అడ్మిన్‌గా పదోన్నతి పొందారు.

# అన్ని వర్గాలను ఆదుకున్న కెసిఆర్

- అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యం

**నిజామాబాద్, మే2 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలను ఆదుకున్న ఘనత నాటి సిఎం కెసిఆర్‌దని నిజామాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. కానీ పద్నాలుగు నెలలకే కాంగ్రెస్ మడత చుట్టేసిందని, అభివృద్ధి వెనక్కి పోయిందని అన్నారు. నీళ్లు, కరెంట్ ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. తెలంగాణ సమాజంలో అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేస్తున్న ఘనత కేసీఆర్‌దని వేముల అన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత తెలంగాణలో మాత్రమే అన్నారు. గత పాలకులు 70 ఏళ్లలో చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ తొమ్మిళ్లలో చేసి చూపించారని పేర్కొన్నారు. తెలంగాణలో కరువును పారదోలేందుకు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును చేపట్టారని అన్నారు. దీంతో పాటు మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ వంటి ఆధునిక జలాశయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాగే భూగర్భ జలాలు పెరిగాయన్నారు. రైతులకునీరు, రైతుబంధు సాయం వంటివి అందడం,ధాన్యం కొనుగోళ్లు చేపట్టడంతో వారు సుఖంగా ఉన్నారని అన్నారు. కేంద్రం ధాన్యం కొనుగోళ్లకు ముందుకు రాకున్నా కెసిఆర్ ముందుకు వచ్చి ధాన్యం కొనుగోళ్లను చేపట్టారని అన్నారు. దిగుబడి పెంచేందుకు రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించేలా చేశారని అన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వీటిని కొనసాగించడం లేదన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, ఆ పార్టీ నాయకుల మోసపూరిత మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు.

# కర్రెగుట్టలో పోలీస్ క్యాంపు ఎత్తేయాలి




- ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి
- మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి
- వామపక్షాల డిమాండ్

**హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) :** ఆదివాసీ జాతిని హననంచేస్తున్న ఆపరేషన్ కగార్ నిలిపివేయడంతో పాటు తక్షణమే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో బేషరతుగా శాంతిచర్చలు జరపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. దాదాపు 20 వేల మంది పోలీసుల బలగాలతో కర్రెగుట్టను చుట్టుముట్టి నరమేధం సృష్టించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశాయి. వెంటనే కర్రెగుట్టల నుంచి పోలీసు క్యాంప్ ఎత్తివేయాలని కోరాయి. హైదరాబాద్ సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్ మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కె.జి.రాంచందర్, ఎంసిపిఐ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఆర్ రాష్ట్ర కార్యదర్శి ఎ.జానకి రాములు, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి సి.హెచ్.మురహరి, పార్వర్డ్ బ్లాక్ నాయకులు ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పరాయి దేశంపై యుద్ధం చేస్తున్నట్లు దేశ పౌరులైన మావోయిస్టులను తుదముట్టిస్తామని ప్రతిజ్ఞ చేసి మరీ అత్యంత కిరాతకంగా వేటాడి వెంటాడి చంపడం దుర్మార్గమన్నారు. దీనిని న్యాయ స్థానాలు సుమోటాగా స్వీకరించి న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. మావోయిస్టుల అడవులను గానీ, అక్కడ ఉన్న సంపద కానీ స్వాధీనం చేసుకోలేదని, అమాయక ప్రజలైన ఆదివాసీల హక్కులు, వారి రక్షణ కోసం మాత్రమే పోరాడుతున్నారన్నారు. కానీ అదే రాజ్యాంగ బద్దంగా ఎన్నికైన కేంద్ర ప్రభుత్వం ఆ సహజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడంలో భాగంగా వారిని తుదముట్టిస్తుండడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. మావోయిస్టుల పేరుతో అడువుల్లో వారిని కాల్చి చంపుతూ, అర్బన్ నక్సలైట్ల పేరుతో మేధావులైన వరవరరావు, ప్రొఫెసర్ సాయిబాబా లాంటి వారిని అక్రమంగా జైళ్లలో నిర్బంధించి తీవ్ర మానసిక క్షోభకు గురిచేసి చంపుతున్నారన్నారు. గోద్రా అల్లరి కేసుల్లో గుజరాత్ రాష్ట్రం నుంచి బహిష్కరణకు గురైన అమిత్ షా అనే వ్యక్తి దేశ హెూంశాఖ మంత్రిగా ఉండడం ఈ దేశ ప్రజల దురదృష్టమన్నారు. తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

# రైతులకు అందుబాటులో నాణ్యమైన విత్తనాలు

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కాంతి వల్లూరి




**సంగారెడ్డి ప్రతినిధి, మే 2 (జనం సాక్షి) :** రైతులకు అందుబాటులో ప్రభుత్వం కల్తీ లేని నాణ్యమైన విత్తనాలు అందిస్తుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి తెలిపారు. శుక్రవారం తెలంగాణ సీడ్స్ సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్,జిల్లా వ్యవసాయా అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ విత్తనాభివృధి సంస్థ రైతులకు దిగుబడులను ఇచ్చే నాణ్యమైన విత్తనాలను సరసమైనా ధరలకు అందిస్తుందన్నారు. నాణ్యత ప్రమాణలకు అనుకూలంగా నిపుణుల పరివేక్షణలో ఉత్పత్తి చేయబడిన విత్తన పరీక్ష కేంద్రలో ధ్రువీకరించబడిన విత్తనాలను రైతులకు వానాకాలం- 2025 సీజన్లో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. రైతుల సౌలభ్యం కొరకు అన్ని మండలంలో పిఏసిఎస్, ఏ ఆర్ ఎస్ కె , డీసీ ఎమ్మెస్, మరియు డీలర్ల వద్ద విత్తనాలు లభిస్తాయని తెలిపారు. టీజీ సీడ్స్ యొక్క సొంత విక్రయకేంద్రాలలో 6శాంతం వరకు డిస్కౌంట్లో ఎలాంటి రవాణా ఖర్చు లు లేకుండా మీ గ్రామాలకు అందించడం జరుగుతుందన్నారు. టీజీ సీడ్స్ దగ్గర దొరుకే విత్తన రకాలు కె ఎన్ ఎం 1638, ఆర్ ఎన్ ఆర్ 15048, బీపీటీ 5204, జేజిఎల్ 27356, ఎం టి యు 1010, కే ఎన్ ఎం 118, జేజిఎల్ 24424, ఆర్ ఎన్ ఆర్ 28361, ఆర్ ఎన్ ఆర్ 29325, ఎం టి యు 224 గల రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా టీజీ సీడ్స్ గోడపత్రికను సంగారెడ్డి జిల్లా కాలెక్టర్ వల్లూరి క్రాంతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మాధురి , జిల్లా వ్యవసాయా అధికారి శివప్రసాద్ అందోల్ ఆర్డిఓ పాండు టీజీ సీడ్స్ రీజినల్ మేనేజర్ కోటిలింగం పాల్గొన్నారు.

# సామాజిక శాస్త్రాలలో పరిశోధన నివేదిక రూపకల్పన

సామాజిక శాస్త్రాలలో పరిశోధన నివేదిక కేవలం ఒక పత్రం కాదు. ఇది అన్వేషణ అలాగే అవగాహన మధ్య ఒక సేతువు. డేటా, సిద్ధాంతం మరియు మానవ అనుభవాలను ఒక సమన్విత కథగా అల్లే కళ. దీనిని రాయడం అనేది ఖచ్చితత్వం, స్పష్టత మరియు శాస్త్రీయ ప్రక్రియపై గౌరవాన్ని కలిగి ఉంటుంది. అదే సమయంలో సామాజిక సంక్లిష్టతలను పాఠకులకు ఆకర్షణీయంగా అందించాలి. మీరు విద్యార్థి, రీసెర్చ్ స్కాలర్ లేదా వృత్తిపరమైన సామాజిక శాస్త్రవేత్త అయినా, ఈ నైపుణ్యాన్ని సాధించడం ఈ రంగంలో అవసరం అవుతుంది.

ఈ రచనా ప్రయాణం స్పష్టమైన లక్ష్యంతో మొదలవుతుంది. సామాజిక శాస్త్రాలలో పరిశోధన నివేదిక అనేది కేవలం ఫలితాలను ప్రదర్శించడం గురించి మాత్రమే కాదు. ఇది సమాజంలో ప్రాముఖ్యత కలిగిన ఒక ప్రశ్నను రూపొందించడం గురించి. మానవ ప్రవర్తన, సామాజిక నిర్మాణాలు లేదా సాంస్కృతిక గతిశీలతలలో లోతుగా పాతుకుపోయిన సమస్యను గుర్తించటం. ఈ ప్రశ్న మీ నివేదికలోని ప్రతి భాగాన్ని... పరిశోధనా పరిచయం నుండి ముగింపు వరకు ఒకే ధారతో నడిపించాలి. ఒక బలమైన ప్రారంభం పాఠకుల దృష్టిని ఆకర్షిస్తుంది: విషయాన్ని సంక్షిప్తంగా పరిచయం చేయండి, దాని ప్రాముఖ్యతను వివరించండి, మీ పరిశోధన ప్రశ్న లేదా పరికల్పనను స్పష్టంగా పేర్కొనాలి. సంక్లిష్టమైన పదజాలాన్ని ఉపయోగించ కుండా పరిశోధనా నివేదిక సరళంగా, స్పష్టంగా ఉండాలి. మీ లక్ష్యం పాఠకులను ఆకర్షించడం, వారిని గందరగోళానికి గురి చేయడం కాదు. ఉదాహరణకు, మీరు" సోషల్ మీడియా మానసిక ఆరోగ్యంపై" చూపే ప్రభావాన్ని అధ్యయనం చేస్తుంటే, ఈ సమస్యను వాస్తవ-ప్రపంచ పరిణామాలతో అనుసంధానం చేయండి, సంబంధిత ఉదాహరణలు లేదా ఆకర్షణీయ గణాంకాలను ఉదహరించి పాఠకులను ఆకట్టుకోవాలి.

తర్వాత, మీ పరిశోధనను ఇప్పటికే ఉన్న సాహిత్యంలో విభిన్న ధోరణులు, సంక్లిష్ట అంశాలు తవ్వి తీయాలి.వైరుధ్యాలు ఉంటే సరైన ఆధారాలతో పరిష్కారాలు చూపాలి. సామాజిక శాస్త్రాలు విద్వత్పరమైన సంభాషణలపై వృద్ధి చెందుతాయి. కాసుక మీ అధ్యయనాన్ని విస్తృత శాస్త్రీయ పద్ధతిలో నే ఉండాలి. వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేదు. కీలక సిద్ధాంతాలు మరియు మునుపటి పరిశోధనలను సంక్షిప్తంగా సంగ్రహించండి, మీ పరిశోధనలో నింపాలనుకునే ఖాళీలను హైలైట్ చేయాలి.



ఇది కేవలం ఉదహరణల జాబితా కాదు, మీరు ఈ రంగంతో విమర్శనాత్మకంగా సంభాషించినట్లు చూపే ఎంపిక చేసిన సంశ్లేషణ. ఎంపికలో శ్రద్ధ వహించాలి. మీ విధానాన్ని నేరుగా ప్రభావితం చేసే అధ్యయన ప్రతిపాదనలపై దృష్టి పెట్టాలి. ఉదాహరణకు, మీరు "కార్యాల య నాయకత్వంలో లింగ గతిశీలతలను" అన్వేషిస్తుం టే, రోల్ కాంగ్రూటీ వంటి ప్రాథమిక సిద్ధాంతాలను సూచిస్తూ, ఇంటర్సెక్షనల్ గుర్తిం పుల వంటి తక్కువగా అన్వేషించిన ప్రాంతాలను గుర్తించాలి.

గణాంక వివరాల విశ్లేషణ పద్ధతి శాస్త్రయ పద్ధతిలో సాగాలి. మీ నివేదికకు వెన్నెముక, ఇక్కడ పారదర్శకత అత్యంత ముఖ్యం. సామాజిక శాస్త్ర పరిశోధనలో తరచుగా, సామాజిక , మానవీయ సబ్జెక్టులు ఉంటాయి, కాబట్టి మీ విధానాన్ని ఖచ్చితంగా వివరించండి. మీ శాంపిల్‌ను వివరించాలి. శాంపిల్ గి ఎంత మందిని తీసుకున్నారు, వారు ఎవరు, వారు ఎలా ఎంపిక చేయబడ్డారు. సర్వేలు, ఇంటర్వ్యూలు లేదా ఎథ్నోగ్రాఫిక్ పరిశీలన వంటి మీ డేటా సేకరణ పద్ధతులను వివరించండి, అవి మీ ప్రశ్నకు ఎందుకు, ఎంత మేరకు సరిపోతాయో న్యాయసమ్మతంగా చెప్పాలి. మీరు మిశ్రమ-పద్ధతుల విధానాన్ని ఉపయోగించినట్లయితే, గుణాత్మక మరియు పరిమాణాత్మక డేటా ఒకదానికొకటి ఎలా పూరకంగా ఉంటాయో స్పష్టం చేయాలి. సమాచార సమ్మతి లేదా గోప్యత వంటి నైతిక పరిగణనలను పరిష్కరించాలి. బాధ్యతాయుతమైన పరిశోధన పట్ల మీ నిబద్ధతను చూపించాలి. ఇక్కడ స్పష్టత విశ్వాసాన్ని నిర్మిస్తుంది, మీ ఫలితాల చెల్లుబాటును పాఠకులు అంచనా వేయడానికి అనుమతిస్తుంది.

ఫలితాలను ప్రదర్శించేటప్పుడు, అతిశయోక్తులు వదిలివేయాలి. సామాజిక శాస్త్ర డేటాగణాంక ఫలితాలు లేదా ఇంటర్వ్యూల నుండి థీమాటిక్ అంతర్దృష్టులు స్వయంగా మాట్లాడాలి. కీలక ఫలితాలను వివరించడానికి టేబుల్స్ లేదా గ్రాఫ్‌లను తక్కువగా ఉపయోగిం చాలి, అవి సులభంగా అర్థం చేసుకోగలిగేలా చూసుకోవాలి. నమూనాలు లేదా ధోరణుల ను వివరించాలి. కానీ తొందరపడి ముందు గానే వివరణలు, అభిప్రాయాలు చెప్ప కూడదు. మీకు బదులుగా మీ డేటా మాట్లాడాలి. వివరణలను చర్చ విభా గంలో ఉంచాలి. ఉదాహరణకు, "సామాజి క నెట్‌వర్క్‌లు విపత్తు తర్వాత రికవరీని అంచనా వేస్తాయని" మీ అధ్యయనం కనుగొంటే, సంబంధాలు లేదా థీమ్‌లను అవి ఉద్భవించిన విధంగా ఖచ్చితంగా నివేదించండి, ఊహాగానాలను నివారించాలి.

చర్చ విభాగం మీ గొంతు ప్రకాశించే స్థలం. ఇక్కడ, మీ ఫలితాలను మీ పరిశోధన ప్రశ్న మరియు సాహిత్యంతో తిరిగి అనుసంధానం చేస్తూ, వాటిని సందర్భోచితంగా వివరించాలి. మీ ఫలితాలు సిద్ధాంతం లేదా ఆచరణకు ఏమి అర్థం చేస్తాయి? విద్యా అసమానతపై మీ అధ్యయనం నిరంతర విజయం, లోపాలను వెల్లడిస్తే, ఎందుకు...బహుశా వ్యవస్థాగత అడ్డంకులు లేదా విధాన వైఫల్యాలను అన్వేషించాలి. మరియు పాఠశాలలు లేదా విధాన నిర్మాతల కోసం పరిణామాలను సూచించాలి.పరిశోధనా పరిమితులను ఒప్పిగ్గా అంగీకరించాలిబీ ఏ అధ్యయనం దానికదే పరిపూర్ణం కాదు.అలాగే చిన్న శాంపిల్ లేదా ప్రాంతీయ దృష్టి వంటి పరిమితులను అంగీకరించడం మీ విశ్వసనీయతను బలపరుస్తుంది. భవిష్యత్ పరిశోధన లేదా సమస్యను పరిష్కరించడానికి ఆచరణాత్మక దశలను ప్రతిపాదించడంతో ముగించండి.

చివరగా, మీ నివేదికను అత్యంత శ్రద్ధతో మెరుగుపరచండి. సామాజిక శాస్త్ర రచనకు స్పష్టత మరియు సమర్థత అవసరం. ప్రతి వాక్యం దాని స్థానాన్ని సంపాదించాలి. సాధ్యమైన చోట చురుకైన గొంతును ఉపయోగించండి, మీ స్వరం ఖచ్చితత్వానికి కట్టుబడి ఉండేలా చూసుకోండి. ప్రభావాన్ని తగ్గించే నిష్క్రియ నిర్మాణాలను నివారించండి. సంభాషణాత్మకమైనా వృత్తిపరమైన స్వరం పాఠకులను ఆకర్షిస్తుంది, సులభత మరియు అధికారాన్ని సమతుల్యం చేస్తుంది. లోపాలను తొలగించడానికి శ్రద్ధతో జాగ్రత్తగా సవరించాలి. ఎందుకంటే అవి విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి.

చివరిగా , సామాజిక శాస్త్రాలలో పరిశోధన నివేదిక రాయడం అనేది క్రమశిక్షణతో కూడిన కథనంగా చెప్పడం. ఇది ముఖ్యమైన ప్రశ్నను అడగడం, దానిని విద్వత్పరమైన సాహిత్యంలో నాటడం, సమగ్రతతో ఆధారాలను ప్రదర్శించడం గురించి. బాగా చేస్తే, మీ నివేదిక కేవలం సమాచారాన్ని అందించటమే కాదు.అది స్ఫూర్తినికూడా ఇస్తుంది, హైపోథీసిస్ ను సవాలు చేస్తుంది, సామాజిక ప్రపంచం గురించి లోతైన అవగాహనకు దోహదపడుతుంది. కాబట్టి, సరైన సమయాన్ని తీసుకొని అధ్యయనం చేయాలి, కఠినతను స్వాగతించాలి, మీ పరిశోధన మానవ అనుభవాన్ని ప్రకాశింపజేయనివ్వాలి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

---

*బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఏం మాట్లాడుతారనే అంశంపై ఆసక్తి నెలకొని ఉండే. సభలో ఆయన ప్రసంగం విన్న తర్వాత భిన్నాభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పదహారు నెలల పాలనా వైఫల్యాలను ప్రస్తావించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 11 ఏండ్లలో తెలంగాణకు రూ. 11 రూపాయలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ విమర్శించిన కేసీఆర్ బీజేపీపై మాత్రం ఎక్కువగా ఫోకస్ చేయలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే బీజేపీకి రాష్ట్రంలో బలం ఉన్నది. కానీ అది సొంతంగా అధికారంలోకి వచ్చేంత మాత్రం కాదు. అందుకే బీజేపీపై విమర్శలు ఎక్కువగా చేయకపోవడమూ వ్యూహాత్మకమే. అలాగే సీఎం రేవంత్ రెడ్డి పేరు ప్రస్తావించకుండానే కాంగ్రెస్ వస్తే ఏం జరుగుతున్నదో చెప్పారు.*



# ప్రజల ప్రశ్నలే కేసీఆర్ అస్త్రాలు?

సభ అనంతరం కేసీఆర్ ప్రసంగంపై చర్చ జరుగుతున్నది. రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట ఏమిటంటే రేవంత్ రెడ్డి చేసిన పొరపాటు కేసీఆర్ చేయలేదు. రేవంత్ రెడ్డి తనకు తాను ప్రమోట్ చేసుకునే క్రమంలో కేసీఆర్‌ను టార్గెట్ చేశారు. ఎన్నికలకు ముందు అవి పనిచేశాయి. కానీ అధికారంలోకి వచ్చాక కూడా అదే పనిగా కేసీఆర్‌ను దూషించడం, ఆయన వయసు కూడా గౌరవం ఇవ్వకుండా హేళన చేయడాన్ని తెలంగాణ ప్రజానీకం హర్షించలేదు. ఎందుకంటే తెలంగాణ ఉద్యమంతో కేసీఆర్‌కు ఉన్న అనుబంధం అలాంటిది. కానీ తెలంగాణ ఉద్యమంలో రేవంత్ రెడ్డి పాత్ర ఏమిటంటే చెప్పుకోలేని స్థితి. కాబట్టి కేసీఆర్‌ను తిడుతూ కాలం వెళ్లదీస్తే సమస్యలు పరిష్కారం కావు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరవన్నది ప్రజల నుంచి వస్తున్న స్పందన.

ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఏం జరుగుతున్నదో అందరికీ తెలిసిందే. ఈ గందరగోళంపై ప్రజల నుంచి వస్తున్న ప్రశ్నలనే కేసీఆర్ తన ప్రసంగంలో ఆయుధాలుగా మలుచుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారుల ఎంపిక మొదలు కాంట్రాక్టర్ల కు చెల్లించాల్సిన డబ్బుల కోసం కమీషన్లు అడుగుతున్నారనే ఆరోపణల గురించి చెప్పారు. అలాగే కరెంటు కష్టాలు, తాగు, సాగు నీటి ఇబ్బందుల గురించి, రైతుబంధు, రుణమాఫీ అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్న వాటినే తన ప్రసంగంలో చెప్పారు. ఇలా అనేక అంశాలపై కేసీఆర్ మాట్లాడారు. దీనిపై కేసీఆర్ మార్క్ పంచులు లేవు అని, కొత్తదనం లేదు అనుకునే వారికి ఆయన ఆంతర్యం అర్థం కాలేదు. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించలేకపోతుండటం, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతుండటంపై సభలో కేసీఆర్ ప్రస్తావించారు. ప్రస్తుతం గ్రామాల్లో, పట్టణాల్లో ఇదే చర్చ జరుగుతున్నది. అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు కాంగ్రెస్ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల భర్తీ గురించి అడుగుతున్నారు. గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనంలో తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని దాన్ని సరిదిద్దాలని కోరుతున్నారు. అలాగే జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు ఎప్పుడు ఇస్తారని నిలదీస్తున్నారు. ఇలా ప్రజల నుంచి వస్తున్న అనేక అంశాలను బీఆర్ఎస్ అసెంబ్లీలో, బయట ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నది. దీనికి అధికారపార్టీ నుంచి సరైన సమాధానం రాకపోగా ఎదురుదాడి మాత్రం చేస్తున్నది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది కాలానికి పైగా సమయం ఇచ్చిన కేసీఆర్ సభలో ప్రజా సమస్యలను ఏకరువుపెట్టారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయపోవడానికి కారణం గత ప్రభుత్వం చేసిన అప్పులని, కాంగ్రెస్ ప్రభుత్వం అంటున్నది. వీటికి కూడా బీఆర్ఎస్ ధీటుగానే బదులిస్తున్నది. అందుకే అసెంబ్లీకి ఎందుకు రావడం లేదనే ప్రశ్నలకు కేసీఆర్ సమాధానం ఇచ్చారు. మా పిల్లలు అడిగిన వాటికే జవాబు చెప్పడం లేదు. అసెంబ్లీకి దేనికోసం రావాలి. నీ కాయగొరుకుడు ముచ్చట్లు వినడానికా అని రేవంత్ రెడ్డి పేరు చెప్పకుండానే సెటైర్లు వేశారు. అసెంబ్లీలో చర్చ సందర్భంగా ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలు సమాధానం చెప్పాలి. కానీ ప్రధాన ప్రతిపక్షం నుంచి సభ్యులు మాట్లాడటం మొదలుపెట్ట గానే అధికారపార్టీ నుంచి సీఎం సహా మంత్రులు, ఎమ్మెల్యేలు రన్నింగ్ కామెంటరీ మొదలుపెట్టడం ప్రజలు చూశారు. అంటే విషయాన్ని డైవర్ట్ చేయడానికి రేవంత్ సహా ఆ పార్టీ నేతలంతా అసెంబ్లీలోనే కాదు బయట కూడా ఇదే పనిచేస్తున్నారన్నది స్పష్టమైంది. సీఎం రేవంత్ రెడ్డి అయితే కేసీఆర్‌ను బూతులు తిడుతారు. ఆయన భాషనే ఆ పార్టీ ఎమ్మెల్యేలు మాట్లాడుతారు. ప్రజల నుంచి అలాంటి స్పందన వస్తుంటే బట్టలూడదీసి కొడుతానని ముఖ్యమంత్రే అసెంబ్లీలో వార్నింగ్స్ ఇచ్చింది చూశాం. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై, వైఫల్యాలపై ప్రశ్నించినా, పోస్టులు పెట్టినా కేసులు పెడుతున్నది. ఈ అంశాన్ని కూడా కేసీఆర్ ప్రశ్నించారు. పోలీసు సోదరులు ఈ విషయంలో అత్యుత్సాహం ప్రదర్శించొద్దని హెచ్చరించారు. యూట్యూబర్స్ కొంతమంది దీన్ని స్వాగతించారు.

కాబట్టి ఎల్కతుర్తి సభలో కేసీఆర్ ప్రసంగం సప్పగా ఉన్నదని, అందులో కొత్త విషయాలు ఏమీ లేవని అధికారపార్టీ విమర్శించవచ్చు. అలాగే తాము ఇచ్చిన హామీలు అమలుకాకపోవడానికి కారణం కేసీఆరే అని అధికారపార్టీ అంటే ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదు. ఎందుకంటే కాంగ్రెస్ ఇచ్చిన హామీల గురించి ఎన్నికల ముందే మీడియాలో చర్చ జరిగింది. అప్పుడు మాకు స్పష్టత ఉన్నది. మాకు ప్రణాళిక స్పష్టమైన ఉన్నదని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క చెప్పారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన కొత్తలో ఇక్కడ లంకె బిందెలు ఉన్నాయనుకున్నాము కానీ ఇక్కడ ఏమీ లేదన్నారు. అలాగే ఇటీవల ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ అప్పుడు హామీలు ఇచ్చాం కానీ ఇప్పుడు అమలుచేసే పరిస్థితి లేదని అర్థమైందన్నారు. అప్పుడు తెల్వదా అంటే అప్పుడు అందరం అలా చెప్పాము అన్నట్టు సమాధానం ఇచ్చి చేతులేత్తేశారు. అయితే ప్రభుత్వ ఇచ్చిన హామీలపై ప్రజలకు అడిగే హక్కు ఉంటుది. అడిగిన వాళ్లపై కేసులు పెట్టి, బెదిరిస్తే ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ వారికి అండగా ఉంటుదని కేసీఆర్ భరోసా ఇచ్చారు. ప్రభుత్వం బాధ్యతయుతంగా ఉండాలి. ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. అలాకాకుండా వ్యవహరిస్తే సమయం వచ్చినప్పుడు ఎలా స్పందించాలో ప్రజలకు స్పష్టత ఉన్నది.




ఆసరి రాజు
ఇండిపెండెంట్ జర్నలిస్ట్

---

# కృత్రిమ మేధ కాలంలో పత్రికా స్వేచ్ఛ

ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటిది పాత్రికేయుల సేవ. దేశానికి అన్నదాతలు వెన్నెముక అయితే వార్తా సమాచారాన్ని ప్రజలకు అందించే పాత్రికేయులు ప్రజాస్వామ్యానికి ఊపిరి పోస్తారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు ప్రజాస్వామ్యానికి మూడు మూల స్తంభాలు కాగా నాలుగో స్తంభంగా ప్రసార మాధ్యమాలు నిర్వర్తించే పాత్ర అత్యంత ప్రధానమైనది. ప్రభుత్వానికి ప్రజలకు నడుమ వారధిగా నిలుస్తూ పారదర్శ కతకు, జవాబుదారీతనానికి పెద్దపీట వేయడంలో పత్రికలు, ప్రసార మాధ్యమాలు కీలక భూమిక పోషిస్తాయి. మారుతున్న ప్రపంచంలో నిరంతరం జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తేవడంలో పాత్రికేయుల కృషి అమూల్యమైనది.



### ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం - నేపథ్యం:

ప్రతి ఏటా మే 3వ తేదీన జరుపుకునే ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం, పత్రికా స్వేచ్ఛ ఆవశ్యకతను ప్రపంచానికి గుర్తుచేస్తుంది. 1991లో ఆఫ్రికన్ పాత్రికేయులు నమీబియాలోని విండ్ హాక్‌లో చేసిన తీర్మానాలకు గుర్తుగా 1993లో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం మే 3వ తేదీని ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛను అంచనా వేయడం, దాని పరిరక్షణకు చర్యలు చేపట్టడం, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పాత్రికేయులకు నివాళులర్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యాలు. ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్ట అంశంపై దృష్టి సారిస్తూ ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ ఏడాది అంటే 2025 ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవ ఇతివృత్తం 'పాత్రికేయం, ప్రసార మాధ్యమాలు, మానవ హక్కులపై కృత్రిమ మేధ చూపే ప్రభావం'. ఇది నేటి డిజిటల్ ప్రపంచంలో పాత్రికేయం ఎదుర్కొంటున్న కొత్త సవాళ్లు, అవకాశాలను ప్రతిబింబిస్తుంది. కృత్రిమ మేధ ఒకవైపు వార్తల సేకరణ, విశ్లేషణ, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా వార్తల పంపిణీలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నప్పటికీ, మరోవైపు అనేక కొత్త ప్రమాదాలను కూడా సృష్టిస్తోందన్న వాస్తవాన్ని ఈ ఇతివృత్తం నొక్కి చెబుతోంది.

### యుద్ధ క్షేత్రంలో యోధులు - అసామాన్య ధైర్యానికి అభివందనం !

యుద్ధాలు, అంతర్యుద్ధాలు, ఘర్షణలు జరిగే ప్రాంతాలలో పనిచేయడం పాత్రికేయులకు నిత్యం ప్రాణాలతో చెలగాటం లాంటిది. బాంబు దాడులు, కాల్పులు, అపహరణలు, నిర్బంధాలు వంటి ప్రమాదాలు వారిని వెన్నాడుతూనే ఉంటాయి. సిరియా, యెమెన్, ఆఫ్ఘనిస్తాన్, ఉక్రెయిన్, ఇటీవల ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణ జరిగిన పాలస్తీనా వంటి చోట్ల వందలాది పాత్రికేయులు ప్రాణాలు కోల్పోయారు లేదా తీవ్రంగా గాయపడ్డారు. ఈ భయానక పరిస్థితులలోనూ, మహిళా పాత్రికేయులు అసాధారణ ధైర్యంతో పనిచేస్తున్నారు. పురుష సహోద్యోగులతో పాటు సమానంగా ప్రమాదాలను ఎదుర్కొంటూనే, వారు లైంగిక వేధింపుల భయం, భద్రతాపరమైన ఆందోళనలు, సాంస్కృతిక కట్టుబాట్లు, కుటుంబ బాధ్యతలు వంటి అదనపు సవాళ్లను కూడా అధిగమించాల్సి వస్తోంది. వారి తెగువ, నిబద్ధత, బాధితుల గళాన్ని వినిపించాలనే తపన స్వేచ్ఛా పాత్రికేయానికి నిలువెత్తు నిదర్శనం.

### కృత్రిమ మేధ: అవకాశాలు - ఆపదలు:

ఈ ఏడాది ఇతివృత్తానికి అనుగుణంగా కృత్రిమ మేధ పాత్రను పరిశీలిస్తే, ఇది వేగవంతమైన సమాచార విశ్లేషణకు, సుదూర సంవేదన ద్వారా యుద్ధ ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు, తప్పుడు సమాచారాన్ని గుర్తించడానికి ఉపయోగపడే వీలుంది. అయితే, ఇదే సాంకేతికత కృత్రిమ నకిలీ దృశ్యాల (డీప్‌ఫేక్స్) తయారీకి, అసత్య వార్తల సృష్టికి, ప్రచార యుద్ధాలకు ఆయుధంగా మారే ప్రమాదం ఉంది. ఇది క్షేత్రస్థాయిలో పనిచేసే పాత్రికేయుల విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. ముఖ గుర్తింపు వంటి నిఘా సాంకేతికతలు విలేకర్ల భద్రతకు పెను ముప్పుగా పరిణమించవచ్చు. కృత్రిమ మేధ అల్గారిథమ్‌ల పక్షపాతం, పారదర్శకత లోపం, మానవీయ కోణం కొరవడటం వంటివి కూడా ప్రతికూల ప్రభావాలే. మానవ హక్కుల పరిరక్షణకు కృత్రిమ మేధ ఉపయోగపడే అవకాశం ఉన్నట్లే, గోప్యతా హక్కు ఉల్లంఘన, వివక్షకు దారితీసే ప్రమాదాలూ ఉన్నాయి. కాబట్టి, మానవ విలువలు, ప్రాథమిక హక్కులను పరిరక్షిస్తూ, నైతిక, చట్టపరమైన చట్రాల నడుమ కృత్రిమ మేధను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### క్షీణిస్తున్న స్వేచ్ఛ - భారతదేశ పరిస్థితి:

రిపోర్టర్స్ విత్‌ౌట్ బోర్డర్స్ అనే అంతర్జాతీయ సంస్థ ఏటా విడుదల చేసే ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచిక, ఆయా దేశాలలో పాత్రికేయుల స్వేచ్ఛా స్థాయిని వెల్లడిస్తుంది. 2024 సంవత్సరం సూచికలో 180 దేశాలలో భారతదేశం 159వ స్థానంలో నిలిచింది. 2023 నాటి 161వ స్థానంతో పోలిస్తే స్వల్ప మెరుగుదల కనిపించినా, పొరుగు దేశాలైన పాకిస్తాన్ (152), శ్రీలంక (150) కంటే వెనుకబడి ఉండటం ఆందోళనకరం. రాజకీయ, చట్టపరమైన, ఆర్థిక, సామాజిక-సాంస్కృతిక పరిస్థితుల పరంగా స్కోరు తగ్గడం గమనార్హం. పాత్రికేయులపై దాడులు, నిర్బంధాలు, చట్టపరమైన వేధింపులు పెరగడం పత్రికా స్వేచ్ఛకు అవరోధంగా మారుతున్నాయి. ఆసియా-పసిఫిక్ ప్రాంతం విలేకర్లకు రెండవ అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంగా నిలవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తుంది.

### వారసత్వం - బాధ్యత:

భారతదేశంలో స్వతంత్ర పాత్రికేయానికి పునాది వేసిన 'భారతీయ పాత్రికేయ పితామహుడు' జేమ్స్ అగస్టస్ హికీ స్ఫూర్తిని మనం గుర్తుంచుకోవాలి. 1780లో 'బెంగాల్ గెజెట్' పత్రికతో ఆయన ప్రారంభించిన నిర్భయ, నిష్పాక్షిక వార్తా సంస్కృతి నేటికీ ఆదర్శం. భారత రాజ్యాంగపు 19(1)(ఎ) అధికరణం వాక్ స్వాతంత్ర్యం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛల ద్వారా పత్రికా స్వేచ్ఛకు హామీ ఇస్తుంది. అయితే, అధికరణ 19(2) కింద కొన్ని పరిమితులూ ఉన్నాయి. ఈ స్వేచ్ఛను కాపాడుకుంటూ, సంక్షోభ సమయాలలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించడం విలేకర్ల కర్తవ్యం. ఖచ్చితమైన సమాచారం అందించడం, తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టడం, బాధితుల పక్షాన నిలవడం అత్యవసరం.

### స్వేచ్ఛకు రక్షణ - భద్రతకు భరోసా:

ప్రాణాలకు తెగించి, ప్రతికూల పరిస్థితులలోనూ నిజాలను నిగ్గు తేల్చేందుకు పోరాడుతున్న ప్రతి పాత్రికేయుడికి, ముఖ్యంగా యుద్ధ క్షేత్రాలలోని ధీర వనితలకు వందనాలు. విధి నిర్వహణలో అమరులైన పాత్రికేయుల త్యాగాలను స్మరించుకుందాం. ఈ ఏడాది ఇతివృత్తం నొక్కిచెప్పినట్లు, కృత్రిమ మేధ వంటి సాంకేతిక సవాళ్లను నైతికంగా అధిగమిస్తూ, విలేకర్ల భద్రతకు భరోసా కల్పించడం, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడం మనందరి సామాజిక బాధ్యత. విశ్వసనీయమైన, నైతిక విలువలతో కూడిన పాత్రికేయం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయగలమని, సమాజానికి సరైన సమాచారం అందించగలమని గుర్తించుకుందాం.



కింజరాపు అమరావతి
82472 86357

---

# కనీస వేతన చట్టం: దస్త్రాలలోనేనా?

భారతదేశంలో కనీస వేతన చట్టం (మినిమమ్ వేజెస్ యాక్ట్, 1948) దాదాపు ఏడు దశాబ్దాలుగా అమలులో ఉంది. ఈ చట్టం కార్మికులకు కనీస వేతనాన్ని నిర్ధారించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ఈ చట్టం యొక్క అమలు విషయంలో అనేక సందేహాలు, విమర్శలు ఉన్నాయి. ఇది నిజంగా కార్మికుల జీవితాలను మార్చగలిగిందా లేక కేవలం దస్త్రాలలోనే మిగిలిపోయిందా?

### చట్టం యొక్క ఉద్దేశం, నిర్మాణం :

కనీస వేతన చట్టం 1948లో ఆమోదించబడినప్పటి నుండి, షెడ్యూల్డ్ ఉద్యోగాలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనం అందించేందుకు రూపొందించబడింది. ఈ చట్టం కింద, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పరిశ్రమలకు కనీస వేతనాలను నిర్ణయిస్తాయి. ఈ వేతనాలు కార్మికుల జీవన వ్యయం, ఆర్థిక పరిస్థితులు, ప్రాంతీయ వ్యత్యాసాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడతాయి. అదనంగా, 2019లో ప్రవేశపెట్టిన వేతన సంహిత (కోడ్ ఆన్ వేజెస్) ఈ చట్టాన్ని మరింత బలోపేతం చేసే ప్రయత్నంలో భాగంగా చూడవచ్చు, అయితే దీని పూర్తి అమలు ఇంకా సవాళ్లను ఎదుర్కొంటోంది.

### అమలులోని సవాళ్లు :


కనీస వేతన చట్టం యొక్క అమలు అనేక సమస్యలతో కూడుకున్నది. మొదట, చట్టం యొక్క పరిధి పరిమితంగా ఉంది. అసంఘటిత రంగంలో పనిచేసే కోట్లాది కార్మికులు ఈ చట్టం యొక్క పరిధిలోకి రారు. గ్రామీణ ప్రాంతాలలో, చిన్న తరహా పరిశ్రమలలో, గృహ పనివారు, వ్యవసాయ కార్మికులు వంటి వారికి కనీస వేతనం అందడం అరుదు. రెండవది, చట్టం ఉల్లంఘనలను పర్యవేక్షించే వ్యవస్థ బలహీనంగా ఉంది. కార్మిక శాఖలు తగినంత సిబ్బంది, వనరుల కొరతతో సతమతమవుతున్నాయి. ఫలితంగా, యజమానులు కనీస వేతనాలను చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. మూడవది, కనీస వేతనాల సవరణలు తరచూ ఆలస్యమవుతాయి. ద్రవ్యోల్బణం, జీవన వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో, కనీస వేతనాలు సమయానుకూలంగా సవరించబడకపోవడం వల్ల కార్మికుల ఆర్థిక స్థితి దిగజారుతోంది. ఉదాహరణకు, కొన్ని రాష్ట్రాలలో కనీస వేతనాలు ఐదేళ్లకు ఒకసారి మాత్రమే సవరించబడతాయి, ఇది కార్మికుల జీవన ప్రమాణాలకు సరిపడదు.

### దస్త్రాలలోనేనా?

కనీస వేతన చట్టం కేవలం దస్త్రాలలోనే ఉందనే విమర్శకు కొంత నిజం ఉంది. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు ఈ చట్టం యొక్క ప్రయోజనాలు అందడం లేదు. అదనంగా, చట్టం ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల యజమానులలో భయం లేకుండా పోయింది. ఉదాహరణకు, బీడీ కార్మికులు, నిర్మాణ కార్మికులు, గృహ పనివారు వంటి వారు తరచూ కనీస వేతనం కంటే తక్కువ ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. ఈ పరిస్థితి చట్టం యొక్క ప్రభావాన్ని ప్రశ్నార్థకం చేస్తుంది. అయినప్పటికీ, చట్టం పూర్తిగా విఫలమైందని చెప్పలేము. సంఘటిత రంగంలో, ప్రభుత్వ రంగ సంస్థలలో, కొన్ని ప్రైవేటు సంస్థలలో కనీస వేతన చట్టం పాటించబడుతోంది. ఉదాహరణకు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకింద కార్మికులకు కనీస వేతనం అందుతోంది, అయితే ఇక్కడ కూడా చెల్లింపుల ఆలస్యం, అవినీతి వంటి సమస్యలు ఉన్నాయి.

### సంస్కరణల కోసం సూచనలు

కనీస వేతన చట్టాన్ని మరింత ప్రభావవంతంగా చేయడానికి కొన్ని సంస్కరణలు అవసరం. మొదట, చట్టం యొక్క పరిధిని విస్తరించి, అసంఘటిత రంగంలోని కార్మికులను కూడా చేర్చాలి. రెండవది, కనీస వేతనాలను ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సమయానుకూలంగా సవరించే విధానాన్ని అమలు చేయాలి. మూడవది, చట్టం ఉల్లంఘనలను పర్యవేక్షించేందుకు బలమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. కార్మిక శాఖలకు తగినంత సిబ్బంది, ఆధునిక సాంకేతికతను అందించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు. అదనంగా, కార్మికులకు తమ హక్కుల గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలు అవసరం. చాలా మంది కార్మికులు కనీస వేతన చట్టం గురించి తెలియక, దోపిడీకి గురవుతున్నారు. స్థానిక స్థాయిలో కార్మిక సంఘాలు, ఎన్జీఓల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఈ సమస్యను తగ్గించవచ్చు.



కనీస వేతన చట్టం భారతదేశంలో కార్మికుల హక్కులను కాపాడేందుకు ఒక ముఖ్యమైన సాధనంగా ఉంది, కానీ దాని అమలులోని లోపాలు దాని ప్రభావాన్ని పరిమితం చేస్తున్నాయి. ఇది పూర్తిగా దస్త్రాలలోనే ఉందని చెప్పడం అతిశయోక్తి అయినప్పటికీ, అసంఘటిత రంగంలోని కార్మికులకు దీని ప్రయోజనాలు సమర్థవంతంగా అందడం లేదు. సమగ్ర సంస్కరణలు, బలమైన అమలు వ్యవస్థ, కార్మికులకు అవగాహన కల్పించడం ద్వారా ఈ చట్టాన్ని నిజంగా కార్మికుల సంక్షేమానికి ఉపయోగపడే సాధనంగా మార్చవచ్చు. కనీస వేతనం కేవలం చట్టంలోని అక్షరాలుగా మిగిలిపోకుండా, కార్మికుల జీవితాల్లో నిజమైన మార్పును తీసుకురావాలంటే, ప్రభుత్వం, యజమానులు, కార్మిక సంఘాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

ఉమాశేషారావు వైద్య, 9440408080

# ఇటిక్యాల మండలం భూ భారతి చట్టం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక

• జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, మే 2 (జనం సాక్షి) :** భూ భారతి చట్టం అమలుకు ఈ నెల 5 నుంచి 16 వరకు ఇటిక్యాల మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినందున, తహసీల్దార్లు పూర్తిగా సిద్ధంగా ఉండి ప్రజల భూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు భూభారతి చట్టం,రెవెన్యూ సదస్సు పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టట్ మాట్లాడుతూ భూ భారతి చట్టం అమలులో భాగంగా,జిల్లాలోని ఇటిక్యాల మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ మండలంలోని ఈనెల 05 న గోపాల్ దిన్నె,06న వావిలాల,07న పెద్ద దిన్నె,08న సాతర్ల, 09న ఎం.ఆర్. చెరువు, 12న షాబాద్, 13న ఇటిక్యాల, 14న చాగాపురం, 15న మునగాల,16న ఉదండాపురం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుండి భూ సంబంధిత దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇటిక్యాల మండలాన్ని పైలట్ మండలంగా ఎంపిక చేసిన నేపథ్యంలో అక్కడ అవసరమైన సిబ్బంది,టీమ్స్,అవసరమైన పత్రాలు,రిజిస్టర్లు మొదలైనవి ముందుగానే సిద్ధం చేయాలని తహసీల్దార్లకు సూచించారు. ప్రతి గ్రామం వారీగా మొత్తం సర్వే వివరాల జాబితాను తయారుచేసి అందుబాటులో ఉంచాలని సూచించారు సమస్యల కేటగిరీల ఆధారంగా పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల భూ సమస్యలపై స్వయంగా



దరఖాస్తులు తీసుకోవాలని,ప్రతి దరఖాస్తు సమగ్రంగా పరిశీలించబడేలా తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ చూపి పరిష్కరించాలని ఆదేశించారు.రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ప్రతి రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రోజువారీగా వాటిని నవీకరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామ పంచాయతీ కార్యదర్శుల సహకారంతో కార్యక్రమంపై ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ఈ కార్యక్రమపు ప్రధాన లక్ష్యమని, అందుకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ,తహసీల్దార్లు వీర భద్రప్ప,నరేష్, డిప్యూటీ తహసీల్దార్ నందిని,తదితరులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్

• కేసు విచారిస్తున్న ఏసీబీ అధికారులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, మే 2 (జనం సాక్షి) :** పక్క సమాచారంతో ఏసీబీ పంజా విసిరింది. ఒక సహా ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటుండగా వికారాబాద్ జిల్లా ఆప్కారి ఎక్సైజ్ సూపర్డెంట్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీధర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ అదుపులోకి తీసుకొని ప్రస్తుతం ఏసీబీ అధికారులు విచారణ జరిపారు. ఈ మేరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ వికారాబాద్ ఆప్కారి ఎక్సైజ్ కార్యాలయంలో నెలసరి జీతాలు టి ఏ బిల్లు చేసి పంపడానికి సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ సహా ఉద్యోగుల నుంచి 8 వేల రూపాయలు లంచం డిమాండ్ చేసినట్లు తెలియజేశారు.2022-2023 సంవత్సరానికి76 వేల రూపాయలకు పైబడి టి ఏ బిల్లు కోసం సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ 11 శాతం లెక్కన ఎనిమిది వేల రూపాయలు డిమాండ్ చేయగా సహ ఉద్యోగులు సీనియర్ అసిస్టెంట్ కు డబ్బులు ఇవ్వడంతో ఆయనను లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఏసీబీ డి.ఎస్.పి ఆనంద్ కుమార్ తెలియజేశారు. టి ఏ బిల్లులు ప్లాస్ అయిన తర్వాత డబ్బులు ఇస్తామని సహెూ ఉద్యోగులు సీనియర్ అసిస్టెంట్ మధ్య ఒప్పందం కుదిరిందని బిల్లు పాసై డబ్బులు వారి ఖాతాల జమ కావడంతో ఒప్పందం ప్రకారం ఎనిమిది వేల రూపాయలు ఇవ్వాలని సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ ఉద్యోగులపై ఒత్తిడి తేవడంతో వారు ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలియజేశారు. టి ఏ బిల్లు చెల్లింపులో వచ్చిన లంచం వాట లో ఏ ఏ అధికారులకు సంబంధం ఉందో అనే విషయమై సమగ్ర విచారణ జరుగుతున్నట్లు ఎసిబి డి.ఎస్.పి ఆనంద్ కుమార్ తెలియజేశారు. ఈ మేరకు సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ అరెస్టు చేసి ఎసిబి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలియజేశారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసిన అధికారుల వివరాలు గోప్యంగా ఉంచుతున్నట్లు ఆయన తెలియజేశారు. వికారాబాద్ జిల్లాలో ఏ శాఖలో నైనా ప్రభుత్వ అధికారులు ప్రజలను లంచం అడుగుతే ఏసీబీ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు. ఏసీబీ అధికారులను సంప్రదించడానికి టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



**చారకొండ, మే 2 (జనంసాక్షి) :** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై షంషుద్దీన్ అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో సైబర్ నేరాలపై శుక్రవారం ఎస్సై శంషుద్దీన్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పకూడదన్నారు. మొబైల్ యాప్ ద్వారా ఎలాంటి లోన్స్ తీసుకోకూడదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేష్ నాయక్ ,హెడ్ కానిస్టేబుల్ తిరుమల్ రావు, పీసీలు బాలరాజు ,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

• జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలు
• పరీక్షకు హాజరుకానున్న 3,320 విద్యార్థులు
• జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి ప్రతినిధి, మే 2 (జనం సాక్షి) :** నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు జిల్లా కలెక్టర్ కాంతి వల్లూరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో నీట్ పరీక్షపై రెవెన్యూ ,పోలీసు శాఖల అధికారులతో నీట్ పరీక్ష సన్నాహక సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి లోని బాలుర జూనియర్ కళాశాలలో నీట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ... సంగారెడ్డి జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాల్లో 3,320 విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతున్నారని విద్యార్థులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్పోర్ట్, సైన్ బోర్డులు, తాగునీరు, పార్కింగ్, టాయిలెట్, వైద్య శిబిరాలు పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరా, వీడియోగ్రఫీ, బయోమెట్రిక్ అటెండెన్స్ లు ఉన్నందువల్ల పరీక్షకు హాజరై విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ముందే చేరుకోవాలని ఉదయం 11 గంటల నుంచి 1:30 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు అనుమతి ఇస్తారన్నారు. 1: 30 అనంతరం గేట్లు మూసివేస్తారన్నారు. పరీక్ష



రాయబోయే విద్యార్థులు హాల్ టికెట్, ఐడి ప్రూఫ్, ఫోటో, తీసుకొని పరీక్షా కేంద్రానికి రావాలన్నారు. హాల్ టికెట్ పైన ఉన్న సలహా సూచనలు తప్పక పాటించాలన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్, వాచ్, ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పెన్నులు, పెన్సిల్ లాంటివి పరీక్షా కేంద్రాలలో తీసుకురావడానికి అనుమతి లేదన్నారు. విద్యార్థులు వేసవి దృశ్య వదులుగా ఉన్న దుస్తులు ధరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ కళాకారులకు గద్దరన్న ఐకాన్ అవార్డులు - 2025



**అల్వాల్, మే 2 (జనం సాక్షి) :** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, సాయి అలేఖ్య సాంస్కృతిక సేవ సంస్థ ఆధ్వర్యంలో ఉగాది నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ నిర్వహిస్తున్న ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం 'జానపదం - మా ప్రాణపదం' ఈ నెల 3న (శనివారం) సాయంత్రం 5 గంటలకు బి.ఎం. బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో జరగనుంది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న కవులు, కళాకారులలో 39 మందిని ఎంపిక చేసి వారిని 'గద్దరన్న ఐకాన్ అవార్డు - 2025'తో సన్మానించనున్నారు. ఈ అవార్డులు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ జానపద కళను ముందుకు తీసుకెళ్లిన వారిని గౌరవించాలనే ఉద్దేశంతో ఇవ్వబడుతున్నాయి. కార్యక్రమానికి రాష్ట్ర స్పీకర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రముఖ సాహితీవేత్తలు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా చైర్మన్ అరుణ ఉపద్రాస్తా మాట్లాడుతూ, తెలంగాణ మట్టి గళానికి ప్రాణంగా నిలిచిన జానపద కళను ప్రోత్సహించడమే మా లక్ష్యం. ఉద్యమ స్ఫూర్తిని అందించిన కళాకారుల సేవలను గుర్తించి ఈ అవార్డులను అందజేస్తున్నాం అని పేర్కొన్నారు.

# ఎర్లీబర్డ్‌లో జీహెచ్ఎంసీకి రూ.900.93 కోట్ల ఆస్తిపన్ను వసూలు

**హైదరాబాద్ సిటీ, మే 2 (జనంసాక్షి) :** ఎర్లీబర్డ్ పథకంలో భాగంగా జీహెచ్ఎంసికి రికార్డు స్థాయిలో రూ.900.93 కోట్ల ఆస్తిపన్ను వసూలు అయ్యింది. గత సంవత్సరం రూ.831.23 కోట్లు వసూలు కాగా, గత సంవత్సరానికి మించి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.900.93కోట్ల రూపాయలను జీహెచ్ఎంసీ సేకరించింది.2025-26 ఆర్థిక సంవత్సర ఆస్తిపన్నును ఏప్రిల్ 30వ తేదీలోగా చెల్లిస్తే పన్ను మొత్తంపై 5శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ సంవత్సరం పెద్ద మొత్తంలో ఆస్తిపన్ను చెల్లించే సంస్థలు, కార్యాలయాలు, వ్యక్తులు ఎర్లీబర్డ్ పథకాన్ని పెద్ద ఎత్తున వినియోగించుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎర్లీబర్డ్ పథకాన్ని 7,93,552 మంది వినియోగించుకున్నారు. ఎర్లీబర్డ్ పథకంపై డిప్యూటి కమిషనర్లపై నిరంతర సమీక్ష,టెలీకాన్ఫరెన్సులు, వివిధ ప్రచార సాధనాల్లో విస్తృత ప్రచారం నిర్వహించడం వల్లే గత సంవత్సరం కన్నా అధికమొత్తంలో పన్నులు వసూలయ్యాయి. జీహెచ్ఎంసి ఉన్నతాధికారులు, జోనల్, డిప్యూటి కమిషనర్లు అన్ని విభాగాల క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి వల్లే గత సంవత్సరాన్ని మించి ఆస్తిపన్ను వసూలయ్యింది.

# ఫుడ్ ఇండియా ఎక్స్‌పో-25కు స్పాన్సర్‌గా కేఆర్‌బీఎల్

**ఖైరతాబాద్, మే 2 (జనం సాక్షి) :** ఆహార పరి శ్రమలో గ్లోబల్ లీడర్, ప్రపంచంలోని నెం.1 ఇండి యా గేట్ బాస్మతి రైస్ మాతృసంస్థ అయిన కేఆర్ బీఎల్ లిమిటెడ్ హైదరాబాద్‌లోని ప్రీమియర్ ఫుడ్ ఇండియా ఎక్స్‌పో-2025కు టైటిల్ స్పాన్సర్‌గా వ్య వహరించనుందని కేఆర్‌బీఎల్ మోడర్న్ ట్రేడ్, ఈ-కామర్స్ విభాగం మార్కెటింగ్, బిజినెస్ హెడ్ కునా ల్ శర్మ శు క్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ యన మాట్లాడుతూ ఈ ఎక్స్‌పోలో ప్రధానంగా కే ఆర్‌బీఎల్ వారి ప్రధానమైన ఉత్పత్తులు ఇండియా గేట్ బాస్మతి రైస్, యూనిటీ బాస్మతి రైస్, జబ్రీన్ బాస్మతి రైస్‌లత పాటు ఇటీవలే విడుదల చేసిన బిర్యానీ మసాలానుకూడా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

# రాజకీయాలకతీతంగా అభివృద్ధి జరగాలి

• ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, మే 2 (జనం సాక్షి) :** రాజకీయాలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు.శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మైసమ్మ నగర్ లో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సిసి రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గంలోని అన్నిప్రాంతాలను అభివృద్ధి పరచామని విశ్వసిస్తున్నారు. అందరి సహకారంతో నియోజకవర్గాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు. ఆడుకోవడానికి సరైన వసతులు,సదుపాయాలు లేక పిల్లలు,పెద్దలు చాలా ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు మూడు కోట్ల రూపాయల వ్యయంతో ఇండోర్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేసి ఇటీవల ప్రారంభించినట్లు వారు పేర్కొన్నారు. కొందరు అధికార పార్టీ నాయకులు ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవంపై రాజకీయాలు చేస్తున్నారని వారి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవలే వరంగల్‌లో



జరిగిన బిఆర్ఎస్ రజతోత్సవ సభ తో బిఆర్ఎస్ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో ఉన్నారన్నారు.గడిచిన ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుబడిపోయింది అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, జాతీయ బీసీ భాగం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు నల్ల గోపుల బాబుగౌడ్,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అంకిన బోయిన వేణుయాదవ్, హనుమంత్,గిరి,మైసమ్మ నగర్ 'బి'బ్లాక్ అధ్యక్షుడు బసవప్ప గుప్తా, ప్రధాన కార్యదర్శి బండారి రవీందర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ యాదవ్, బస్తీ వాసులు ఎల్ఐసి వెంకటేష్,శ్రీశైలం చారి,రమేష్ చారి,నాగార్జున్,ప్రేమ్ సాయి, సాయి కిరణ్,ఉపేందర్, కన్నయ్య,భాను,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్

**గద్వాల నడిగడ్డ, మే 2 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన 10 మంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్.శుక్రవారం ఐడిఓసి కలెక్టర్ చాంబర్ నందు ప్రభుత్వ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-II ఎంపికైన అభ్యర్థులు జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్,నియమితులైన ఉద్యోగులకు అభినందనలు తెలుపుతూ వారు తమ హాస్టల్స్‌లో విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని, విద్యార్థుల భద్రత, ఆహారం, వసతి మొదలైన వాటిపై శ్రద్ధ పెట్టి పనిచేయాలని సూచించారు. నియామక పత్రాలు అందుకున్న వారికి వివిధ ప్రాంతాల్లోని హాస్టల్స్‌లో బాధ్యతలు అప్పగించబడ్డాయని తెలిపారు. మన్నె సాయి సౌజన్యకు అలంపూర్ మండలంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్ సురేష్ గౌడ్‌కు, మల్దకల్ మండలంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్,బస్వరాజుకు గట్టు ప్రాంతంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్,రమేష్‌కు గద్వాల్‌లోని ప్రభుత్వ ఎస్సీ కాలేజ్ బాయ్స్ హాస్టల్, ఆంజనేయులుకు గద్వాల్‌లోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్ - బి,రామ్ గోపాల్‌కు మనోపాడ్ ప్రాంతంలోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్,జయరాంకు రాజోలి ప్రాంతంలోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్,శేషన్నకు ఉండవెల్లి ప్రాంతంలోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్, నరేష్‌కు వల్లూరు ప్రాంతంలోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్, ప్రసాదుకు అలంపూర్ మండలంలోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో నియామకాలు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి సరోజమ్మ ,తదితరులు పాల్గొన్నారు.



# భగాయత్‌లో పారిశుధ్యానికి పెద్దపీట

• కార్మికుల నియామకానికి రంగం సిద్ధం
• వీధి దీపాల నిర్వహణకు ప్రత్యేక ఫోకస్
• కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవ

**ఉప్పల్, మే 2 (జనం సాక్షి) :** ఉప్పల్ భగాయత్‌లోని హెచ్ఎండీఏ లే అవుట్‌లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక ఫోకస్ పెట్టినట్టుగా ఉప్పల్ వార్డు ఆఫీస్ లో జిహెచ్ ఎం సి అధికారులు మరియు ఉప్పల్ హెచ్ఎండిఏ బాగాయత్ రెసిడెన్షల్ వెల్ఫర్ అసోసియేషన్ సభ్యుల సామావేశంలో కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సిబ్బంది నియామకం, డస్ట్ బిన్‌ల ఏర్పాటు వంటి అంశాలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు, సిబ్బంది కూడా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఉప్పల్ సర్కిల్‌లోన పారిశుద్ధ్య విభాగం, వీధి దీపాల నిర్వహణకు విద్యుత్ శాఖ అధికారులతో కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. పారిశుద్ధ్య సిబ్బంది నియామక ప్రక్రియ తుది దశలో ఉందని ఈ సందర్భంగా రజితాపరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మొదటి విడతలోనే భగాయత్‌లో పారిశుద్ధ్యం కోసం 25 మంది సిబ్బందిని నియమించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. అతి త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. రెండో విడతలో ఇంకా కావాల్సిన పారిశుద్ధ్య కార్మికుల నియామకం జరుగుతుందన్నారు. భగాయత్‌లోని వీధుల్లో



చెత్త వేయకుండా కూడా ముందస్తు జాగ్రత్తలు చేపట్టనున్నట్టుగా రజితాపరమేశ్వర్‌రెడ్డి చెప్పారు. భగాయత్‌లోని అన్ని వీధుల్లో చెత్త డబ్బాలను ఏర్పాటు చేయనున్నట్టుగా తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కూడా సిద్ధం చేశామన్నారు. వీధి దీపాల నిర్వహణపై కూడా ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లుగా రజితాపరమేశ్వర్ రెడ్డి చెప్పారు. ఇప్పటికే భగాయత్ లో వీధి దీపాలను సైతం ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ ఓ రంజిత్,జి హెచ్ ఎంసీ ఎలక్ట్రికల్ డిఈ రవీందర్, ఏఈటిఆర్ ప్రసాద్,ఉప్పల్ హెచ్ఎండీఏ బాగాయత్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్ రావు, సుధాకర్ రెడ్డి , వంశీ దార్ రెడ్డి, ఈగ సంతోష్, లింగంపల్లి రామకృష్ణ, చిరంజీవి రెడ్డి, మహేష్, నరేంద్ర చౌదరి, మనోహర్ రెడ్డి, అంజి రెడ్డి, శివ ప్రసాద్ శుభన్ రెడ్డి సామ్ జంగయ్య పాల్గొన్నారు.

# విద్యతోనే మనిషికి ఉన్నత స్థాయి..

• జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, మే 2 (జనం సాక్షి) :** విద్యా సముపార్జన ద్వారా మాత్రమే మనిషి ఉన్నత స్థాయికి చేరుకోగలడని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో స్నేహ జూనియర్ కళాశాల రామాయంపేట విద్యనభ్యసించి ఇంటర్మీడియట్ ఫస్టియర్ సెకండియర్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను కలెక్టర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గర్వంగా ఉందని భవిష్యత్తులో కూడా ఇష్టంతో మంచి ఉన్నత చదువులు చదివి సమాజంలోని పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలకు సేవలు అందించే స్థాయికి చేరాలని అన్నారు. , తల్లిదండ్రుల కలలు సాకారం చేసే దిశగా అడుగులు వేసి సమాజం కీర్తించ దగిన గొప్ప పౌరులుగా ఎదిగి తల్లితండ్రులకు అలాగే మన జిల్లాకు, రాష్ట్రానికి తద్వారా దేశానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు తేవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. రామాయంపేట స్నేహ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించిన వారి వివరాలు ఈ. రుత్విక - 470 ఎంపీసీ గ్రూపులో మార్కులకు గాను 467 సాధించి స్టేట్ సెకండ్ ర్యాంక్, అంచల్ సింగ్ -ఇంటర్మీడియట్ బైపిసి 02 ఇయర్ 1000/982 సాధించి జిల్లా సెకండ్ ర్యాంక్, పి విష్ణు సిఇసి.02 ఇయర్



డివిజన్ సెకండ్ ర్యాంక్, కే లహరి-02 ఇయర్ ఎంపీసీ డివిజన్ సెకండ్ ర్యాంక్, శ్రీహరి సిఇసి , ఫస్ట్ ఇయర్, డివిజన్ ఫస్ట్ ర్యాంక్, ఎస్. శివాని, బైపీసీ ఫస్ట్ ఇయర్, 440/426 కాలేజీ టాపర్, ఈ కార్యక్రమంలో రామాయంపేట స్నేహ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వి సత్యనారాయణ, ప్రిన్సిపల్ ఏ రవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**గద్వాల నడిగడ్డ, మే 2 (జనం సాక్షి) :** భూ భారతి చట్టం నిబంధనల మేరకు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ,హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి భూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి మే 20 వరకు పైలట్ ప్రాజెక్టు జిల్లాలు మినహాయించి మిగిలిన జిల్లాలలో ఒక మండలాన్ని పైలట్ గా తీసుకొని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యల పై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని మంత్రి సూచించారు. జూన్ 2 వరకు పైలట్ ప్రాజెక్ట్ క్రింద వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి తెలిపారు. భూ భారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తు నమోదు అయ్యేలా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని అన్నారు. మే నెల చివరి వరకు రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా




పరిష్కారం చూపాలని మంత్రి పేర్కొన్నారు. గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూముల పట్టాలు ఎవరైనా విక్రయిస్తే ముందు ఆ పట్టాలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వారు భూమి లేని నిరుపేద లైతే ప్రభుత్వం చర్చించి ఎంత భూమి క్రమబద్ధీకరించాలి అనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అటవీ భూముల వివాదాల పరిష్కారానికి కూడా కృషి చేయాలని అన్నారు. నీట్ పరీక్ష కేంద్రాలను ముందుగా జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి ఏర్పాట్లు పర్యవేక్షించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు త్రాగు నీటి సరఫరా,పారిశుధ్య నిర్వహణ,ఓఆర్ఎస్ ప్యాకేట్లతో చిన్న మెడికల్ క్యాంపు,నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని అన్నారు. సీసీ కెమెరాలు, అవసరమైన మేర పోలీస్ భద్రత కల్పించాలని అన్నారు. ప్రశ్న పత్రాలు స్టోర్ చేసే స్ట్రాంగ్ రూం వద్ద సిసిటివి ఉండాలని, పోలీస్ బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు ప్రశ్నా పత్రాలను తరలించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల గేటు మధ్యాహ్నం 1.30 గంటలకు మూసి వేయాలని, ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా చెక్ చేసిన తర్వాత మాత్రమే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించాలని, బయో మెట్రిక్ అటెండెన్స్ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో జరిగిన ఎటువంటి పొరపాట్లు మరో సారి పునరావృతం కాకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. పేదలకు ప్రభుత్వం అందించే శాశ్వత ఆస్తి ఇందిరమ్మ ఇండ్లని,ఇది ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మమైన కార్యక్రమం అని, అర్హుల జాబితా ఎంపిక చేయడం చాలా కీలకం అవుతుందని, అనర్హులకు పథకం అందితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాలు,పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందే విధంగా మార్గదర్శకాలను పాటించాలని మంత్రి అధికారులకు తెలిపారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, ఎస్పి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, తహసీల్దార్ లు, సంబంధిత హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను చర్చలకు పిలిచి న్యాయం చేయాలి

- తెలంగాణ ఆర్టీసీ జేఏసీ కో చైర్మన్ కే హనుమంతు ముదిరాజ్



**మోమిన్‌పేట, మే 2 (జనం సాక్షి) :** టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులను ఉద్యోగులను చర్చలకు పిలిచి ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేయాలని తెలంగాణ జేఏసీ కో చైర్మన్ కె హనుమంత్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బస్ డిపో ఎదురుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా కే హనుమంత్ ముదిరాజ్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని అన్నారు.2017 వేత్తన బకాయి చెల్లించాలని, కొత్త అలవెన్స్ లు అమలు చేయాలని అన్నారు.2021, 2025 వేతన సవరణలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి సిబ్బందిపై పనిభారాలు తగ్గించాలని అన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని ఆర్టీసీకి ఇవ్వాలని అన్నారు. అన్ని కేటగిరిలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని అన్నారు. మహిళ కండక్టర్లతోపాటు మహిళా ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అన్నారు.పని భారం తగ్గించి ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను చర్చలకు పిలువకుంటే టీజీఎస్ ఆర్టీసీ జెంట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ వెంకన్న సుద్దాల సురేష్ కో చైర్మన్ కాశీం జేఏసీ నాయకులు మహేందర్ మహిపాల్ గౌడ్ మక్బూల్ సలీం అమృత పార్వతి నాగిరెడ్డి ఏ ఆర్ రెడ్డి మాణిక్యంతదితరులు పాల్గొన్నారు.

## జనగణనతో పాటు కులగణన చారిత్రాత్మక నిర్ణయం



**బిజినేపల్లి, మే 2 (జనం సాక్షి) :** దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణనను ప్రధాని నరేంద్ర మోడి చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ గుమ్మకొండ భూషయ్య అన్నారు. మండల కేంద్రంలోని పూలే అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం ప్రధానమంత్రి నరేం ద్ర మోడి చిత్రపటానికి మండల బీజేపీ నాయకులతో కలిసి పాలాభిషేకం చేసి మాట్లాడారు. కులగణన, జనగణన చేపట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో పారదర్శకత వస్తుందన్నారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాల ప్రజలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో వాటా దక్కుతుందన్నారు. 1930 తర్వాత దేశంలో కుల గణన చేపడుతున్న కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోడికి, కేంద్ర మంత్రులకు రాష్ట్ర ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చ నాయకురాలు చంద్రకళ, ఊర్కొండ రఘుబాబు, తిరుపతయ్య, లక్ష్మినారాయణ, రంజిత్, వెంకటేష్, మహేష్, నరసింహ, సత్యం, రమేష్ గౌడ్, నిరంజన్, ప్రశాంత్, భరత్ తదితరులు ఉన్నారు.

## రెవెన్యూ అధికారులు అంకితభావంతో పనిచేయాలి

- భూభారతి ద్వారా సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా బ్యూరో మే 2 (జనం సాక్షి) :** రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుండి భూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, ఇందిరమ్మ ఇల్లు, నీట్ పరీక్ష నిర్వహణపై రెవెన్యూ, గృహ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణ లు రెవెన్యూ శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారత్ చట్టాన్ని పకడ్బందీగానిర్వహించాలని, అత్యంత పేద వారికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరికై తీసుకోవాల్సిన ప్రమాణికలపై అధికారులకు సూచించారు. అదేవిధంగా ఈనెల 4న నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్ష సజావుగా జరిగేలా కావలసిన ఏర్పాటు చేసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులకు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టాన్ని అమలు చేసేందుకు గాను పైలెట్ ప్రాజెక్టు కింద భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను నిర్వహించి అర్జీలను స్వీకరించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. వారసత్వ, సాదా బైనమాల, ఆర్ఎస్ఆర్ అసైన్మెంట్,



ప్రభుత్వ భూముల గుర్తింపు తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆయన తెలిపారు.అత్యంత నిరుపేదవారికి మొదటి ప్రాధాన్యతగా ఇండ్ల మంజూరుకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా వచ్చిన జాబితాలను పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మే 4న జరిగే నీట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తు, త్రాగునీరు, మెడికల్ క్యాంపులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ నుండి జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్డిఓ వాసు చంద్ర, డీఆర్డిఓ శ్రీనివాస్, సిపిఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఇఇ కృష్ణయ్య, నీట్ సిటి కోఆర్డినేటర్ కే.సాయిలత, తహసీల్దారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు త్వరగా గ్రౌండింగ్ అయ్యే విధంగా చూడాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, మే 2 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మొదటి విడతలో మంజూరు అయిన ఇళ్లు త్వరగా గ్రౌండింగ్ అయ్యే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఎంపీడీఓ లను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపిఒ లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. జనవరి 26న మొదటి విడతలో ప్రతి మండలం నుంచి ఒక్కో గ్రామానికి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని 1300 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కానీ ఇప్పటి వరకు కేవలం 414 మంది లబ్ధిదారులు మాత్రమే నిర్మాణం ప్రారంభించుకున్నారని, వాటిలో 94 బేస్మెంట్ వరకు పూర్తి అయ్యాయని, 54 ఇళ్లకు మొదటి విడత బిల్లు పేమెంట్ అయినట్లు తెలిపారు. అందువల్ల ఎవరైతే ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభించుకోలేదో వారితో రేపు సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా మాకు ఇష్టం లేదు అంటారో వారి నుండి లిఖిత పూర్వకంగా రాయించుకోవాలని ఆదేశించారు. ఇష్టం లేని వారిస్తానంలో ఇతర పేద కుటుంబాలకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ మే 10 నాటికి పూర్తి కావాలని ఆదేశించారు. నిర్మాణం ప్రారంభించిన వారు 600 చదరపు అడుగులలో మాత్రమే కట్టుకోవాలని ఎవరైనా ఎక్కువ స్థలంలో ఇల్లు ప్రారంభించుకొని ఉంటే కుదించుకునే విధంగా ఒప్పించాలని లేనిపక్షంలో ఇందిరమ్మ ఇళ్లు రద్దు చేయాలని సూచించారు. రెండవ విడతలో భాగంగా ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా లక్ష్యం మేరకు ప్రత్యేక అధికారులు స్క్రూటినీ చేసిన జాబితాను కలెక్టర్ లాగిన్ కు పంపించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, హౌసింగ్ పి.డి. పర్వతాలు, డి.ఈ విటోభ, తహశీల్దార్లు, ఎంపీడీఓ లు, ఎంపీఒ లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతుల నిరసన



**ఝరాసంగం, మే 2 (జనం సాక్షి) :** ఎల్గోయి గ్రామంలో గత వారం రోజులుగా త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో శుక్రవారము గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లడుతూ గత వారం రోజుల నుండి త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో తమ పంట పొలాల్లో సాగు చేస్తున్న పంటలు ఎండుమొకం పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అంజన్న అనే రైతు మూడు ఎకరాలలో చెరుకు పంట సాగుచేసేందుకు తెచ్చిన విత్తన చెరుకు విద్యుత్ సమస్యతో ఎండుమొకం పడుతుందని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయమై విద్యుత్ ఏఈకి పలుమార్లు ఫోన్ చేసిన స్పందించడం లేదన్నారు. లక్షలు వెచ్చించి పంటలు సాగుచేస్తే విద్యుత్ అధికారుల నిర్లక్యం కారణంగా పంటలు ఎండుమొకం పట్టి చివరకు కన్నీరు మిగిల్చేలా ఉన్నారన్నారు. మాకు ఈ లైన్ మెన్ వద్దు అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. నిరసనలో రైతులు అశోక్, అంజన్న, ప్రభు, నాగేష్, యేసయ్య, జానిమియా, మక్బూల్, శేఖర్,రాములు తదితరులు ఉన్నారు.

## ఉపాధి కూలీల సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

- వ్యా.కా.స మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్

**చేర్యాల, మే 2 (జనంసాక్షి) :** మేడే వారోత్సవాల సందర్భంగా చేర్యాల మండలం సుంచనకోట గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జెండాను సంఘం మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గొర్రె శ్రీనివాస్ మాట్లాడుతూ.. నాడు 8 గంటల పని కోసం పనికి తగ్గ వేతనం కోసం శ్రామిక వర్గం ఏకమై పోరాడి సాధించుకున్న రోజే మేడే ఈ మేడే స్ఫూర్తితో వ్యవసాయ కార్మికులు తమ హక్కుల కోసం ఐక్యమై పోరాడాలని పిలుపునివ్వడం జరిగింది. నేడు ఉపాధి హామీ పథకంలో గత నాలుగు నెలల నుండి పనిచేసిన కూలీలకు ప్రభుత్వం కూలి డబ్బులను ఇవ్వడం లేదని ప్రతి గ్రామంలో కూలీల తో పనులు చేయిస్తూ క్షేత్రస్థాయి బాధ్యతలను నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు దాదాపు 6 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని రెక్కలను నమ్ముకుని రెక్కలే ఆస్తులుగా శ్రమ చేస్తూ జీవించే కూలీల పట్ల ప్రభుత్వం ఇంత కర్కాశంగా వ్యవహరించడం సరైంది కాదని పేదలకు, కూలీ డబ్బులు సకాలంలో రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ ఇబ్బందులను అధిగమిస్తూ కూలీలు ప్రభుత్వం మీద నమ్మకంతో పనులు చేస్తున్న ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం లేదని ఇప్పటికీ వ్యవసాయ కూలీలకు నాలుగు నెలలు పూర్తయిన డబ్బులు



అందడం లేదని అదే రకంగా ఎండలో పని చేసినప్పటికీ సమ్మర్ అలవెన్స్ ఇవ్వడం లేదని ,గడ్డపార సాన పెట్టిన ఖర్చులు రావడంలేదని, పే స్లిప్పులు ఇవ్వడం లేదని, అనేక సమస్యలతో సతపాతం అవుతూ ఎండలో పనిచేస్తున్న కూలీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసలే పట్టించుకోవడంలేదని వెంటనే బకాయి డబ్బులు చెల్లించి ఈ నిరుపేదలను వారి ఇబ్బందులను అర్థం చేసుకొని ప్రభుత్వం ఈ కూలీలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని వారికి ఉన్న క్షేత్రస్థాయి సమస్యలన్నీ పరిష్కరించేలా పూనుకోవాలని ఇందుకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పందుగ కనకయ్య, రాజు, అండాలు, కనుక లక్ష్మీ, నరసవ్వ, సుజాత, హలీమా తదితరులు పాల్గొన్నారు.

## ఫైరింగ్ రేంజ్ శిక్షణను ప్రారంభించిన మల్టీ జోన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి




**నార్సింగి, మే 2 (జనం సాక్షి) :** విధి నిర్వహణలో భాగంగా పోలీస్ సిబ్బందికి ప్రతి సంవత్సరం ఫైరింగ్ శిక్షణ ఉంటుందని, అది ఎంతో ముఖ్యమైనదని మల్టీ జోన్ ఐజి చంద్ర శేఖర్ రెడ్డి అన్నారు. నార్సింగి గ్రామ శివారులోని మల్లన్న గుట్ట సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ ఫైరింగ్ రేంజ్ ప్రశిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఐజి చంద్ర శేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికీ స్థానిక తాసిల్దార్ షైక్ కరీం మొక్కలు అందజేశారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించరు. ఫైరింగ్ రేంజ్ లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, ప్రాక్టీస్ గ్రౌండ్ లో బుల్లెట్లు ఫైర్ చేసి ఫైరింగ్ రేంజ్ ను ప్రారంభించారు. ఫైరింగ్ లో ఐజి, కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐజి చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మెదక్ పోలీస్ సిబ్బంది ఫైరింగ్ చేయుటకు సిద్దిపేట జిల్లా రాజగోపాల్ పేట్, సంగారెడ్డి జిల్లా ఫైరింగ్ రేంజ్ కు వెళ్లాల్సి వచ్చేదని, మెదక్ పోలీసులకు ఉపయుక్తంగా ఉండేందుకు నార్సింగి ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధతో భూమి కేటాయించినందుకు కలెక్టర్ రాహుల్ రాజ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నార్సింగి ఫైరింగ్ రేంజ్ స్థలం రాళ్ళు రప్పల తో ఉన్న దానిని శ్రమించి ఎంతో అద్భుతంగా తీర్చిదిద్ది నందుకు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, ఏ.ఆర్ డీఎస్పీ రంగ నాయక్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట రాజా గౌడ్, స్థానిక ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ లను ఆయన అభినందించారు. పోలీస్ వ్యవస్థ ఉన్నంత వరకు ఈ ఫైరింగ్ రేంజ్ ఉపయోగంలో ఉంటుందని, ఉద్యోగ విరమణ సమయం దగ్గర పడుతున్నా ఎనలేని పట్టుదలతో తన ఉద్యోగ కాలంలో పోలీస్ వ్యవస్థకు చిరకాలం ఉపయుక్తంగా ఉండే ఫైరింగ్ రేంజ్ కోసం శ్రమించిన ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఫైరింగ్ రేంజ్ లో రేంజ్ డిసిప్లిన్ పాటించాలని, ప్రజా సేవకు పోలీస్ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు తమ ఆయుధ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మహేందర్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, 8 సర్కిళ్ల సీఐ లు, 21 మంది ఎస్ఐలు వారి సిబ్బంది పాల్గొన్నారు.

# పాడి రైతుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి

- తెలంగాణ పాడి రైతుల సంఘం

**హయత్‌నగర్, మే 2 (జనం సాక్షి) :** హయత్ నగర్ లోని మదర్ డైరీ చైర్మన్ కు రైతులకు చెల్లించవలసిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ పాడి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మంగా నర్సింలు, కో కన్వీనర్ పెసరకాయల జంగారెడ్డి లు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదర్ డైరీ సంస్థ మూడు నెలల కాలం నుండి పాడి రైతుల వద్ద సేకరించిన పాల డబ్బులు 64 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉండగా చెల్లించకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మదర్ డైరీ పాడి రైతులకు 15 రోజులకు ఒకసారి బిల్లు ఉండగా, గత మూడు నెలల నుండి బిల్లు చెల్లించకుండా రైతులను అప్పుల పాలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది రైతులు మదర్ డైరీ సంస్థకు పోసే పాలను ఇతర డైరీలకు డైవర్ట్ అవుతున్నారని అన్నారు. ఈ మదర్ డైరీ చైర్మన్, పాలకవర్గమే దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు అన్నారు. మదర్ డైరీ నిర్వీర్యం చేయుటకే



పాలకవర్గం కుట్ర పన్నిందని వారు అన్నారు. తక్షణమే రైతులకు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, మదర్ డైరీ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు ఇవ్వవలసిన ఆరు పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలి, లీటరుకు ఐదు రూపాయల ప్రోత్సాహకమును వెంటనే రైతుల ఖాతాలో జమ చెయ్యాలి. 50 శాతం సబ్సిడీపై పాడి సంరక్షణ మందులు, గడ్డి విత్తనాలు ఇవ్వాలి. టెస్టర్లు, చాప్టర్లు, అనలైజర్లు సరఫరా చేయాలి అని వారు కోరారు. పశుపోషణ పథకాన్ని అమలు చేస్తూ ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. మొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేసి రైతుల ఇంటి వద్దకే పశు వైద్య సౌకర్యం కల్పించాలి. రైతుల పిల్లలను ఇంటర్ వరకు ప్రోత్సహించడానికి సబ్సిడీ ఇవ్వాలి. ఉన్నత విద్య చదువు వరకు చదువుతున్న పిల్లలకు స్కాలర్షిప్ లు ఇవ్వాలి. పశువుల దానాలు సబ్సిడీపై అందించాలి, పాడిని ఉత్పత్తి చేసే రైతులకు వ్యక్తిగత భీమా సౌకర్యం కల్పించాలి, ఈ ప్రీమియమును ప్రభుత్వమే చెల్లించాలి. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి డిమాండ్ చేస్తూ మదర్ డైరీ చైర్మన్ ను, పాలకవర్గాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పాడి రైతుల సంఘం రాష్ట్ర కమిటీ కన్వీనర్ మంగా నర్సింహులు రాష్ట్ర కోకన్వీనర్ పెసరకాయల జంగారెడ్డి సంధిలా భాస్కర్ గౌడ్, జిల్లా అధ్యక్షులు దొంతరి సోమిరెడ్డి, జిల్లా కోశాధికారి మాటూరి బాలరాజు గౌడ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బండి నాగయ్య, జిల్లా రైతు సంఘం నాయకులు బి మధుసూదన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మూడుముళ్లకు వెనకడుగు !

**పెళ్లిపై ఆసక్తి చూపని యువత**

**30 ఏళ్ళు దాటిన పెళ్లి ఊసేత్తని యువత**

**పెళ్లొద్దు గురూ సింగిల్ లైఫే బెటరంటున్నా యూత్**

**రాజోలి, మే 02 (జనంసాక్షి) :**

ఏ వయస్సులో జరగాల్సిన ముచ్చట ఆ వయస్సులో జరగాలనేది ఒకప్పటి పెద్దల మాట. ఆడపిల్ల వయస్సు 20 ఏళ్లు దాటితే చాలు తల్లిదండ్రులు పెళ్లి చేసేందుకు సంబంధాలు చూసేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. తమకు ఇష్టమైనప్పుడు, నచ్చిన వ్యక్తినే పెళ్లి చేసుకుంటామని చదువుకున్న ఆడపిల్లలు తెగేసి చెప్తున్నారు. జీవితంలో స్థిరపడి, కొంతకాలం ఎంజాయ్ చేసిన తర్వాత పెళ్లి చేసుకోవాలని అబ్బాయిలు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో యువతీ యువకులకు సంబంధం కుదిర్చి పెళ్లి చేయడమంటే మామూలు విషయం కాదంటున్నారు పెళ్లిళ్ల పేరయ్యలు. మూడు పదుల వయసు దాటినా తమ పిల్లలు పెళ్లి ఊసెత్తడం లేదని, అడిగితే ఇప్పుడేం తొందర అంటున్నారని పలువురు తల్లిదండ్రులు నిరాశ చెందుతున్నారు.

**స్థిరపడ్డాకే భాజా భజంత్రీలు**

జీవితంలో డబ్బు సంపాదించిన తర్వాతనే పెళ్లి చేసుకునేందుకు యువత ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. సాఫ్ట్వేర్ రంగంలో ఈ సమస్య మరి అధికంగా ఉంది. జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లిళ్లు చేసుకోవాలన్న ఆలోచన రావడంతో పెళ్లిళ్లు వాయిదా పడుతున్నాయి. ఇద్దరు కలిసి ఉద్యోగాలు చేస్తే తప్ప సిటీలో బ్రతకలేమనే నేటి యువత ఆలోచన చేస్తుంది. వివాహానికి ముందే ఒక ఒప్పందానికి వస్తు జీవితం పట్ల అవగాహన పెంచుకుంటున్నారు. ఒకరి జీతం పొదుపుకు, మరొకరి జీతం ఇంటి అవసరాలకు ఉండే విధంగా ప్లాన్ చేసుకుంటున్నారు. దీంతో సాఫ్ట్వేర్ రంగంలో స్థిరపడిన వాళ్లు డబ్బుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతో 30 దాటిన కూడా పెళ్లిళ్లు కావడం లేదు. అన్నిటికి డబ్బే ప్రదానం కావడంతో పెళ్లిళ్లు వాయిదా పడుతున్నాయి. అమ్మాయిని ఇవ్వాలంటే అబ్బాయిలకు ఆస్తులు డిమాండ్ పెరగడంతో వివాహాలు ముందుకు సాగడం లేదు. ఏది ఏమైనా పెళ్లిళ్లకు డబ్బే ప్రధాన సమస్య కావడంతో నేటి యువతకు పెళ్లిళ్లపై ఆసక్తి రోజురోజుకు తగ్గిపోతోంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. 25 ఏళ్లకే పెళ్లిళ్లు చేసి బాధ్యతలు దించుకోవాలని తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

**సోలో బతుకే సో బెటర్ అంటున్న యువత**

30 ఏళ్లు దాటినా కూడా పెళ్లి చేసుకునేందుకు నేటి యువత ముందుకు ఆసక్తి చూపకపోవడంతో బిడ్డల మనసు అర్థం కాక తల్లిదండ్రులు మదన పడుతున్నారు. స్నేహితులది ఒకరిది సంసార జీవితం చెడిపోయిందని మాది అలాగే అవుతుందని భయపడుతూ ఒకరిని చూసి మరొకరు వివాహం వాయిదా వేసుకుంటున్నారు. ఫ్రెండ్స్ పెళ్లిళ్లు చేసుకొని కోర్టు మెట్లు ఎక్కారని ఆ అమ్మాయి జీవితం నాశనమైందని అమ్మాయిలు కూడా పెళ్లిళ్లపట్ల ఆసక్తి చూపడం లేదు. ఎవరివో జీవితాలు విచ్ఛిన్నమయ్యాయని మావి అలాగే జరుగుతాయని భయపడిపోతూ పెళ్లిళ్లు చేసుకునేందుకు అమ్మాయిలు జంకుతున్నారు. ఇప్పుడే తొందర ఏముంది నిదానంగా చేసుకుందాంలేనని ఆలోచిస్తూ ఆలోచిస్తూ 30 ఏళ్లు చేశా దాటిపోతున్న పెళ్లిళ్లు వాయిదా వేసుకుంటున్నారు. వివాహ బంధం పై అనుమానంతో అటు అమ్మాయిలు ఇటు అబ్బాయిలు 35 దాటిన కూడా పెళ్లి మాట ఎత్తడం లేదు. యువతకు గడ్డాలు మీసాలు పెరిగిపోయి అబ్బాయిలు పెళ్లి కానీ ప్రసాదులుగా మిగిలిపోతున్నారు. అమ్మాయిలకు ఏజ్ దాటిపోయి ముఖంలో కల తగ్గిపోయి పెళ్లిళ్లు ఆలస్యమవుతున్నాయి. తీరా బంధువుల బలవంతం మీద పెళ్లిచూపులకు ప్రసిద్ధమవుతుంటే ఏజ్ అయిపోయింది కదా పిల్లను ఎవరు ఇస్తారని సంబంధాలు కుదుర్చుకోలేకపోతున్నారు. బిడ్డలకు సంబంధాలు కుదరకపో వడంతో తల్లిదండ్రులు దిగులు చెందుతున్నారు. ఒకపక్క బంధువుల సూటిపోటీ మాటలు మరోపక్క పిల్లల వయసు పెరిగిపోతుండడంతో అయ్యో ఆలస్యం చేశామని తల్లిదండ్రులు, మరోపక్క బిడ్డలు ఆందోళన చెందుతున్నారు.

**ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలనే యువత పట్టు**

పెళ్లిళ్లకు ప్రభుత్వ నోటిఫికేషన్లకు సైతం లింక్ ఉందండోయ్..ప్రభుత్వ ఉద్యోగం వస్తే గానీ పెళ్లిళ్లు చేసుకోమని భీష్మించుకుని కూర్చున్నవారు చాలా మంది ఉన్నారు. ఎలాగైనా ప్రభుత్వోద్యోగం సాధించాలనే తపనతో ఏళ్లుగా కష్టపడే వారు యూనివర్సిటీ లైబ్రరీల్లో కనిపిస్తూనే ఉన్నారు. అందరి నోట ఒకే మాట. ప్రభుత్వాలు ఇచ్చిన హామీల మేరకు నోటిఫికేషన్‌లు పెంచాలి. తమకు మరిన్ని ప్రభుత్వ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తామని మాటిస్తున్నారు. అందుకే పెళ్లిళ్లు చేసుకోవడంలో ఆలస్యం అవుతుందనే అభిప్రాయాల్ని పీజీ, పీహెచ్‌డీ స్థాయి విద్యార్థులు వెలిబుచ్చుతున్నారు.

# ఆసుపత్రి నిర్మాణంలో ఇన్ని ఉల్లంఘనలా..?



**అధికారులను వివరణ కోరిన హైడ్రా కమిషనర్**

**హైదరాబాద్, మే 02 (జనంసాక్షి)**

ఒక భవనం నిర్మాణంలో ఇన్ని ఉల్లంఘనలా..? ఆసుపత్రి అంటే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సింది పోయి.. ఎక్కడికక్కడ నిబంధనలను ఉల్లంఘిస్తే ఎలా అంటూ హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని డాక్టర్ శంకర్స్ ఆసుపత్రి నిర్మాణంలో నిబంధనల ఉల్లఘనలు జరిగాయని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా.. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారులను ఆక్రమించి.. 4 అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతులు తీసుకుని... సెల్లార్‌తో పాటు.. 6 అంతస్తులను ఎలా నిర్మిస్తారని ఆసుపత్రి భవన యజమాని డా. శంకర్‌ని హైడ్రా కమిషనర్ ప్రశ్నించారు. అనుమతులన్నిటినీ పరిశీలించి.. చర్యలు తీసుకోవాలని అదికారులను ఆదేశించారు. ఒకవైపు 10 అడుగుల దారి.. మరోవైపు 15 అడుగుల దారి ఉన్నచోట ఇన్ని అంతస్తులు ఎలా నిర్మిస్తారని.. అందుకు అనుమతులు చూపించాలని భవన యజమా నిని కోరారు. నివాస ప్రాంతాల మధ్య ఇరుకు రహదారుల్లో దీనిని నిర్మించారని.. భవిష్యత్తులో ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని సంబంధిత అధికారులను అడిగారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండా ఆస్పత్రికి ఎలా లైసెన్స్ మంజూరు చేశారని అధికారులను నిలదీశారు. దీనిపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని జీహెచ్ ఎంసీ సికింద్రాబాద్ జోనల్ చీఫ్ ప్లానర్ శ్రీనివాస్‌ను కోరారు. హైడ్రా ఫైర్ విభాగం అడిషనల్ డైరెక్టర్ పాపయ్య గారు, డీఎఫ్‌వో యజ్ఞ నారాయణతో పాటు పలువురు హైడ్రా అధికారులు కమిషనర్ వెంట ఉన్నారు.

# రామగుండంలో పరిపాలన గాడి తప్పింది

**అధికార పార్టీ నేతలే అధికారులను బెదిరించడం విడ్డూరం**

**రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**



**గోదావరిఖని, జనంసాక్షి:**

రామగుండం లో పరిపాలన గాడి తప్పిందని, అధికార పార్టీ నేతలు ప్రభుత్వ అధికారులను బెదిరించడం విడ్డూరంగా ఉందని రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మళ్ళీ జాఫర్ జమానా కానవస్తుందనీ రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులే ప్రభుత్వ అధికారులను బెదిరింపులకు గురిచేస్తూ ఇక్కడి నుండి పంపించే ప్రయత్నం చేస్తున్నారని, మీడియాకు కూడా రక్షణ కరువైందని అన్నారు. ఇటివల అంతర్గం మండల తహసీల్దార్ మీద కాంగ్రెస్ నాయకుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి పంపించడం జరిగిందని, ఒక ప్రైవేట్ ఆసుపత్రి తనిఖీకి వచ్చిన డిఎంహెఓ అధికారిని కాంగ్రెస్ నాయకుడు బెదిరించడం సరైంది కాదన్నారు. గత 5 సంవత్సరాల కాలంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వైద్యులకు తాము అండగా నిలిచామని గుర్తు చేశారు. గతంలో పిల్లల వైద్యులు దాడి చేయించి ఇక్కడ నుండి వెళ్లగొట్టిన చరిత్ర ఉన్న రాజ్ ఠాకూర్, ఎమ్మెల్యే అయిన తర్వాత మెడికల్ హబ్ అంటూ, డాక్టర్లకు అండగా ఉంటానని మాట్లాడటం దయ్యాలు వేదాల వల్లించడంలా ఉందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఎర్పాటు జరిగిన తర్వాత కలుష్యానికి నిలయంగా ఉన్న రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సింగరేణి ద్వారా మెడికల్ కళాశాల ఏ ర్పాటు చేయుంచిన ఘనత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దన్నారు. ఈ మెడికల్ కళాశాల ద్వారా వెల మంది పెదలు నిత్యం ఉచితంగా వైద్యం పోందుతున్నరని అన్నారు. ఇప్పటికైన రామగుండం ఎమ్మెల్యే పాలనపై దృష్టి సారించాలని, అధికారులను బెదిరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రామగుండం మాజీ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు,నాయకులు, మాజీ కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, గాధం విజయ, నడిపెల్లి మురళీధర్ రావు, ముద్దసాని సంధ్యారెడ్డి రెడ్డి,నూతి తిరుపతి, పిల్లి రమేష్ జక్కుల తిరుపతి, సట్టు శ్రీనివాస్ ఇరుగురాళ్ల శ్రావన్ గుర్రం పద్మ, రత్నాకర్, కిరణ్ జీ, నీరటి శ్రీనివాస్,దొమ్మేటి వాసు కర్రీ ఓదేలు అవునూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల పరిహారం ఇప్పించండి

**ఎమ్మెల్సీ కవితను కోరిన మాజీ జెడ్పిటిసి**

**గాంధారి, మే 02 (జనం సాక్షి)**



: కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం లింగంపల్లి, ధర్మారావుపేట్, అమర్లబండ గ్రామాల రైతుల భూములు కాలేశ్వరం ప్రాజెక్టు కాలువలు నిర్మాణంలో కోల్పోయారని వారికి నష్టపరిహారం రాలేదని వెంటనే వాటికి సంబంధించిన నిధులను విడుదలయ్యే విధంగా ప్రయత్నించాలని మాజీ జెడ్పిటిసి పదివేల రాజేశ్వరరావు ఎమ్మెల్సీ కవితను కోరారు. ఈ విషయంలో సంబంధిత మంత్రి మరియు అధికారులతో మాట్లాడాలని ఎమ్మెల్సీ కవితను శుక్రవారం హైదరాబాదులోని ఆమె నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఎంతోమంది అట్టడుగు వర్గాల పేద రైతుల భూములు కాలువలు నిర్మాణంలో కోల్పోయినప్పటికీ,చాలా రోజులుగా నష్టపరిహారం రాలేదని అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం దక్కడం లేదన్నారు. దీంతో ఎలాగైనా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ కవిత కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, తాను స్వయంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నష్టపరిహారానికి సంబంధించి డబ్బులు విడుదలయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. అంతే కాకుండా 22వ ప్యాకేజీ లో యాచారం వద్దనిర్మించే సబ్ స్టేషన్ భూగర్భ కాలువల నిర్మాణం నిధులు లేక నిలిచిపోయిందని, నిధులు విడుదల అయ్యే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు ఎమ్మెల్సీ కవితకు విజ్ఞప్తి చేశారు. ఎలాగైనా సరే విధానమండలి సభ్యురాలుగా వచ్చే సమావేశంలోనైనా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు మంజూరు అయ్యేవిధంగా ప్రయత్నించాలన్నారు. దీని ద్వారా కామారెడ్డి ,ఎల్లారెడ్డి మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అంది శాశ్వతంగా కరువు దూరమవుతుందన్నారు. దీని కోసం ప్రయత్నిస్తే ఎల్లకాలం రైతు హృదయాల్లో నిలిచిపోతారని ఆమె దృష్టికి తెచ్చారు. ఎన్నో ఏళ్లుగా 22వ ప్యాకేజీలో పనులు ప్రారంభించినప్పటికీ మందకోడిగా జరుగుతున్నాయని, పనులు చేపట్టే ఏజెన్సీ నిలదీస్తే తమకు బిల్లు లేక పనులు చేయలేకపోతున్నామని సమాధానం ఇస్తున్నారన్నారు. ఎలాగైనా సరే 22 ప్యాకేజ్ లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అలాగే ప్యాకేజీ పనులు ప్రారంభం కావడానికి దశలవారీగా నిధులు కేటాయించే విధంగా ప్రయత్నించాలని ఎమ్మెల్సీ కోరారు. మాజీ జెడ్పిటిసి వెంట ధర్మరావుపేట సురేష్, సాయిలు, ఎల్లయ్య తదితరులున్నారు.

# అకాల వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం

**ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న రైతులు**

**మహదేవపూర్ :మే 2( జనంసాక్షి)**

మండలంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు భారీగా వరద చేరి నీరు చేరి ధాన్యము తడిసి ముద్దయింది. ఆరుగాలం చేసిన పంట చేతికిందేముందే నీటి పాలు కావడంతో రైతులు కంటతడి పెట్టుకున్నారు. గురువారం రాత్రి ఉరుముల మెరుపులతో గాలి వాన భీభత్సముతో సుమారు దాదాపు నాలుగు గంటల పాటు ఈదురు గాలితో కూడిన భారీ వర్షం కురియడంతో మండలం లోని పలు గ్రామాలలో వరి ధాన్యం తడిసింది. ఈదురు గాలులతో వృక్షాలు నేలకొరిగాయి. కరెంటు స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ అంతరాయం జరిగింది.



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో భారీ వర్ద నీరు చేరడంతో ధాన్యం తడిసి నీటిలో మునిగాయి.

దీనితో రైతులు ఆందోళన చెందు తున్నారు. చేతికిం దిన పంట నీటి పాలు కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .నష్టంపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

# 4న నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

**వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**

**వరంగల్ ప్రతినిధి , మే 2 (జనంసాక్షి):**



ఈనెల 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్షకు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. పోలీస్, విద్య, ఆర్టీసీ, విద్యుత్, వైద్య ఆరోగ్య, పోస్టల్, తదితర శాఖల అధికారులు ఆయా శాఖల ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహణ, చేయనున్న ఏర్పాట్లు, భద్రత, తదితర అంశాలను గురించి కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీన జరిగే నీట్ పరీక్ష జిల్లాలో జవహర్ నవోదయ మామూనూరు ఒక పరీక్షా కేంద్రంను కేటాయించడం జరిగిందని, పరీక్షను 240 మంది అభ్యర్థులు రాయనున్నారని అన్నారు. పరీక్షా కేంద్రాలలోనికి ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1:30 అనుమతిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు. 1:30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారని, ఆ తరువాత పరీక్ష కేంద్రాలలోనికి అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరని పేర్కొన్నారు. ఈ పరీక్ష 4వ తేదీన (ఆదివారం)మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 5:00గంటల వరకూ జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను, బయోమెట్రిక్ హాజరు, పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేయాలన్నారు.

నీట్ పరీక్ష నిర్వహణలో జిల్లాలో ఎక్కడ కూడా ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకొంటున్నట్లు. పరీక్ష రాసే అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తమ వెంట తీసుకురావద్దన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో లేటెస్ట్ పాస్పోర్ట్ సైజ్ ఫోటో ఉండాలని, అదనంగా మరొక ఫోటోను వెంట తెచ్చుకోవాలన్నారు. అదేవిధంగా అభ్యర్థులు లేటెస్ట్ ఫోటో ఉన్న ఐడి ప్రూఫ్ లను తెచ్చుకోవాలని కలెక్టర్ కోరారు.

# స్థానిక అవసరాలకు ఇసుక అనుమతులు ఇవ్వాలి

**తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన**

**తెలిపిన బిఆర్ఎస్ నాయకులు**

**తంగళ్ళపల్లి, మే 02 (జనంసాక్షి)**



స్థానిక అవసరాల నిమిత్తం మానేరు నది నుండి ఇసుక అనుమతులు ఇవ్వాలని అలాగే పెంచిన వే బిల్లును తగ్గించాలని తంగళ్ళపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య, మాజీ ఎంపీపీ పడగల మానస మాట్లాడుతూ గత కొంతకాలంగా తంగళ్ళపల్లి మండల ప్రజలకు స్థానిక గృహ నిర్మాణాల అవసరాలకు ఇసుక సరఫరా లేక గృహ నిర్మాణ దారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తంగళ్ళపల్లి మండల వాసులకు సిరిసిల్లలోని సాయి నగర్ నుండి ఇసుక అనుమతులు ఇవ్వడం వలన తక్కువ ధరలకు దొరికే ఇసుక మూడింతల అధిక ధరలకు వెచ్చించి కొనుక్కోవలసిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ఇలా చేయడం వలన గృహ నిర్మాణాలు మండల వ్యాప్తంగా ఎక్కడికక్కడే నిలిచిపోయాయని దీనివలన భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన కార్మికులు రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. అలాగే 180 రూపాయలు ఉన్న వే బిల్లు డిడి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అమాంతం 480 పెంచడం జరిగిందని అన్నారు. గృహ అవసరాల నిమిత్తం ఉచిత ఇసుక సరఫరా చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి హామీ ఏమైందని ప్రశ్నించారు. అలాగే తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని మానేరు నది నుండి ఇసుక అనుమతులు ఇస్తూ వారానికి రెండు సార్లు వేబిల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు వేణుగోపాలరావు, బండి దేవదాస్,మాట్ల మధు, వెంకటరమణారెడ్డి, జగన్,కందుకూరి రామ గౌడ్, జగత్, లింగం, కొమురయ్య, నవీన్ రెడ్డి, పవన్ రెడ్డి, కిష్టారెడ్డి, బాబు, అనిల్ గౌడ్, రమేష్, లక్ష్మణ్, అమర్ రావు, చందన్ రావు రాజు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

**తెలంగాణ సర్కారు కులగణన దేశానికి రోల్‌మోడల్**

**డిసిసి అధ్యక్షులు కే.శ్రీహరి రావు**

**నిర్మల్ రూరల్, మే 2 (జనం సాక్షి)**



: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని నిర్ణయించడం హర్షనీయమని నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు కే.శ్రీహరి రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్ హోటల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, కాంగ్రెస్ పార్టీ విజయంగా అభివర్ణిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన కుల గణన దేశవ్యాప్తంగా చేయాలని నిర్ణయం తీసుకోవడం హర్షిం చదగ్గ విషయమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, నాయకులు సాదా సుదర్శన్ పాల్గొన్నారు




# బొగ్గు గనుల అమ్మకానికి వ్యతిరేకంగా.. మే 20న సార్వత్రిక సమ్మె

**ఐఎఫ్ టీ యు జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్**

**గోదావరిఖని, జనంసాక్షి:**

మోడీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా బొగ్గు గనులను అమ్మకానికి పెట్టిందని బొగ్గు పరిశ్రమను సజీవంగా సమాధి చేస్తుందని సింగరేణిలో కొత్తబావులకు అనుమతించకుండా కట్టడి చేస్తున్నదని, బొగ్గుకు రేటును పెంచుకోకుండా అడ్డుపడుతుందని ప్రవేటుఆధానిలబొగ్గును. అధిక ధరకు కొనుగోలు చేస్తున్నదని అంబానీ,ఆదాని లాంటి మోడీ మిత్రులకు దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమలు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నదని ఇందులో భాగంగానే 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడుల ను తీసుకు వచ్చిందని బొగ్గు పరిశ్రమరక్షణకోసంసింగరేణిబొగ్గు గనులను కాపాడుకునేందుకు మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో సింగరేణి గని కార్మికులు పాల్గొనాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ 10 కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా పరిశ్రమల రక్షణకోసం,ఉద్యోగ భద్రతకోసం,అసంఘటిత రంగ కార్మికులకు నెలకు 26వేల రూపాయల వేతనం చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పుప్రకారం సమాన పనికి సమానవేతనాలు అమలు

చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న జరుగు సార్వత్రిక సమ్మెకు లో సింగరేణి కార్మికులు పాల్గొన విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమ్మె పిలుపులో ఐఎఫ్టియు భాగస్వామిగా ఉందని మే 20న సార్వత్రిక సమ్మెలో పాల్గొనాల్సిన తప్పనిసరి అవసరం సింగరేణి కార్మికులకు ఉందని ఆయన గుర్తు చేశారు.సార్వత్రిక సమ్మెలో పిలుపులో ఏఐటియుసి, ఐఎన్టీయూసీలు భాగస్వాములుగా ఉన్నందున సింగరేణిగని కార్మికుల ను భాగస్వాములను చేసేందుకు సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి,ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీలు ముందుకు రావాలని అన్నికార్మిక సంఘాలను కలుపుకొని సమ్మెను విజయవంతం చేసేందుకు పూనుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశ%శీ%లో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.కృష్ణ,ప్రధాన కార్యదర్శి జే.సీతారామయ్య,ఈ నరేష్, బి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథకాలలో రాజీపడే ప్రసక్తే లేదు

• రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భూదాన్ పోచంపల్లి, మే 2 (జనం సాక్షి) :** రాష్ట్రంలో చేనేత, వ్యవసాయ రంగాల అభివృద్ధికి రాజీ లేకుండా కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పట్టణ కేంద్రంలో పద్మశాలి సభా వేదిక వద్ద ఏర్పాటుచేసిన చేనేత సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయం, వినేత రంగాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. రైతన్నకు మాదిరిగా చేనేతలకు కూడా రుణమాఫీకి విధి విధానాలు క రారయ్యాయని త్వరలోనే అమలు చేస్తామన్నారు. చేనేత పట్టుచీరలకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి లోనే ఇండియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. చేనేత సమస్యలపై క్యాబినెట్లో చర్చించి పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రం అప్పుల పాలయిందని విమర్శించారు. ప్రతి నెల రూ. 6500 కోట్ల వడ్డీ చెల్లించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఎన్ని అప్పులు ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామన్నారు. మండలంలో సాంకేతిక సమస్య వల్ల రైతు భరోసా ఉందా లేదని అర్హులైన వారందరికీ త్వరలోనే ఖాతాలోకి జమ అయ్యేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో థ్రిఫ్ట్ పథకాన్ని చేనేత కార్మికుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేనేత భద్రత కింద ఈ సంవత్సరం రూ 10 కోట్లు లబ్ధిదారులకు అందించడం జరిగింది అన్నారు. చేనేత భరోసా తెలంగాణ లేబుల్ తీసుకొస్తున్నాం, వస్త్రం మీద లేబుల్ వేయించుకోవడంతో వస్త్రానికి బ్రాండ్‌తో పాటు నకిలీలను అరికట్టే అవకాశం ఉందంటున్నారు. అలాగే చేనేత భరోసా పథకం కింద చేనేత కార్మికుడికి రూ 18 వేలు అనుబంధ కార్మికుడికి రూ. 6వేలు అందించేలా కృషి చేస్తామన్నారు. రెండు నెలలు చేనేత రుణమాఫీ ప్రక్రియ పూర్తిస్థాయిలో చేపడతామన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చేనేత సాంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఉన్న తాను చేనేతలకు నిధుల కోసం ఇక్కత్ నకిలీలను అరికట్టేలా పటిష్ట చర్యల కోసం పార్లమెంటులో ప్రసావిస్తానని తెలిపారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే నేతన్నకు మేలు జరిగిందన్నారు. చేనేత పొదుపు పథకం కింద రాష్ట్రం రూ270 కోట్లు మంజూరు చేస్తే అందులో యాదాద్రి భువనగిరి జిల్లాకి రూ 90 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. పోచంపల్లిలో ఐఐహెచ్ టీని ఏర్పాటు చేయాలన్నారు. చేనేతలకు ఇబ్బందులు కలగకుండా యారన్ డిపోను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, చేనేత జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, ఇందుమతి, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, జిల్లా ఏడి శ్రీనివాసరావు, ఆర్డీవో చంద్రశేఖర్ రెడ్డి, ఇన్చార్జి తహసిల్దార్ నాగేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తడక వెంకటేశం, పాక మల్లేశం, భారత లవ కుమార్, గుజ్జ సత్యం, గర్దాసు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసును చేధించిన పోలీసులు

• బంగారు వస్తువులు, సెల్‌ఫోన్ స్వాధీనం




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 2 (జనం సాక్షి) :** ఏప్రిల్ 30 న రాత్రి సమయములో కామారెడ్డి జిల్లా దేవుని పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సన్నపల్లి గ్రామంలో ఒక వివాహిత ఆమె వ్యవసాయభూమిలో అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉన్నదని మే 01 న ఉదయం 0600 గంటలకు సమాచారం రాగా అట్టి విషయమై దేవునిపల్లి పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనైనది. మృతురాలు చిదుర కవిత భర్త గంగారెడ్డి వయసు 44 సంవత్సరాలిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చంపినారని ఇట్టి కేసులో జిల్లా ఎస్పీ ఆదేశానుసారం, ఏ ఎస్ పి కామారెడ్డి పర్యవేక్షణలో ఒక బృందం ఏర్పాటు చేసుకొని సీసీటీవీ కెమెరాల ద్వారా మరియు సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో మరియు పాత నేరస్తుడు ఐన మహేష్ పైన అనుమానం కలిగి అతనిని పట్టుకొని అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరు పరచడం జరుగుతుందని పి రాజేష్ చంద్ర తెలిపారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడైన మహేష్ ఇదివరకే భిక్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మర్డర్ కేసు నమోదు కాగా అట్టి కేసు విషయములో బెయిలు కొరకై మృతురాలి చిదుర కవిత వద్ద 1,00,000/- రూపాయలు అప్పు తీసుకోగా అట్టి డబ్బులు చెల్లించమని మృతురాలు కవిత అడుగుతుండగా మృతురాలిని చంపేస్తే అట్టి డబ్బులు కట్టవలసిన అవసరం ఉండదని ఆమె హత్యకు పథకం వేసుకున్నాడు. ఏప్రిల్ 30 నాడు మృతురాలికి అప్పుగా తీసుకున్న డబ్బులు చెల్లిస్తానని చెప్పి ఆమె వ్యవసాయ భూమి వద్దకు రావాలని నమ్మించగ మృతురాలు కవిత వ్యవసాయ భూమి వద్దకు రాగానే అతని పథకం ప్రకారం మృతురాలి ముక్కుపై బలంగా గుద్దగ క్రింద పడిపోగానే ఆమె చీర కొంగుతో ఉరి పెట్టి ఊపిరి ఆడకుండా చేసి ఆమెని చంపి ఆమె పై ఉన్న బంగారు కమ్మలు, మాటిలు, వంక ఉంగరం మరియు ఆమె మొబైల్ ఫోన్ దొంగిలించి ఎవరికి అనుమానం రాకుండా అక్కడి నుండి పారిపోయినాడని తెలిపారు. నిందితుడి వివరములు ఇలా ఉన్నాయి జంగంపల్లి మహేష్ తండ్రి నర్సింలు, వయస్సు:27 సం.రాలు., కులం:ముదిరాజ్, వృత్తి: డ్రైవర్,చింతమాన్ పల్లి గ్రామం, దోమకొండ మండలం, కామారెడ్డి జిల్లా. స్వాధీనం చేసుకున్న వాటి వివరాలు ఒక జత బంగారు కమ్మలు ఒక జత బంగారు మాటిలు, ఒక బంగారు వంకు ఉంగరం ఒక మొబైల్ ఫోన్ ఇట్టి కేసు దర్యాప్తులో పాల్గొని మర్డర్ కేసుని 48 గంటలలోపు చేధించిన కామారెడ్డి రూరల్ సీ.ఐ.యస్.రామన్, దేవునిపల్లి ఎస్సై జి.రాజు, క్రైమ్ టీం సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించడం జరిగింది.

## కోకాపేట మూవీ టవర్స్‌లో ఏసీబీ రైడ్స్

**రాజేంద్రనగర్, మే 2 (జనం సాక్షి) :** కోకపెట్ మూవీ టవర్‌లో కాజా మొహీనుద్దీన్ ఇంట్లో గురువారం అర్ధరాత్రి ఏసీబీ రైడ్స్ జరిగాయి. గత ప్రభుత్వం లో గొర్రెల పంపిణీ లో కీలక పాత్ర పోషించిన శాఖ అధికారి ఖాజా మోహినుద్దీన్ ఇంట్లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. గత కొన్ని రోజుల క్రితం దుబాయ్ పారిపోయి తిరిగి వచ్చాడని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో అధికారులు ఆయన ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## మురుగునీటి సమస్య పరిష్కరించాలని ఫార్చ్యూన్ ఏవెన్యూ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు వినతి



**అల్వాల్, మే 2 (జనంసాక్షి) :** మచ్చ బొల్లారంలోని డివిజన్‌లోని ఫార్చ్యూన్ ఏ వెన్యూ కాలనీ వాసులు మురుగు నీటి సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పై భాగాల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. కాలనీ వాసులు తమ ఇళ్ల నుంచి బయటపడలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాలనీ ప్రజలు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ని కలిసి సమస్యను వివరించారు. పైన ఉన్న కాలనీల డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల మురుగు నీరు ఏరుల్లా పారుతుందని, అవుట్‌లెట్ లేకపోవడం వల్ల వారి కాలనీ చెరువుగా మారిందని విన్నవించారు. ఈ అంశంపై స్పందించిన ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు, జలమండలి అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని, సమస్య పరిష్కారానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సి చిన్నారెడ్డి, ఈఈ శ్రీ క్రాంతి, జలమండలి జీఎమ్ సునీల్, డీజీఎం రాజు, ఏఎంహెచ్వో రజిని, డిఇ రఘు, ఎలక్ట్రికల్ ఏఈ లక్ష్మీబాయి, ఎస్ఎస్ ప్రభాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు. కాలనీ నుంచి సోమాజీ వినోద్ గౌడ్, పిట్ల శ్రీనివాస్, గౌతమ్, రాయి రమణరావు, సీతారామరాజు, అంతోని, నాయకులు డోలి రమేష్, లక్ష్మణ్ యాదవ్, మల్లేశ్ యాదవ్, ఢిల్లీ పరమేష్, ప్రశాంత్ రెడ్డి, సందీప్, సతీష్, ముఖేష్, బాల్రాజ్ తదితరులు హాజరయ్యారు.

## క్షుద్ర పూజలు కావు శాంతి పూజలు

• క్షుద్ర పూజల పుకార్లు ఆవాస్తవం
• మీడియా సమావేశంలో డిఎస్పీ సత్తయ్య గౌడ్



**సదాశివపేట, మే 2 (జనం సాక్షి) :** సదాశివపేటలో క్షుద్ర పూజలు జరగాయంటూ సోషల్ మీడియాలో, పలు ఛానల్లో వస్తున్న వదంతులు అవాస్తవమని అలాంటి పుకార్లు నమ్మవద్దని సంగారెడ్డి డిఎస్పి సత్తయ్య గౌడ్ తెలిపారు. శుక్రవారం సదాశివపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ మహేష్ గౌడ్ అధ్యక్షతన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి సోషల్ మీడియా, పలు ఛానల్లో, పేపర్లో సదాశివపేటలో క్షుద్ర పూజలు జరిగినట్టు వస్తున్న వదంతులను నమ్మవద్దని, తప్పుడు వార్తలు సమాజంలోకి వెళ్లడం వల్ల కొంతమంది ఇబ్బందులు పడడం జరుగుతుందన్నారు. ఇలాంటి వార్తలు ప్రచురించే ముందు సంబంధించిన అధికారులతో సంప్రదించి వార్తలు ప్రచురించాలని కోరారు. వివరాల్లోకి వెళ్తే సదాశివపేట పట్టణంలో సూర్య నర్సింగ్ హోమ్ వెనకాల బీరువాల కారా?నా యజమాని ధర్మేందర్ గత రెండు మూడు నెలల నుంచి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని, తాను స్వామీజీని సంప్రదించి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అని తెలుపగా శాంతి పూజ, లక్ష్మీ పూజ నిర్వహిస్తే ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పడంతో గత నెల 29వ తేదీ మంగళవారం నాడు పూజలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఇదే విషమై తన మిత్రుడు బక్కరి ప్రభు తెలుపగా తన ఆర్థిక పరిస్థితి కూడా సరిగ్గా లేదని తాను కూడా పూజలో పాల్గొంటే ఆర్థిక ఇబ్బందులు తొలిగిపోతాయని పూజలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. టీవీలలో, పేపర్ లో వస్తున్న వార్తలు పూర్తి అవాస్తమని అన్నారు. సంఘటనా స్థలంలో నిజంగానే క్షుద్ర పూజలు జరిగి ఉంటే చట్టరీత్యా చర్యలు తీసుకునే వాళ్ళమని డిఎస్పీ తెలిపారు. ఘటన స్థలం చుట్టుపక్కల వారిని విచారించగా వారు కూడా అక్కడ అలాంటి పూజలు జరగలేదని అన్నారని తెలిపారు.

## ఘనంగా పీపుల్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వార్షికోత్సవ వేడుకలు



**యాచారం, మే 2 (జనం సాక్షి) :** మాల్ పీపుల్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యాచారం సీఐ నందిశ్వర్ రెడ్డి, ఎస్సై మధు , చింతపల్లి ఎస్సై యాదయ్య , మర్రిగూడెం ఎస్సై క్రిష్ణా రెడ్డి, మాల్ సెక్రటరీ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాల్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో గానో సేవలను అందిస్తూ, ఇలాగే ముందుకు సాగాలని కొనియాడారు. ఇలాగే సేవలను అందిస్తూ ముందు సాగుతుండాలి చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులను హాస్పిటల్ మెనేజింగ్ డైరెక్టర్స్ భాస్కర్, వినోద్‌లు ఘనంగా సత్కరించారు.

## బాల్య వివాహం చేసిన తల్లిదండ్రులపై కేసు నమోదు చేసిన ఎస్ఐ




**వీపనగండ్ల, మే 2 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన అబ్బాయికి (వరుడు) కల్వకోలు గ్రామానికి చెందిన అమ్మాయితో (మైనర్) వివాహం ఏప్రిల్ 30వ తేదీన జరగగా విషయం తెలుసుకున్న ఎస్సై రాణి బాల్య వివాహం నిర్వహించిన తల్లిదండ్రుల పైన, వరుడు మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరం కావున కేసు నమోదు చేశామని తెలిపారు. తల్లిదండ్రులు 18 సంవత్సరాల నిండిన ఆడపిల్లలకు చట్టబద్ధంగా వివాహం చేయచ్చని బాల్యవివాహాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## పోచంపల్లి అర్బన్ బ్యాంక్ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి




**భూదాన్ పోచంపల్లి, మే 2 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం సహకార బ్యాంకుల వ్యవస్థ పటిష్టత కొరకు పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రోజున వ్యవసాయ, సహకార చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ కేంద్ర కార్యాలయాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ అధ్యక్షతన వహించగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని జిల్లాలకు బ్యాంకు సేవలు విస్తరించాలని కోరారు. బ్యాంకు ఎంపీఏ జీరో పర్సెంట్ ని చూసి బ్యాంకు యొక్క ప్రతిష్టను అర్థం చేసుకోవచ్చని తెలిపారు. బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, సీఈఓ సీత శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంక్ సాధించిన ప్రగతి అందిస్తున్న సేవలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆర్డిఓ శేఖర్ రెడ్డి, శైలజ రామయ్య కమిషన్ హ్యాండ్లూమ్ ఫర్ టెక్స్టైల్స్, మదన గోపాలస్వామి తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. ఎ. ఎఫ్. సి.యు.బి డైరెక్టర్, బ్యాంక్ వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్స్ కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలే హరిశంకర్, సురపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్ల స్వామి, బిట్టు భాస్కర్, మక్తల్ నరసింహ, వివిధ శాఖల మేనేజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాస్ దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ

• ఐటీడీఏ పిఓ రాహుల్




**బూర్గంపహాడ్, మే 2 (జనంసాక్షి) :** రాజీవ్ యువ వికాసం పథకం కొరకు నిరుద్యోగులైన గిరిజన యువతి యువకులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారి జాబితా పగడబందీగా రూపొందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. బూర్గంపహాడ్ మండలం వేపలగడ్డ, నకిరేపేట గ్రామాలలోని గ్రామ పంచాయతీలలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలనను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జాబితా రూపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా గిరిజన నిరుద్యోగుల దరఖాస్తులను చాలా క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి తప్పనిసరిగా రుణాలు అందే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఎంపీడీవోలు, బ్యాంకు మేనేజర్లు కమిటీ సభ్యులు ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారి జాబితా రూపొందించాలన్నారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా జరగాలని, అనంతరం జిల్లా స్థాయి కమిటీకి జాబితలు అందించాలని ఆదేశించారు. బ్యాంకర్లు సమన్వయంతో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పుస్తకం, సదరం సర్టిఫికెట్, ఇతర ధృవీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. జనాభా ప్రాతిపదిక కలిగిన యూనిట్ల కేటాయింపు ఉంటుందని, ఓకే గ్రామంలో ఒక యూనిట్ కు ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకుంటే వాటిని పరిశీలించాలని, వ్యవసాయ సంబంధిత యూనిట్ల స్థాపనకు ప్రజలకు అవగాహన కల్పించాలని, చేపల పెంపకం యూనిట్లను ఈ పథకం ద్వారా స్థాపించడం ద్వారా వారి ఆర్థిక పురోగతి ఉంటుందని ఆయన అన్నారు. అదేవిధంగా పాడి పరిశ్రమలు స్థాపనకు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జములా రెడ్డి, ఎస్ ఓ భాస్కర్, స్పెషల్ ఆఫీసర్ అశోక్ కుమార్, ఎంపీఓ బాలయ్య, వేపల గడ్డ పంచాయతీ బిందు, నకిరిపేట పంచాయతీ సెక్రెటరీ రుక్మిణి అధికారులు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ



**కాప్రా, మే 2 (జనంసాక్షి) :** అణగారిన వర్గాల అభ్యున్నతికి, చదువుకోసం పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్తలు ఆ మహనీయుడు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లూరి అంజయ్య అన్నారు. . చుక్కాపురం నర్సింగ్ రావు, చినింగని ఆనంద్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం కుషాయిగూడ డిపో ఎదుట బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, కుషాయిగూడ డిపో మేనేజర్ మహేష్ కుమార్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజన్న పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఈ అవకాశాన్ని కల్పించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లూరి అంజన్న మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కాలంలో కుషాయిగూడ డిపో కార్మికులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మహనీయుల విగ్రహాల ద్వారా వారి ఆశయాలను గుర్తుచేసుకోవడం స్ఫూర్తిదాయకమని తెలిపారు. రాజ్యాధికారానికి బహుజనులు ఐక్యంగా పోరాడే సమయం ఆసన్నమైంది అని ఆయన వ్యాఖ్యానించారు. డా.బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాల తర్వాత ఇప్పుడు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం శ్రమించిన బాబు జగ్జీవన్ రామ్ సేవలను గుర్తు చేశారు. మహనీయులు మరణించరు. వారు తమ ఆశయాలతో మన మధ్యనే ఉన్నారు. వారి స్ఫూర్తితో పనిచేయాలి అని ప్రీతం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ స్టేట్ ప్రెసిడెంట్ వల్లూరి బాబు, స్టేట్ జనరల్ సెక్రటరీ దుబ్బాక యాదయ్య, డిపో ప్రెసిడెంట్ చక్రం మోహన్, సెక్రటరీ పందరి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కౌశల్య, బి. నర్సింగరావు, చుక్కాపురం దాసుజంగయ్య, ఆనంద్, సత్యనారాయణ, సుగుణాకర్, రామకృష్ణ, లీలా రావు, తిరుపతి, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





## రెండేళ్లయినా రూ.6వేల కోట్లకు పైగా రూ.2వేల నోట్లు చలామణీలోనే..

ముంబయి: పెద్ద నోట్లు రద్దు తర్వాత తీసుకొచ్చిన రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుని దాదాపు రెండేళ్లవుతున్నా.. రూ.6266 కోట్ల విలువైన నోట్లు ఇంకా చలామణీలో ఉన్నాయి.ఇప్పటి వరకు 98.24 శాతం నోట్లు వెనక్కి వచ్చాయని.. మిగిలినవి ఇంకా రావాల్సి ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. నోట్లను వెనక్కి తీసుకున్నప్పటికీ.. అవి లీగల్ టెండర్ (చెల్లుబాటు)గా కొనసాగుతాయని తెలిపింది. ఈ పోస్టల్ స్కీమ్స్‌కు ఆధార్‌తో ఈకేవైసీ.. పేపర్ వర్క్ అవసరం లేదిక!023 మే 19 చలామణీలో ఉన్న రూ.2 వేల నోట్లను ఆర్‌బీఐ వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ప్రకటించే నాటికి రూ.3.56 లక్షల కోట్లు విలువైన నోట్లు చలామణీలో ఉన్నాయి. నోట్ల ఉపసంహరణ తర్వాత 2023 అక్టోబర్ 7 వరకు బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు పౌరులకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది.

## శామ్ ఆల్ట్‌మన్, సత్య నాదెళ్ల జీబ్లీ ఫొటో ఇదే!

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఏఐ సృష్టించిన జీబ్లీ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఓపెన్ ఏఐ సంస్థ ఇటీవల చాట్‌జీపీటీలో జీబ్లీ స్టూడియోను ప్రవేశపెట్టినప్పటినుంచి ఈ సదుపాయాన్ని నెటిజన్లు తెగ వినియోగిస్తున్నారు. తాజాగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో ఉన్న జీబ్లీ వెర్షన్‌ను ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్టమన్ పోస్టు చేశారు. కొత్త ఆఫీస్‌ను నాదెళ్లకు చూపించానని, తమ



పనుల గురించి మాట్లాడుకోవడం సంతోషంగా అనిపించిందని ఆల్టమన్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. "నిన్ను కలుసుకోవడం బాగుంది. కొత్త ఆఫీస్ నచ్చింది" అని మైక్రోసాఫ్ట్ సీఈఓ దానికి బదులిచ్చారు. ఇప్పుడు వీరి ఫొటో నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. మీ ఇద్దరిని ఇలా చూడటం బాగుందని నెటిజన్లు కామెంట్లు పెట్టారు. జపాన్ కార్టూన్ల శైలిలో ఉండే జీబ్లీ ఫొటోలు విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. చాట్‌జీపీటీకి చెందిన కొత్త ఇమేజ్ జనరేటర్ ఇతర ఎఫెక్ట్‌లో భాగంగా స్టూడియో జీబ్లీ స్టైల్‌ను పరిచయం చేసింది. ఎక్స్‌ఏఐకి చెందిన గ్రాక్ చాట్‌బాట్‌లోను వీటిని సృష్టించుకోవచ్చు .ఇదిలా ఉంటే.. ఈ సందడిలో వ్యక్తిగత సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తం అవుతోందని మాత్రం మరిచిపోతున్నారు. ఇప్పటివరకూ చాట్‌బాట్‌లకు అందకుండా గోప్యంగా ఉన్న మన ఫొటోలు, వివరాలు ఈ జీబ్లీ ట్రెండ్‌తో ఆ సంస్థలకు చేరుతున్నాయి. వ్యక్తిగత వివరాలకు ఇబ్బంది ఏర్పడదని రూఢీ చేసుకున్నాకే ట్రెండ్‌లను అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## లాభాల్లో సెన్సెక్స్..

• ఫ్లాట్‌గా ముగిసిన నిఫ్టీ

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నేడు ఒడుదొడుకులు ఎదుర్కొన్నాయి. ఆరంభంలో భారీ లాభాల్లో దూసుకెళ్లిన సూచీలు.. ఇంట్రాడేలో ఆ లాభాలను కోల్పోయాయి.ముఖ్యంగా మెటల్, ఫార్మా షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ ఓ మోస్తరు లాభాల్లో ముగియగా.. నిఫ్టీ 24,300 ఎగువన ఫ్లాట్‌గా స్థిరపడింది.సెన్సెక్స్ ఉదయం 80,300.19 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,242.24) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో దాదాపు 900 పాయింట్లకు పైగా లాభపడి 81,177.93 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 259.75 పాయింట్ల లాభంతో 80,501.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 12.50 పాయింట్ల లాభంతో 24,346.70 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.50గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, ఇండస్ ఇండ్ బ్యాంక్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. నెస్లే ఇండియా, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టైటాన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3270 డాలర్ల వద్ద కొనసాగుతోంది.






## వేదాంతా లాభం హైజంప్

డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 154 శాతం దూసుకెళ్లి రూ.3,483 కోట్లను తాకింది. ఉత్పత్తి వ్యయాలు తగ్గడం, అమ్మకాల పరిమాణం పుంజుకోవడం ఇందుకు సహకరించాయి. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 1,369 కోట్లు ఆర్జించింది.మొత్తం ఆదాయం సైతం రూ. 36,093 కోట్ల నుంచి రూ. 41,216 కోట్లకు జంప్ చేసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి వేదాంతా నికర లాభం భారీ వృద్ధితో రూ. 14,988 కోట్లకు చేరింది. 2023-24లో కేవలం రూ. 4,239 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,46,988 కోట్ల నుంచి రూ. 1,56,643 కోట్లకు ఎగసింది.2025 మార్చి 31 కల్లా స్థూల రుణ భారం రూ. 73,853 కోట్లుగా నమోదైంది. మరోసారి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అరుణ్ మిశ్రాను బోర్డు ఎంపిక చేసినట్లు వేదాంతా పేర్కొంది. వివిధ బిజినెస్‌లను ప్రత్యేక కంపెనీలుగా విడదీసే ప్రణాళికలను సెప్టెంబర్ చివరికల్లా పూర్తిచేయనున్నట్లు వేదాంతా సీఎఫ్‌వో అజయ్ గోయెల్ తాజాగా వెల్లడించారు.




## 'అలెంబిక్'కు యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదం

గుండెపోటు, స్ట్రోక్ నివారణకు జనరిక్ ఔషధాన్ని మార్కెట్ చేయడానికి యూఎస్ హెల్త్ రెగ్యులేటర్ నుంచి ఆమోదం లభించిందని అలెంబిక్ ఫార్మా ఈ శుక్రవారం తెలిపింది.టికాగ్రెలర్ టాబ్లెట్లు..90ఎంజీ 60 ఎంజీ కొత్త ఔషధ అప్లికేషన్ కోసం కంపెనీ ఫుడ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ నుంచి తుది ఆమోదం పొందిందని అలెంబిక్ ఫార్మా ఒక ప్రకటనలో తెలిపింది. కంపెనీ ఆమోదించిన ఆస్ట్రాజెన్కా ఫార్మాకు సంబంధించిన బ్రిలింటా టాబ్లెట్లు 60 %ఎగ్జ, 90 ఎగ్జ%లకు చికిత్సాపరంగా సమానం అని అలెంబిక్ ఫార్మా పేర్కొంది. టికాగ్రెలర్ మాత్రలు తీవ్రమైన కరోనరీ సిండ్రోమ్ ఉన్న రోగులలో కార్డియోవాస్కులర్ మరణం, మయోకార్డియల్ ఇన్ఫార క్షన్ స్ట్రోక్ నుంచి ప్రమాదాన్ని తగ్గించడానికి సూచించబడు తుంటాయి. ప్రకారం, 2025, మార్చితో ముగిసిన పన్నెండు నెలలకు టికాగ్రెలర్ ఔషధాలు 1,062 మిలియన్ డాలర్ల(రూ.8,920 కోట్ల) మార్కెట్ పరిమాణాన్ని కలిగి ఉన్నట్లు అంచనా. టికాగ్రెలర్ ఔషధాలు 2025, మార్చితో ముగిసిన పన్నెండు నెలలకు 242 మిలియన్ డాలర్ల(రూ.2,032 కోట్ల) మార్కెట్ పరిమాణాన్ని కలిగి ఉన్నట్లు అంచనా.

## చిటికెలో పోస్టల్ స్కీమ్స్

ఆధార్‌తో ఈకేవైసీ..

పేపర్ వర్క్ అవసరం లేదిక!

పోస్టాఫీసు పథకాల్లో చేరే ప్రక్రియను తపాలా శాఖ మరింత సులభతరం చేసింది. మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్, టైమ్ డిపాజిట్, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వంటి ఖాతాలను పూర్తి డిజిటల్ పద్ధతిలో తెరిచే సదుపాయాన్ని తీసుకొచ్చింది.కేవలం ఆధార్ బయోమెట్రిక్ సాయంతో ఆయా ఖాతాలు సులువుగా తెరిచే వెసులుబాటును కల్పించింది. పేపర్ వర్క్ అవసరాన్ని తప్పించింది.పోస్టాఫీసు సేవింగ్స్ అకౌంట్ తెరవడానికి ఈ ఏడాది జనవరి నుంచి ఆధార్ బేస్డ్ ఈ-కేవైసీ విధానాన్ని తపాలాశాఖ అనుసరిస్తోంది. ఏప్రిల్ 24 నుంచి దీన్ని మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్, టైమ్ డిపాజిట్ స్కీమ్, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వంటి పాపులర్ పథకాలకూ విస్తరించింది. ఈమేరకు తాజాగా ఓ సర్క్యులర్ జారీ చేసింది. పోస్టాఫీసు కార్యాలయాల్లో ఆయా ఖాతాలన్నీ ఆధార్ ఈకేవైసీ సాయంతో సులువుగా తెరవొచ్చని పేర్కొంది. ప్రస్తుత పద్ధతితో వీటిల్లో ఏదైనా ఖాతాను తెరవాలంటే డిపాజిట్ వోచర్, ఫిజికల్ ఫారాలు నింపాల్సి ఉంటుంది. ఇకపై పోస్టాఫీసుల్లో రెండు పద్ధతులూ అందుబాటులో ఉంటాయి. ఇందులోభాగంగా ఈ ఖాతాలను తెరవడానికి వెళ్లినప్పుడు పోస్టల్ అసిస్టెంట్ తొలుత డిపాజిటర్ నుంచి బయోమెట్రిక్ (ఫింగర్ ప్రింట్) వివరాలు సేకరిస్తారు. తర్వాత పేరు, స్కీమ్ టైప్, డిపాజిట్ మొత్తం వంటి వివరాలు నమోదు చేస్తారు. వివరాలన్నీ ధ్రువీకరించుకున్నాక తుది సబ్మిషన్ కోసం మరోసారి మీ నుంచి బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తారు. దీంతో మీ లావాదేవీ పూర్తవుతుంది. ఈక్రమంలో డిపాజిట్ ఫారం కూడా నింపాల్సిన అవసరం లేదు. అంతేకాదు వివరాల నమోదు ప్రక్రియలో ఆధార్‌లోని తొలి 8 నంబర్లను పోస్టల్ సిబ్బంది మాస్క్ చేస్తారు. చివరి నాలుగు నంబర్లు మాత్రమే సేకరిస్తారు. భద్రతపై కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తపాలా శాఖ పేర్కొంది.

## 5,500 బ్యాటరీ.. ఏఐ కెమెరా..

**రూ.10 వేలకే వివో కొత్త ఫోన్..**

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వివో మరో కొత్త మొబైల్‌ను భారత్‌లో విడుదల చేసింది. 'వై' సిరీస్‌లో బడ్జెట్ ధరలో ఈ స్మార్ట్‌ఫోన్‌ను దేశీయ మార్కెట్లోకి తీసుకొచ్చింది. వివో వై19 5జీ పేరిట దీన్ని లాంచ్ చేసింది. 5,500 బ్యాటరీ, ఏఐ కెమెరా ఫీచర్లతో తీసుకురావడం విశేషం.వై 19 5జీ ఫీచర్ల విషయానికొస్తే.. 6.74 అంగుళాల హెచ్‌డీ‌ం డిస్‌ప్లే ఇస్తున్నారు. 90%ఎ% రిఫ్రెష్ రేటు, 700 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ఆక్టా- కోర్ మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్‌తో వస్తోంది. డ్యూయల్ సిమ్‌తో వస్తోన్న ఈ మొబైల్ ఆండ్రాయిడ్ 15 ఆధారంగా పనిచేస్తుంది. 64 రేటింగ్ కలిగి ఉంటుంది. ఇక కెమెరా పరంగా చూస్తే.. ఇందులో 13 ఎంపీ ప్రధాన కెమెరా ఇచ్చారు. ఏఐ ఎరేజర్.. లాంటి ఫీచర్లు జోడించారు. ఇక సెల్ఫీ కోసం ముందువైపు 5 ఎంపీ కెమెరా అమర్చారు. 5,500 బ్యాటరీతో వస్తోంది.వివో కొత్త మొబైల్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 4జీబీం 64జీబీ వేరియంట్ ధర రూ.10,499 కాగా.. 4జీబీం 128జీబీ

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.35 | ₹ 4.37 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 87,550 (22 క్యారెట్లు) | ₹ 95,510 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**


హైదరాబాద్

₹ 1,09,000

గగనతలంపై పాక్ ఆంక్షలు..

## ఎయిరిండియాకు రూ.వేల కోట్ల నష్టం

**ఢిల్లీజనంసాక్షి:** కశ్మీర్‌లోని పహల్గాం భూతల స్వర్గం.. ఆ ప్రదేశంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడితో భారత్-పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది.ఈ తరుణంలో పాకిస్తాన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భారత్‌లోని ప్రముఖ ఏవియేషన్ దిగ్గజం ఎయిరిండియాకు వేలకోట్ల నష్టం వాటిల్లింది.పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌పై భారత్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. దీంతో పాక్ సైతం భారత్‌పై పలు ఆంక్షలు విధించింది. పాక్ గగన తలంపై భారత విమానాల రాకపోకలపై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది.ఆ నిర్ణయంతో ఎయిరిండియా సుమారు 600 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. పాక్ గగనతలంపై భారత విమానాల రాకపోకలపై నిషేధం కారణంగా విమానాల దారి మళ్లింపు, పెరిగిన ప్రయాణ దూరం, అదనపు ఇంధనం ఖర్చు చేయాల్సి వస్తుంది. ఫలితంగా ప్రతీ ఏడాది తమ సంస్థకు 591 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని అంచనా వేసింది.ఈ నష్టం నుంచి బయటపడేందుకు ప్రభుత్వం రాయితీ ఇవ్వాలని కోరుతూ విమానయాన శాఖకు ఎయిరిండియా యాజమాన్యం లేఖ రాసినట్లు సమాచారం. గగనం తలంపై పాక్ తీసుకున్న నిర్ణయంతో ఒక్క ఎయిరిండియా మాత్రమే కాదని టాటా గ్రూప్‌కు చెందిన ఇతర విమానాల సర్వీసులపై ప్రభావం పడనున్నట్లు ఆ లేఖలో పేర్కొంది.ఉదాహరణకు ఇండిగో గురువారం న్యూఢిల్లీ-బాకు (అజర్‌బైజాన్‌లో) విమానం ఐదు గంటల 43 నిమిషాలు ప్రయాణించింది. పాక్ గగన తలం నుంచి కాకుండా దారి మళ్లించిన కారణంగా 38 నిమిషాలు ఎక్కువ సమయం పట్టింది. ఆ సమయానికి అదనంగా ఇంధనం వెచ్చించాల్సి ఉంటుంది. ప్రయాణ సమయంలో ప్రయాణికులకు అందించే ఇతర సర్వీసుల్లో సైతం భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది.అయితే, మిగితా విమానయాన సంస్థలతో పోలిస్తే ఎయిరిండియా పలు ప్రపంచ దేశాలకు విమానాల రాకపోకలన్నీ పాకిస్తాన్ గగన తలం నుంచే నిర్వహిస్తుంది. పాక్ తాజా నిర్ణయం ఎయిరిండియాపై కాస్త ప్రతికూల ప్రభావం పడనుంది. ఉదాహరణకు, ఢిల్లీ-మిడిల్ ఈస్ట్ విమానాలు ఇప్పుడు కనీసం ఒక గంట అదనంగా ప్రయాణించవలసి వస్తుంది, దీనికి ఎక్కువ ఇంధనం అవసరం అవుతుంది.ఎయిరిండియా దాని బడ్జెట్ సర్వీస్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగోలు గత నెలలో పదిహేను రోజుల్లో న్యూఢిల్లీ నుండి యూరప్, మిడిల్ ఈస్ట్, ఉత్తర అమెరికాలోని గమ్యస్థానాలకు 1,200 విమానాలు బయలుదేరాయని అంచనా.



## ఆయుధాలకే అగ్రతాంబూలం

**దేశంలో వెపన్స్ తయారీ పెంపు**

**జనంసాక్షి:** అంతర్జాతీయ అనిశ్చితులు పెరుగుతున్న నేపథ్యంలో దేశాలు తమ డిఫెన్స్ విధానాల్లో మార్పులు చేస్తున్నాయి. అందుకు భారీగానే నిదులు గుమ్మరిస్తున్నాయి. కొన్నిదేశాలు స్వయంగా ఆయుధాలు సమకూర్చుకుంటున్నా, అత్యాధునిక వెపన్స్ దిగుమతి కోసం ఇతర దేశాలపై ఆధారపడుతున్నాయి.ఇటీవల ఇండియా-పాక్ మధ్య యుద్ధ భయాలు నెలకొంటున్న నేపథ్యంలో భారత ఆర్మీ ఆయుధ మార్కెట్ ఎలా ఉందో తెలుసుకుందాం.ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాల ద్వారా రక్షణ రంగంలో స్వావలంబనపై ప్రభుత్వం ఎప్పటినుంచో దృష్టి సారించింది. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ ఉత్పత్తిని పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా పాత ఇన్‌సాస్ రైఫిల్స్ స్థానంలో ఏకే-203 అసాల్ట్ రైఫిల్స్ తయారీకి రష్యాతో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ఎస్‌ఐజీ సౌర్ 716 రైఫిల్స్‌ను అమెరికా నుంచి కొనుగోలు చేస్తుంది. యూఏఈకి చెందిన కారకల్‌తో క్వార్టర్ బాటిల్ కార్బైన్స్ కాంట్రాక్ట్ దక్కించుకుంది. ఈ తరుణంలో పాక్ ఇండియాతో తలపడి గెలవడం దాదాపు అసాధ్యం.భారత్ 2025 సంవత్సరానికిగాను రూ.6.81 లక్షల కోట్ల (80 బిలియన్ డాలర్లు) రక్షణ బడ్జెట్‌ను కేటాయించింది. ఇండియా అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉంది. ప్రపంచ ఆయుధ దిగుమతుల్లో భారత్ వాటా 9.8%గా ఉంది. దిగుమతులు తగ్గించుకుంటూ క్రమంగా దేశీయ తయారీను పెంపొందించుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి దేశీయంగా ఆయుధాల ఉత్పత్తి పెరిగినప్పటికీ, అధునాతన ఆయుధాల కోసం భారత్ ఇప్పటికీ దిగుమతులపై ఆధారపడుతోంది. ఈ విభాగంలో ప్రధాన సరఫరాదారులుగా ఉన్న దేశాల వివరాలు కింది విధంగా ఉన్నాయి.రష్యా: చారిత్రాత్మకంగా భారత్‌కు అతిపెద్ద ఆయుధ సరఫరాదారు అయినప్పటికీ దాని వాటా 64% నుంచి 45%కి తగ్గింది. ఫ్రాన్స్: భారత్ ఆయుధ దిగుమతుల్లో 29 శాతం వాటాతో రెండో అతిపెద్ద సరఫరాదారుగా అవతరించింది. అమెరికా: డ్రోన్లు, యుద్ధ విమానాలతో సహా భారత్ దిగుమతి చేసుకున్న ఆయుధాల్లో 11% సరఫరా చేస్తుంది.




## గంగాఎక్స్‌ప్రెస్‌వేపై యుద్ధవిమానాల గర్జన


ప్రత్యామ్నాయంగా ఎంత మేరకు ఉపయోగపడుతుందనే అంశాలను ఈ సందర్భంగా పరిశీలిస్తున్నారు. ఇవి రెండు భాగాలుగా జరగనున్నాయి. ఉదయం-రాత్రి ల్యాండింగ్, టేకాఫ్ చేయనున్నారు. ఉదయం సాధారణ వేళల్లోనే ఈ పరీక్షలు జరుగుతున్నాయి. కానీ, రాత్రి మాత్రం 7 గంటల నుంచి 10 గంటల మధ్యలో వీటిని నిర్వహించనున్నారు. ఓ పక్క భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ ఈ పరీక్షలు జరగడం గమనార్హం. యుద్ధ విమానాల రాక నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి జాగ్రత్తలు తీసుకొంది. దాదాపు 250 సీసీ కెమెరాలను ఇక్కడ ఇన్‌స్టాల్ చేసింది. గురువారం నుంచే ఈ మార్గం పూర్తిగా వాయుసేన నియంత్రణలోకి వెళ్లిపోయింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో యుద్ధ విమానాలు దిగేలా నిర్మించిన నాలుగో ఎక్స్‌ప్రెస్‌వే ఇది. గతంలో ఆగ్రా-లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్‌వే, పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే, బూందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఈ సౌకర్యాలున్నాయి.

## సోనియా, రాహుల్‌కు నోటీసులు

నిబంధనల ప్రకారం నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని.. కాబట్టి విచారణకు హాజరయ్యేలా వారికి నోటీసులు ఇవ్వాలని ఈడీ ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. గతవారం ఈ కేసును విచారించిన న్యాయస్థానం ఈడీ సమర్పించిన ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేని కారణంగా రాహుల్, సోనియా గాంధీలకు నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ చర్యలు తీసుకుంది.'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి.

## భారత్ దెబ్బకు పాక్ విల విల

**ఢిల్లీ,జనంసాక్షి:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి ఘటన భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను క్రియేట్ చేసింది. ఈ నేపథ్యంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పేలా భారత్ ప్లాన్ చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇక, తాజాగా పాక్‌పై రెండు ఆర్థిక దాడులకు భారత్ ప్రణాళికలు చేసినట్టు సమాచారం.కాగా, పాకిస్తాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా భారత్ ప్రణాళికలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ గ్రేలిస్టులోకి పాకిస్తాన్‌ను తిరిగి చేర్చడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఉగ్రవాద కార్యకలాపాలకు ఆర్థిక సహాయాన్ని అరికట్టడంలో విఫలమయ్యే దేశాలను ఎఫ్‌ఏటీఎఫ్ గ్రే లిస్ట్‌లో చేరుస్తుంది. గతంలో ఈ జాబితాలో ఉన్న పాకిస్తాన్‌ను తిరిగి అందులోకి చేర్చడం ద్వారా ఉగ్రవాదానికి నిధులు అందకుండా అంతర్జాతీయంగా ఆ దేశంపై ఒత్తిడి పెంచాలని భారత్ భావిస్తోంది.రెండో చర్యగా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఇటీవల పాకిస్థాన్‌కు మంజూరు చేసిన 7 బిలియన్ డాలర్ల భారీ ఆర్థిక సాయ ప్యాకేజీ వినియోగంపై భారత్ తన ఆందోళనలను వ్యక్తం చేయనున్నట్టు సమాచారం. ఈ నిధులను పాకిస్తాన్ ఉగ్రవాద సంబంధిత కార్యకలాపాల కోసం దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ సంబంధిత అంతర్జాతీయ వేదికలపై ఈ అంశాన్ని లేవనెత్తాలని భారత్ యోచిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. భారత్ ప్లాన్ చేసిన చర్యల కారణంగా పాకిస్తాన్‌కు కోలుకోలేని దెబ్బ తగిలే అవకాశం ఉంది.ఈ ద్వంద్వ వ్యూహం ద్వారా పాకిస్థాన్ కేంద్రంగా నడుస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌లకు ఆర్థిక



మార్గాలను మూసివేయాలని, తద్వారా సరిహద్దు ఉగ్రవాదాన్ని కట్టడి చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. పహల్గామ్ దాడి వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు ఈ ఆర్థికపరమైన ఒత్తిడిని ఒక మార్గంగా భారత్ పరిగణిస్తున్నట్టు సమాచారం.కాగా, 2022లో అంతర్జాతీయ వేదికపై పాకిస్తాన్‌కు కాస్త ఊరట లభించింది. ఉగ్రవాద సంస్థలకు నిధులు సరఫరా చేస్తోందన్న కారణంతో పాక్‌ను గ్రే లిస్టులో ఉంచిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ ఆ జాబితా నుంచి తొలగించింది. మనీలాండరింగ్ నిరోధక చర్యలను పాకిస్థాన్ పటిష్ఠంగా అమలు చేస్తోందని, సాంకేతిక లోపాలను పరిష్కరిస్తూ ఉగ్రసంస్థలకు నిధుల సరఫరా విషయంలోనూ పోరాటం చేసిందని ఎఫ్‌ఏటీఎఫ్ వెల్లడించింది. దీంతో పాక్‌ను గ్రే లిస్టు నుంచి తప్పించినట్లు తెలిపింది. గ్రే లిస్టులో ఉన్న దేశాలు అంతర్జాతీయ సంస్థల నుంచి నిధుల పొందడం చాలా కష్టం. ఈ దేశాలకు ముఖ్యంగా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్, ఏడీబీ, యూరోపియన్ యూనియన్ వంటి సంస్థలు ఆర్థిక సాయం చేసేందుకు వెనకాడుతాయి.ఉగ్రవాదానికి ఊతమిచ్చే అతి ప్రమాదకర దేశాలను ఎఫ్‌ఏటీఎఫ్ బ్లాక్ లిస్ట్ జాబితాలోకి చేరుస్తుంది. కాగా, ఇప్పటివరకు ఇరాన్, ఉత్తర కొరియా మాత్రమే బ్లాక్ లిస్ట్ జాబితాలో ఉన్నాయి. బ్లాక్ లిస్ట్ నుంచి తప్పించుకోవడానికి మూడుదేశాల మద్దతు అవసరం. అయితే, చైనా, టర్కీ, మలేషియా దేశాలు పాక్‌కు మద్దతు ఇవ్వడంతో బ్లాక్ లిస్ట్‌లోకి వెళ్లకుండా బయటపడింది. తొలిసారిగా 2018 జూన్‌లో ఎఫ్‌ఏటీఎఫ్ పాకిస్తాన్‌ను గ్రే లిస్ట్‌లో ఉంచింది. అనంతరం వీటి నుంచి బయటపడేందుకు పాకిస్తాన్‌కు రెండు సార్లు సమయమిచ్చింది.వీటిలో భాగంగా ఉగ్రవాదులకు అందుతున్న నిధుల మూలాలను కనిపెట్టే దిశగా పాక్ చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఐరాస ఉగ్రవాదులుగా గుర్తించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలి. అలాగే పట్టుబడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకున్నట్లు నిరూపించగలగాలి. ఐరాస గుర్తించిన ఉగ్రవాదులకు నిధులు అందకుండా ఆర్థికపరమైన ఆంక్షలు విధించాలి. ఎఫ్‌ఏటీఎఫ్ నిర్దేశించిన ఈ లక్ష్యాలను చేరుకోవడంలో పాక్ ఇప్పటివరకు విఫలమవుతూనే వచ్చింది. కానీ, జూన్ నెలలో ఎఫ్‌ఏటీఎఫ్ ప్లీనరీ సమావేశంలో పాక్‌కు అనుకూలంగా ప్రకటన విడుదల చేసింది.మరోవైపు.. ఇప్పటికే తీవ్ర ఆర్థిక కష్టాలతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్‌కు ఇప్పుడు మరో తలనొప్పి వచ్చి పడింది. పాక్‌తో వాణిజ్య సంబంధాలు పూర్తిగా నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించడంతో పాక్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ క్రమంలోనే అట్టారీ సరిహద్దును భారత్ మూసివేసింది. దీంతో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం నిలిచిపోయింది. దీంతో ఇప్పటికే తీవ్రంగా కుదేలైన పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థపై ఇది మరింత తీవ్ర ప్రభావం చూపనుంది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో పాక్‌లో ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకింది. భారీగా పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో పాక్ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రస్తుతం పాక్‌లో ఆహార ధరలు భారీగా పెరిగాయి.

పాకిస్తాన్‌లో ప్రస్తుతం కొన్ని ఆహార పదార్థాల ధరలు

కిలో చికెన్: రూ. 798.89 పాకిస్తాన్ రూపాయలు

కిలో బియ్యం: రూ. 339.56 పాకిస్తాన్ రూపాయలు

డజను గుడ్లు: రూ. 332 పాకిస్తాన్ రూపాయలు

లీటర్ పాలు: రూ. 224 పాకిస్తాన్ రూపాయలు

అరకిలో బ్రెడ్: రూ. 161.28 పాకిస్తాన్ రూపాయలు

కిలో టమాట: రూ. 150 పాకిస్తాన్ రూపాయలు

కిలో బంగాళాదుంప: రూ. 105 పాకిస్తాన్ రూపాయలు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
03 మే 2025

# ఉద్యోగుల డిఎ రూ.10 కోట్లు పెండింగ్‌లో ఉంది

**ప్రభుత్వం స్పందించి సకాలంలో అందించాలి**

**పట్టించుకోక పోతే జేఏసీగా ఏర్పడి పోరాటం చేస్తాం**

**రాష్ట్ర టీజీవో అధ్యక్షుడు శ్రీనివాసరావు**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**

ఉద్యోగుల డిఏ రూ.10 కోట్లు పెండింగ్‌లో ఉందని, ప్రభుత్వం స్పందించి సకాలంలో అందించాలని కేంద్ర కమిటీ, రాష్ట్ర టీజీవో అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగులకు డిఏ ఐదు వేల కోట్లు పెండింగ్‌లో పెట్టడం జరిగిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమ సమస్యలు తొలగిపోతాయని భావించామని, అందుకే ఉద్యోగ సంఘాలు సపోర్టుగా నిలిచాయని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగా లేవని తెలియజేశారని, కానీ రోజురోజుకు పెండింగ్ డిఏలు ఎక్కువవుతున్నాయన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడి తొందరలోనే అంచెలంచెలుగా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టీజీవో అధ్యక్షురాలుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మిని నియమించడం జరిగిందని రాష్ట్ర టీజీవో అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో స్టేట్ టీఎన్జీవోస్ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, టీజీవో స్టేట్ ట్రెజరర్ ఎం ఉపేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు, టిఎన్జీవోస్ భూపాలపల్లి ప్రెసిడెంట్ బూరుగు రవి, టీజీవో హనుమకొండ ప్రెసిడెంట్ మురళీధర్ రెడ్డి, టీజీవో కల్చరల్ సెక్రటరీ కోల రాజేష్ కుమార్, టీజీవోస్ రంగారెడ్డి ప్రెసిడెంట్ కె రామారావు, జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీవో రవి, సామ్యూల్, జిల్లా వైద్యశాఖ అధికారి మధుసూదన్, ఆర్టీవో సంధాని, హార్టికల్చర్ ఆఫీసర్ సునీల్, ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ సునీత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలి**

**మంత్రి దనసరి అనసూయ సీతక్క**



**ములుగు ప్రతినిధి, మే 02(జనంసాక్షి) :**

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. ఐటీడీఏలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు గిరిజన గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా గ్రామాల ప్రజల సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు తెలిపాలని మంత్రి సీతక్క సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి చిత్ర మిశ్రా అధ్యక్షతన ఐటీడీఏలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ పాల్గొనగా సమావేశంలో సీతక్క మాట్లాడుతూ లోని ఐటీడీఏ లోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో గిరిజన అభివృద్ధి తోడ్పడాలని, గిరిజనుల అభివృద్ధి కోసం చేపట్టిన పనులను నిరంతరం సమీక్ష చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, ఇంజనీరింగ్ శాఖ అధికారులు నిరంతరం గ్రామాలలో పర్యటించాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేస్తూ గిరిజన జీవనశైలిలో మార్పు తీసుకురావాలని కోరారు. తెలిసి తెలియని విషయాలు ఎన్నో ఉంటాయని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసినప్పుడే అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ చలికి వణుకుతూ ఉన్నప్పుడే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని, ఏజెన్సీ గ్రామాల ప్రజలు అన్ని తట్టుకునే శక్తి ఉన్న కారణంగానే కరోనా లాంటి భయంకరమైన వ్యాధి గిరిజన గ్రామాల ప్రజలకు శోక లేదని తెలిపారు. ఇప్పటి నుండే ఐటీడీఏ పరిధిలోని ఆరు జిల్లాలో చేపట్టిన పనుల వివరాలను సేకరించి పొందుపరచాలని సీతక్క తెలిపారు. ఈ సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, డిడి పోచం, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను వసూళ్లలో రాష్ట్రంలో మొదటి స్థానం

**మూడు కోట్ల నిధుల ప్రొసీడింగ్ అందజేత**

**జమ్మికుంట, మే 2 (జనం సాక్షి):**



జమ్మికుంట మున్సిపాలిటీ తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానం సాధించినందుకు గాను మున్సిపల్ సెక్రటరీ టి. కే. శ్రీదేవి ఐఏఎస్, మూడు కోట్ల నిధుల ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ సెక్రటరీ శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆస్తి పన్ను వసూళ్లలో పని చేసి మొదటి స్థానం సాధించినందుకు గాను జమ్మికుంట మున్సిపాలిటీకి అరుదైన గౌరవం దక్కిందన్నారు. అలాగే పట్టణ అభివృద్ధికై మూడు కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్‌కు అందజేసినట్లు తెలిపారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా మార్చి నెలకు ముందుగానే పన్ను వసూళ్లు పూర్తి చేయాలని కమిషనర్ అయాజ్‌ను, సిబ్బందిని కోరారు. పన్ను వసూళ్లలో కష్టించి పని చేసిన మున్సిపల్ సిబ్బందిని మున్సిపల్ సెక్రటరీ శ్రీదేవి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ మూడు కోట్ల నిధులు పట్టణంలోని జంక్షన్ లతో మున్సిపాలిటి ఆదాయం సమకూర్చే నాటికి అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఆర్.ఐ. భాస్కర్, ఆర్.ఓ వాణి, మున్సిపల్ అధికారులు మహేష్, బిల్ కలెక్టర్ మొగిలయ్య, పాషా, కుమార్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తున్నాం

**రాజుపేటశాఖ జామియా మసీద్ అధ్యకుడు మహమ్మద్ ఇషాక్**

**మంగపేట మే02 (జనంసాక్షి)**



పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని మేము ఖండిస్తున్నాం అని రాజుపేటశాఖ జామియా మసీద్ అధ్యకుడు మహమ్మద్ ఇషాక్ అన్నారు. శుక్రవారం రాజుపేట గ్రామంలో గల జామియా మజీద్ యిమామియా నమాజ్ అనంతరం జామియా మసీద్ కమిటీ అధ్యక్షుడు ఇసాక్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు అందరు కలిసి ర్యాలీ నిర్వహించి ఫ్లా కార్డులతో నిరసన తెలిపారు. అనంతరం ఇషాక్ మాట్లాడుతూ అమాయక ప్రజలైన పర్యటకులను అతి కిరాతకంగా కాల్చి చంపడం దారుణమని ఇంతటి చర్యకు పాల్పడిన వ్యక్తులు ఎంతటి వారైనా వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ముస్లిం మతస్తులు ఎవరు కూడా ఎదుటి వ్యక్తిని చంపడానికి కానీ గాయపరచడానికి కానీ ఒప్పుకోరు అని అటువంటి హత్యలు చేసిన వారు ముస్లిం మతస్తులు కారు అని వారు కాఫిర్లు అని ఇసాక్ అన్నారు. భారతదేశంలో నివసిస్తున్న

ముస్లింలందరూ కులమతాలకి అనుకూలంగా అన్నదమ్ముల సేవా భావంతో కలిసి మెలిసి జీవనం సాగిస్తున్నాం అని వారు అన్నారు. పర్యాటకులపై కాల్పులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం నేర్చుకోవాలి

**విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ**

**మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**ములుగు ప్రతినిధి, మే 02(జనంసాక్షి).**



రాష్ట్రంలో విద్య వైద్యాన్ని అనుకున్న స్థాయిలో అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు విద్యతో పాటు సంస్కారం నేర్చుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

ప్రతి వ్యక్తి అనుకున్న లక్ష్యాలను ఛేదించడానికి కష్టంతో ఇష్టపడి విద్యను అభసించాలని అన్నారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ ఇంటర్మీడియట్, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించడంతో గిరిజన విద్యార్థుల అభినందన సభ ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో రాష్ట్రంలోనే ములుగు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని, పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఎనిమిదవ స్థానంలో నిలవడం సంతోషకరమైన విషయమైనప్పటికీ రానున్న పరీక్షలలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలని కోరారు. జిల్లాలోని తాడ్వాయి, జగ్గన్నపేట ఆశ్రమ జూనియర్ కళాశాలలో 22 మంది లెక్చరర్స్ కు గత మూడు సంవత్సరాల నుండి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్న దృశ్య మంత్రి ప్రత్యేక చొరవ చూపి పెండింగ్ జీతాన్ని ఇప్పించినందుకు గాను కృతజ్ఞతగా మంత్రి సీతక్కను లెక్చరర్లు సన్మానించారు. అనంతరం జిల్లాలోని ఆశ్రమ పాఠశాల హాస్టల్ లలో విద్యనభ్యసించి 541 మార్కులు పొంది టాపర్లుగా నిలిచిన

12 విద్యార్థిని విద్యార్థులకు మంత్రి శాలువాతో సన్మానించారు. ఐటీడీఏ పరిధిలో డ్రైవర్ ఎంపవర్మెంట్ స్కీమ్ లో భాగంగా దరఖాస్తు చేసుకున్న 9 మంది గిరిజన యువతకు డ్రైవింగ్ ట్రైనింగ్ ఇచ్చి లైట్ మోటార్ వెహికల్ లెర్నింగ్ లైసెన్స్ మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, డిడి పోచం, ఎస్ఓ రాజ్ కుమార్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను పరిశీలించిన బోధన్ సబ్ కలెక్టర్

**బోధన్, మే 2 ( జనంసాక్షి ) :**



బోధన్ మండలం పెంటాకుర్దు గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. ఈ మేరకు గ్రామానికి మంజూరైన ఇండ్ల లబ్ధిదారులను పరిశీలించడంతో పాటు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు ఇచ్చిన కొలతల ప్రకారం ఇళ్లను నిర్మించుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మధుకర్, గ్రామ కార్యదర్శి మనీషా, మాజీ సర్పంచ్ నాగేశ్వర్ రావు తదితరులు ఉన్నారు.

# నీటి సంపులో పడి బాలుడు మృతి

**భీమదేవరపల్లి, మే 2 (జనం సాక్షి)**



నీటి సంపులో పడి చిన్నారి బాలుడు మృతి చెందిన ఈ ఘటన భీమదేవరపల్లి మండలం (కొత్తపల్లి)సాయినగర్ గ్రామంలో శుక్రవారం విషాద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి సాయినగర్ గ్రామానికి చెందిన కూన రాకేష్ రవళి దంపతులకు ఆర్యన్ అనే పదకొండు నెలల కుమారుడు ఉన్నాడు,కాగా ఉదయం రాకేష్ కూలీ పని నిమిత్తం బయటకు వెళ్లగానే తల్లి రవళి ఇంటి పనుల్లో నిమగ్నమైంది. ఈ క్రమంలోనే ఇంటి ఆవరణలో బాలుడు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడ్డాడు అ సమయంలో ఎవరూ గమనించకపోవడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. బాలుడు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# తడిసిన వడ్లను పరిశీలించిన కలెక్టర్

**మహదేవపూర్, మే 2 (జనంసాక్షి)**



: మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎర్రచెరువు సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు పోసిన వరి ధాన్యం రాత్రి కురిసిన భారీ వర్షానికి తడిసినందున జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తడిసిన ధాన్యాన్ని పరిశీలించి ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ తడిసిన ధాన్యం వెంటనే తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసి ధాన్యము ఏర్పాటు చేసేందుకు వ్యవసాయ శాఖ సహకారా శాఖ అధికారుల సమన్వయంతో నష్టపోయిన రైతుల పంతల వివరాలను నమోదు నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. తడిసిన ధాన్యం వివరాలు పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి అందించిన నష్టపరిహారం అందే విధంగా చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ డిఎం రాములు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోట రాజబాబు. సింగిల్ విండో చైర్మన్ చర్ల తిరుపతిరెడ్డి . మాజీ సింగిల్ విండో చైర్మన్ వామన్ రావు. సహకార శాఖ అధికారి వాలియా నాయక్ తాసిల్దార్ ప్రహ్లాద రాజోలు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి ఆదర్శంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 2 (జనం సాక్షి)**

: గురువారం పిసిసి ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి. ఆగ్రో పరిశ్రమల రాష్ట్ర చైర్మన్ కాసుల బాలరాజ్. జిల్లా ఇన్చార్జ్ లు. సత్యనారాయణ గౌడ్. వేణుగోపాల్ యాదవ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన నిర్వహించి దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ప్రజలు మనల్ని నాయకులుగా ఉన్నందుకు ప్రజల సమస్యలు తీర్చడానికే ఎక్కువ సమయం ఇవ్వాలని, అప్పుడే ప్రజా నాయకులం అవుతాం తప్ప పదవుల కోసం పాకులాడితే కుదరదని అన్నారు. గురువారం బిఆర్ఎస్, బీజేపీ జిల్లాకు చేసిందేమీ లేదని. ఇవన్నీ మనం ప్రజలకు చెప్పాలన్నారు. నేను మంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు త్రాగు సాగు నీరు అందాలని ప్యాకేజ్ 21,22,23 ప్రాజెక్టు తీసుకువస్తే దానిని వారి స్వార్థాల కొరకు ఆపినారన్నారు. 300 కోట్లతో అయిపోయే పనిని 3000 కోట్లు పెట్టీ కాంట్రాక్టులకు ఇచ్చారని విమర్శించారు. చిన్న చిన్న గొడవలు పక్కన పెట్టీ రాబోయే ఎన్నికల్లో ముందుకు వెళ్ళాలని, ప్రజలకు సేవ చేసే విధంగా కాంగ్రెస్ నాయకులు లక్ష్యం పెట్టుకోవాలన్నారు. యంత్రాంగం లో జరిగే తప్పులను సరిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, చిన్న చిన్న గొడవలకు వివాదాలు చేస్తే పార్టీ నుండి సస్పెండ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు మండల అధ్యక్షులు గ్రామ అధ్యక్షులు మాజీ జెడ్పిటిసి లు మాజీ ఎంపీటీసీలు సర్పంచులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.







# రైతు ఉత్పత్తిదారుల

**సహకార సంఘాలని ఏర్పాటు చేయాలి**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**వరంగల్ ఎంజీఎం,మే2 (జనంసాక్షి):**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పాక్స్) ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ డెవలప్మెంట్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొత్తగా రెవెన్యూ మండలాల ప్రాతిపదికగా రైతు పరపతి సేవల కోసం పిఎసిఎస్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఇదే సంఘాల ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఆత్మకూరు మండలం పెంచికలపేట, పెద్దాపూర్, శాయంపేట మండలం శాయంపేట, ధర్మసాగర్ మండలం ధర్మసాగర్, కమలాపూర్ మండలం కమలాపూర్, కాజీపేట మండలం కాజీపేట దర్గా, హసన్పర్తి మండలం వంగపహాడ్ ఏరియాలలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. భవిష్యత్తులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు, జన ఔషధీ కేంద్రాలు, పెట్రోల్ బంకులు, రైతులకు ఉపయోగపడే విధంగా గిడ్డంగులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, నాబార్డ్ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈఓ నజీర్ సుల్తాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మళ్ళీ క్రికెట్‌లో అడుగుపెట్టనున్న కపిల్ దేవ్



భారత క్రికెట్‌కు మరోసారి గర్వకారణమైన ఘట్టం ఎదురైంది. ఈసారి కొత్త రూపంలో 1983 ప్రపంచకప్ విజేత కెప్టెన్ కపిల్ దేవ్ తిరిగి క్రికెట్ ప్రపంచంలోకి అడుగుపెట్టనున్నారు. ఆయన రాబోయే టి20 ముంబై లీగ్ 2025 సీజన్ కోసం సోబో ముంబై ఫాల్కన్స్ జట్టుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. టోర్నమెంట్ ప్రారంభానికి కొన్ని వారాల ముందే ఈ ప్రకటన అధికారికంగా వెలువడింది. ప్రపంచ క్రికెట్‌లో గొప్ప ఆల్‌రౌండర్లలో ఒకరిగా పేరు పొందిన కపిల్ దేవ్, ఇప్పుడు తన అనుభవాన్ని, ప్రభావాన్ని ముంబై క్రికెట్‌కు అందించబోతున్నారు. ఈ సందర్భంగా కపిల్ దేవ్ మాట్లాడుతూ, "సోబో ముంబై ఫాల్కన్స్ తమ తొలి ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడు వారితో కలిసి ఉండటం నాకు గౌరవంగా ఉంది" అంటూ భావోద్వేగంగా స్పందించారు. సోబో ముంబై ఫాల్కన్స్ యజమాని అమీత్ హెచ్ గధోక్ కూడా ఈ విషయంపై స్పందిస్తూ, కపిల్ దేవ్ జట్టులో చేరటం వల్ల వారి జట్టుకు గొప్ప ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. "అతని అద్భుతమైన వారసత్వం, అపారమైన అనుభవం జట్టుకు మార్గనిర్దేశక శక్తిగా మారుతాయి" అని పేర్కొన్నారు. 20 ముంబై లీగ్ మూడవ ఎడిషన్ ఈ నెల మే 26 నుంచి ప్రారంభమై జూన్ 8 వరకు ముంబైలోని ప్రఖ్యాత వాంఖడే స్టేడియంలో జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు మొత్తం 20 మ్యాచ్‌లలో తలపడనున్నాయి. ఇప్పటికే రోహిత్ శర్మను ఈ లీగ్‌కు బ్రాండ్ ఫేస్‌గా ఎంపిక చేయగా, సూర్యకుమార్ యాదవ్, అజింక్య రహానే, శార్దూల్ ఠాకూర్, శివం దుబే, పృథ్వీ షా వంటి భారత క్రికెట్ స్టార్ ప్లేయర్లు లీగ్‌ను మరింత రంజకంగా మార్చనున్నారు. ఈ టోర్నమెంట్ మొత్తం జియో హాట్‌స్టార్, స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్షంగా ప్రసారమవుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులందరికీ ఇది ఒక క్రికెట్ పండుగగా మారనుంది. కపిల్ దేవ్ లాంటి దిగ్గజం మళ్లీ క్రికెట్‌కు దగ్గరయ్యారు అనడం సంతోషకరం. ఇది యువ క్రికెటర్లకు ప్రేరణగా నిలిచే అవకాశముంది.

# పికిల్‌బాల్ గుర్తింపు వివాదంపై ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ:** భారత క్రీడా రంగంలో పికిల్‌బాల్ క్రీడకు సంబంధించి గుర్తింపు వివాదం తీవ్ర రూపం దాల్చింది. ఇండియన్ పికిల్‌బాల్ అసోసియేషన్ (ఐపిఎ)కు యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ (%మీూూ%) జాతీయ క్రీడా సమాఖ్య గుర్తింపు ఇవ్వడంపై ఆల్ ఇండియా పికిల్‌బాల్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఐపిఎ గుర్తింపు నిర్ణయాన్ని సమర్థించే వివరణాత్మక అఫిడవిట్‌ను సమర్పించాలని మయాస్ ను కోర్టు ఆదేశించింది.

2007లో స్థాపితమైన ఎఐపిఎ, 24 రాష్ట్రాల్లో సంఘాలతో భారతదేశంలో పికిల్‌బాల్‌ను ప్రోత్సహించడంలో 18 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగి ఉంది. ఇది అంతర్జాతీయ పికిల్‌బాల్ ఫెడరేషన్, ఆసియా పికిల్‌బాల్ ఫెడరేషన్ లో స్థాపక సభ్యురాలుగా 2015 మరియు 2020లో అఫిలియేషన్‌లు పొందింది. ఎఐపిఎ తన పిటిషన్‌లో, ఎఐపిఎ నవంబర్ 2024లో ఏర్పడిన కొత్త సంస్థగా, జాతీయ క్రీడా అభివృద్ధి కోడ్‌లోని కనీసం మూడు సంవత్సరాల ఉనికి నిబంధనను నెరవేర్చలేదని వాదించింది. ఈ గుర్తింపు నిర్ణయం పారదర్శకత మరియు న్యాయాన్ని ఉల్లంఘిస్తుందని ఎఐపిఎ ఆరోపించింది. ఢిల్లీ హైకోర్టు, క్రీడా కోడ్‌లో ఏదైనా మినహాయింపులు ఇచ్చినట్లయితే, దానికి సమర్థనీయ కారణాలను మయాస్ వివరించాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణ మే 19, 2025కి షెడ్యూల్ చేయబడింది. ఎఐపిఎ తరపున సీనియర్ అడ్వకేట్ దయాన్ కృష్ణన్, అడ్వకేట్ హేమంత్ ఫాల్ఫర్, జయ ఫాల్ఫర్, మరియు ఆర్ అయ్యర్ వాదనలు వినిపించారు. హేమంత్ ఫాల్ఫర్ మాట్లాడుతూ, "క్రీడా కోడ్ జాతీయ క్రీడా సమాఖ్యల గుర్తింపు ప్రక్రియలో పారదర్శకత మరియు జవాబుదారీతనాన్ని నిర్ధారిస్తుంది. దీనిని ఏకపక్షంగా ఉల్లంఘిస్తే క్రీడా వ్యవస్థకు హాని కలుగుతుంది," అని పేర్కొన్నారు.

ఈ వివాదం భారతదేశంలో పికిల్‌బాల్ క్రీడ గవర్నెన్స్‌లో పారదర్శకత మరియు నిబంధనల పాటింపు యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది. ఐపిఎ గుర్తింపు ద్వారా ఆర్థిక సహాయం మరియు జాతీయ స్థాయిలో క్రీడను ప్రోత్సహించే అధికారాన్ని పొందగా, ఎఐపిఎ తన అంతర్జాతీయ అనుబంధాలు మరియు దీర్ఘకాల సేవల ఆధారంగా ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తోంది. కోర్టు తీర్పు భారతదేశంలో పికిల్‌బాల్ యొక్క భవిష్యత్తును గణనీయంగా ప్రభావితం చేయనుంది.



## అనుపమ ఉపాధ్యాయ సునాయాస విజయం

సుదిర్మాన్ కప్ ఫైనల్స్ 2025లో భారత బ్యాడ్మింటన్ జట్టు చైనాలోని జియామెన్‌లో జరిగిన తమ చివరి గ్రూప్ డి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను 3–2 తేడాతో ఓడించి టోర్నమెంట్‌ను సానుకూల నోట్‌తో ముగించింది. ఈ మ్యాచ్‌లో యువ ఆటగాళ్లు అనుపమ ఉపాధ్యాయ, సతీష్ కరుణాకరన్, డబుల్స్ జోడీ తనీషా క్రాస్టో–శ్రుతి మిశ్రా అద్భుత ప్రదర్శన కనబరిచారు.
మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ మియు లిన్ న్గాన్‌పై 21–16, 21–12 తో సునాయాస విజయం సాధించగా, పురుషుల సింగిల్స్‌లో సతీష్ కరుణాకరన్ హ్యారీ హువాంగ్ పై 18–21, 22–20, 21–13 తో రోమాంచక విజయం సాధించాడు. మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో–శ్రుతి మిశ్రా జోడీ లిజ్జీ టోల్మన్–ఎస్టెల్ వాన్ లీవెన్‌లపై 21–17, 21–17 తో గెలుపొందింది. అయితే, పురుషుల డబుల్స్ మరియు మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్ ఓటమి చెందింది. గ్రూప్ డిలో డెన్మార్క్, ఇండోనేషియాతో జరిగిన మునుపటి మ్యాచ్‌లలో 1–4 తేడాతో ఓడిపోవ డంతో భారత్ ఇప్పటికే క్వార్టర్ ఫైనల్స్ అవకాశాలను కోల్పోయింది. ఈ విజయం భారత జట్టుకు గౌరవప్రదమైన ముగింపును అందించింది.



## ప్రారంభకానున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్

పాట్నా: బిహార్ మొదటిసారిగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2025కు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధమవుతోంది, ఈ టోర్నమెంట్ మే 4 నుంచి మే 15 వరకు రాష్ట్రంలోని పాట్నా, గయా, రాజ్‌గీర్, భాగల్‌పూర్, బెగూసరాయ్ నగరాల్లో జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 4న పాట్నాలోని పాటలీపుత్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ క్రీడా మహోత్సవాన్ని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ ఏడవ ఎడిషన్‌లో దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సుమారు 10,000 మంది యువ క్రీడాకారులు 27 క్రీడా విభాగాల్లో, వీటిలో వాలీబాల్, ఫుట్‌బాల్, బాక్సింగ్, కబడ్డీ, సెపాక్‌టక్రా, మలంబ్ వంటి స్థానిక క్రీడలతో సహా, పోటీపడనున్నారు. బిహార్‌లోని భాగల్‌పూర్‌లోని సాండిస్ కాంపౌండ్‌లో తీరందాజీ, బ్యాడ్మింటన్ పోటీలు, బెగూసరాయ్‌లో ఫుట్‌బాల్, రాజ్‌గీర్‌లో ఫెన్సింగ్, హాకీ, గయాలో ఈత, ఖో–ఖో, పాట్నాలో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్ వంటి క్రీడలు జరగనున్నాయి. ఈ ఈవెంట్‌కు "గజసింహ" మస్కట్, బిహార్ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే లోగోతో సహా ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. బిహార్ ముఖ్యమంత్రి నీతీష్ కుమార్, కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవియా ఈ ఈవెంట్ సన్నాహాలను సమీక్షించారు, యువ క్రీడాకారులకు జాతీయ వేదికగా ఈ గేమ్స్ క్రీడా సంస్కృతిని ప్రోత్సహిస్తాయని హైలైట్ చేశారు. బిహార్ స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జనరల్ రవీంద్రన్ శంకరన్ ఈ గేమ్స్‌ను బిహార్ క్రీడా అభివృద్ధిలో మైలురాయిగా అభివర్ణించారు. గయాలో పోటీలను ఉచితంగా వీక్షించే అవకాశం ఉంటుందని, రాష్ట్రంలో క్రీడా ఉత్సాహాన్ని పెంచేందుకు ఈ ఈవెంట్ దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

# సుదిర్మాన్ కప్ 2025 క్వార్టర్ ఫైనల్స్‌లో చైనా, జపాన్



చైనా: సుదిర్మాన్ కప్ 2025 టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్స్ ముగిసి, డిఫెండింగ్ ఛాంపియన్ చైనా, జపాన్, ఇండోనేషియా, మరియు దక్షిణ కొరియా సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. చైనా ఫెంగ్‌హువాంగ్ జిమ్నాసియంలో జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో చైనా మలేషియాపై 3–0తో ఘన విజయం సాధించగా, జపాన్ చైనీస్ తైపీని 3–0తో చిత్తు చేసింది. ఇండోనేషియా తాయ్‌లాండ్‌ను ఓడించగా, దక్షిణ కొరియా డెన్మార్క్‌ను మట్టికరిపించింది.
చైనా తమ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో వరల్డ్ నంబర్ 1 షి యుకీ, వరల్డ్ నంబర్ 7 చెన్ యుఫీల నేతృత్వంలో మలేషియాపై ఆధిపత్యం చెలాయించింది, తమ 19వ వరుస సెమీఫైనల్ బెర్త్‌ను సురక్షితం చేసుకుంది. జపాన్‌లో కోకి వతనాబే చౌ టియెన్ చెన్‌పై 21–13, 20–22, 21–14తో గెలిచి జట్టుకు బలమైన పునాది వేశాడు. ఇండోనేషియా జోనాతన్ క్రిస్టీ వంటి ఆటగాళ్లతో తాయ్‌లాండ్‌ను అధిగమించగా, దక్షిణ కొరియా ఆన్ సెయోంగ్ నాయకత్వంలో డెన్మార్క్‌పై ఆధిక్యం సాధించింది. భారత జట్టు గత రోజు గ్రూప్ డిలో ఇంగ్లండ్‌ను 3–2తో ఓడించి టోర్నమెంట్‌ను సానుకూలంగా ముగించినప్పటికీ, డెన్మార్క్, ఇండోనేషియాతో 1–4 తేడాతో ఓడిపో వడంతో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరలేకపోయింది. యువ ఆటగాళు అనుపమ ఉపాధ్యాయ, సతీష్ కరుణాకరన్, మరియు డబుల్స్ జోడీ తనీషా క్రాస్టో–శ్రుతి మిశ్రా ఇంగ్లండ్‌పై విజయంలో కీలక పాత్ర పోషించారు. సెమీఫైనల్స్‌లో హోరాహోరీ పోరు ఆశించబడుతోంది, చైనా, జపాన్, ఇండోనేషియా, దక్షిణ కొరియా టైటిల్ కోసం తలపడనున్నాయి.

# సాయి సుదర్శన్‌ను జట్టులోకి తీసుకోవాలి

**భారత మాజీ క్రికెటర్, మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రి**



గుజరాత్ టైటన్స్ స్టార్ సాయి సుదర్శన్ ఐపీఎల్ 2025లో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకుంటున్న నేపథ్యంలో, భారత మాజీ క్రికెటర్ మరియు మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రి ఆయనను ఇంగ్లాండ్ పర్యటనకు భారత జట్టులో ఎంపిక చేయాలని సూచించారు. సాయి సుదర్శన్ మొదటినుండి ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటూ వస్తున్నాడు. ఇండియా 'ఎ' తరపున పలు టూర్‌లలో ప్రదర్శన చూపించిన ఈ ఎడమచేతి బ్యాట్స్‌మన్, 2024–25 బార్డర్–గావాస్కర్ సిరీస్ తొలి టెస్ట్‌కి శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా ఎంపిక అవుతాడని ఊహించబడినప్పటికీ, ఆ సమయానికి సెలక్టర్లు దేవ్‌దత్ పడిక్కల్‌ను ఎంపిక చేశారు. ప్రస్తుతం 23 ఏళ్ల సాయి, గుజరాత్ టైటన్స్ తరఫున ఐపీఎల్ 2025లో 9 మ్యాచ్‌లలో 456 పరుగులు చేశాడు. అంతేకాకుండా, ఇంగ్లాండ్‌లో సరీ తరఫున కౌంటీ క్రికెట్‌లో కూడా అనుభవం సంపాదించాడు. సరీ తరఫున 5 మ్యాచ్‌ల్లో ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీతో మొత్తం 281 పరుగులు చేశాడు. ఈ అనుభవం ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌కు అతన్ని మంచి అభ్యర్థిగా నిలబెడుతోంది. రవి శాస్త్రి ఐసీసీ రివ్యూలో మాట్లాడుతూ, "ఈ యువకుడిని నేను అన్ని ఫార్మాట్లలో చూడగలగాలని ఆశిస్తున్నాను. అతడి టెక్నిక్, ఎడమచేతి ఆటగాడిగా ఇంగ్లాండ్‌లో అతడి అనుభవం ఇవన్నీ చూస్తుంటే అతను నా జాబితాలో అగ్రస్థానంలో ఉంటాడు," అన్నారు. 2025–27 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా జూన్ నుంచి ఆగస్ట్ వరకు జరగనున్న ఇంగ్లాండ్ పర్యటనలో భారత్ ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. రవి శాస్త్రి, భారత జట్టులో ఎడమచేతి పేసర్ అవసరం ఉందని కూడా అభిప్రాయపడ్డారు. కెంట్ తరఫున కౌంటీ క్రికెట్ ఆడిన అర్షదీప్ సింగ్‌ను ఈ నేపథ్యంలో మంచి ఎంపికగా పరిగణించారు. "నాకు ఒక ఎడమచేతి పేసర్ అవసరమవుతుంది. ఎవరైనా సరే, మంచి ఫార్మ్‌లో ఉన్న ఎడమచేతి బౌలర్‌ను జట్టులోకి తీసుకురావాలి. అర్షదీప్‌ను 'వైట్ బాల్ స్పెషలిస్ట్' అనే నిర్ణయం నాకిష్టం లేదు," అని శాస్త్రి వ్యాఖ్యానించారు. ఖలీల్ అహ్మద్ కూడా బాగా బౌలింగ్ చేస్తున్నాడని చెప్పారు. ఇంగ్లాండ్‌లో భారత్ చివరిసారి టెస్ట్ సిరీస్‌ను 2007లో ద్రావిడ్ నేతృత్వంలో గెలిచింది. ఇటీవల జరిగిన ఇంగ్లాండ్ పర్యటన 2–2తో ముగిసింది.

# క్వాలిఫికేషన్ కోసం ఛాంపియన్స్ లీగ్

ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్ 2024–25 సీజన్‌లో గేమ్‌వీక్ 35 ఆసక్తికరమైన మ్యాచ్‌లతో సందడి చేయనుంది. స్పోర్ట్స్ ఇల్లస్ట్రేటెడ్ ఈ గేమ్‌వీక్‌లో జరిగే 10 మ్యాచ్‌ల ఫలితాలను అంచనా వేసింది, ఇవి ఫుట్‌బాల్ అభిమానులకు ఉత్కంఠ రేపుతున్నాయి. లీగ్ టైటిల్ రేసు ఇప్పటికే దాదాపు ఖరారైనప్పటికీ, ఛాంపియన్స్ లీగ్ స్థానాల కోసం జరుగుతున్న పోటీ, రెలిగేషన్ జోన్ నుండి తప్పించుకునే ప్రయత్నాలు ఈ మ్యాచ్‌లను మరింత ఆకర్షణీయంగా చేస్తున్నాయి. ఈ నివేదికలో, స్పోర్ట్స్ ఇల్లస్ట్రేటెడ్ అంచనాలతో పాటు ముఖ్య మ్యాచ్‌ల విశ్లేషణను అందిస్తున్నాము.
స్పోర్ట్స్ ఇల్లస్ట్రేటెడ్ ప్రకారం, గేమ్‌వీక్ 35లో మ్యాచ్‌లు శుక్రవారం నుండి సోమవారం వరకు జరుగుతాయి, ఇందులో ఛాంపియన్స్ లీగ్ స్థానాల కోసం పోటీపడే జట్ల మధ్య కీలక పోరాటాలు ఉన్నాయి. ముఖ్యంగా, మాంచెస్టర్ సిటీ, చెల్సియా, ఆర్సెనల్, లివర్‌పూల్ వంటి టాప్ జట్లు ఈ వారం ఆడే మ్యాచ్‌లు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఎక్స్‌లోని పోస్టుల ప్రకారం, అభిమానులు ఈ మ్యాచ్‌ల ఫలితాలపై విభిన్న అంచనాలు వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు, కొందరు లివర్‌పూల్ చెల్సియాపై 5–1 తేడాతో గెలుస్తుందని, మరికొందరు ఆర్సెనల్ బోర్న్‌మౌత్‌తో 2–2తో డ్రా చేస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ వైవిధ్యమైన అంచనాలు అభిమానుల మధ్య ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ గేమ్‌వీక్‌లో ఛాంపియన్స్ లీగ్ క్వాలిఫికేషన్ కోసం జరుగుతున్న పోటీ ముఖ్యమైనది. లివర్‌పూల్ ఇప్పటికే టైటిల్ గెలుచుకున్నప్పటికీ, ఆర్సెనల్, మాంచెస్టర్ సిటీ, చెల్సియా, న్యూకాసిల్, నాటింగ్‌హామ్ ఫారెస్ట్ వంటి జట్లు టాప్–ఫైవ్ స్థానాల కోసం తీవ్రంగా పోటీపడుతున్నాయి. రెలిగేషన్ జోన్‌లో ఉన్న ఇప్స్‌విచ్, సౌతాంప్టన్ వంటి జట్లు ఈ మ్యాచ్‌లలో అద్భుత ప్రదర్శన చేయాల్సిన ఒత్తిడిలో ఉన్నాయి. ప్రీమియర్ లీగ్ గేమ్‌వీక్ 35 ఉత్కంఠభరిత మైన మ్యాచ్‌లతో అభిమానులను అలరించనుంది. స్పోర్ట్స్ ఇల్లస్ట్రేటెడ్ అంచనాలు ఈ మ్యాచ్‌ల ఫలితాలపై ఒక అవగాహనను అందిస్తున్నాయి, అయితే ఫుట్‌బాల్‌లో ఊహించని ఫలితాలు సాధారణం. మాంచెస్టర్ సిటీ, ఆర్సెనల్, చెల్సియా వంటి జట్లు ఈ వారం గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ, వోల్వ్స్, బోర్న్‌మౌత్ వంటి జట్లు ఆశ్చర్యకరమైన ఫలితాలను సాధించవచ్చు. ఈ మ్యాచ్‌లను లైవ్‌గా స్కై స్పోర్ట్స్, బీటీ స్పోర్ట్ ఛానెల్‌లలో లేదా ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో చూడవచ్చు.




## శానిటేషన్ నిర్వహణ సజావుగా జరగాలి

- జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్
- ఖైరతాబాద్ జోన్‌లో పర్యటించిన కమిషనర్

**హైదరాబాద్, మే 02 (జనం సాక్షి) :** శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఖైరతాబాద్ జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి తో కలిసి తెలుగు తల్లి ఫ్లైఓవర్, లోయర్ ట్యాంక్ బండ్ ట్రాన్స్ ఫార్మర్ పాయింట్, ఖైరతాబాద్ బడా గణేష్, ఖైరతాబాద్ పార్కులో పలు అభివృద్ధి పనులతో పాటు శానిటేషన్ ను పరిశీలించారు. బడా గణేష్ ప్రాంతంలో శానిటేషన్ వర్కర్లతో కమీషనర్ మాట్లాడారు. అక్కడే ఎఫ్.ఆర్.ఎస్ అటెండెన్స్ పరిశీలించారు. అటెండెన్స్ హాజరు, ఆబ్సెంట్ పరిస్థితి పరిశీలన చేసారు. అదేవిధంగా స్వచ్ఛ ఆటో డ్రైవర్ లతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఐడీ కాలనీ వద్దకు వెళ్లి అక్కడ కాలనీ వాసులతో మాట్లాడారు. శానిటేషన్ కార్మికులు రోజు వస్తున్నారా అని ఆరా తీశారు. ప్రతి రోజు వస్తున్నారని కాలనీ వాసులు కమిషనర్ కు తెలిపారు. పక్కనే ఉన్న పార్కు ను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడి నుండి నేరుగా సెక్రెటరీయేట్ పరిసరాలను పరిశీలించారు. తెలుగు తల్లి ఫ్లైఓవర్ తో పాటుగా లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఎస్.సి.టి.పి ని సందర్శించి రాంకీ వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వారికి పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, ఖైరతాబాద్ డిప్యూటీ కమీషనర్ రజనీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**శాయంపేట, మే 2 (జనంసాక్షి) :** శాయంపేట మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో ఐకేపీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తపడాలని రైతులకు సూచించారు. ధాన్యం తీసుకురాబోతున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అక్కడున్న వివిధ శాఖల అధికారులకు ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ నేతలు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

# తెలంగాణ అంటే మొదటి నుంచి టీడీపీకి ద్వేషమే

- తెలంగాణ ఏర్పాటును అడ్డుకునేందుకు ఎన్నో కుట్రలు
- నేటి సీఎంతో కలిసి బీఆర్ఎస్ సర్కార్ ను కూల్చేందుకు పన్నాగం
- అభివృద్ధి చేయడం చేతగాక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు
- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్

**హైదరాబాద్ :** తెలంగాణ మీద ఎప్పుడు టీడీపీ నేతలు విషం కక్కుతున్నారని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర మండిపడ్డారు. రాష్ట్ర విభజన సమయంలో కట్టుబట్టలతో గెంటేశారని ఏపీ మంత్రి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిం చారు. ఏపీ, తెలంగాణ రెండు కళ్లని చెప్పిన చంద్రబాబు ఎప్పుడు తెలంగాణ కన్నును పొడవాలనే చూస్తున్నారని విమర్శించారు. యావత్ తెలంగాణ సమాజం రోడ్డు మీదకు వచ్చి ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడితే టీడీపీ అధినేత తెలంగాణకు వ్యతిరేకంగా పావులు కదిపారని గుర్తుచేశారు. అసలు చంద్రబాబు కుటుంబానికి, టీడీపీ నేతలకు తెలంగాణ అంటేనే ఇష్టం ఉండదన్నారు. పదేళ్లలో కేసీఆర్ వందేళ్ల అభివృద్ధి చేస్తే ఓర్వలేక ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ఎప్పుడు సమయం దొరికిన టీడీపీ నేతలు తెలంగాణ పట్ల వారి కున్నా అసూయను బయటపెడుతున్నా రని వివరించారు. 2014లో తెలంగాణలో కొత్తగా ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు నాటి టీడీపీ ఎమ్మెల్యే, నేటి సీఎంతో కలిసి చంద్రబాబు కుట్రలు చేశారని వివరించారు. 1953నాటికి తమిళనాడు నుంచి ఏపీ రాష్ట్రం ఏర్పడే నాటికే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఉందని గుర్తుచేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రం అప్పటికే అభివృద్ధిలో, ఆర్థికంగా మొదటి వరుసలో ఉండేదన్నారు. నాటి సీమాంధ్ర నాయకులు ఎలాగైనా తెలంగాణను ఏపీలో కలపాలని కుట్రలు చేశారని గుర్తు చేశారు. సుదీర్ఘ పోరాటం తరువాత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే దానిపై సైతం ఇంకా కుట్రలు చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ ను నిర్మించింది చంద్రబాబు అని చెప్పుకునే టీడీపీ నేతలు ఎందుకు అమరావతి ఇప్పటి వరకు నిర్మించుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. పబ్లిసిటీ మీద ఉన్న దృష్టి పాలన మీద ఉంటే ఐదేళ్ల క్రితమే అమరావతి పూర్తయ్యేదని తెలిపారు. తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టుల మీద వరుసగా కేంద్రానికి టీడీపీ ప్రభుత్వం ఫిర్యాదులు చేస్తున్నారరని మండిపడ్డారు. అటు కేంద్రం అండ, ఇటు రేవంత్ రెడ్డిని చూసుకుని కృష్ణా నదిలో నీటి దోపిడికి పాల్పడుతున్నారని విమర్శించారు. కృష్ణా జలాల్లో ఏపీకి తాత్కాలికంగా 512 టీఎంసీలు కేటాయిస్తే 655 టీఎంసీల నీటిని తరలించుకుని తీసుకుని పోయారని దుయ్యబట్టారు.

# రామప్ప సందర్శనకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలి



- ఈ నెల 14న యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంను సందర్శించనున్న సుందరీమణులు.
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ములుగు ప్రతినిధి,మే 02(జనంసాక్షి) :**
ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన సుందరీమ ణులు ఈనెల 14వ తేదీన ములుగు జిల్లా పర్యటన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులును ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హైదరాబాద్ లో నిర్వహించే మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొంటున్న వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు ఈ నెల 14వ తేదీన రామప్ప సందర్శన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పి శభరిష్, డిఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావులతో కలసి సంబంధిత అధికారులతో సందర్శన ఏర్పాట్లు, భద్రత, పర్యటన ప్రాంతాల వద్ద ఏర్పాట్లు, తదితర అంశాలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవెంట్ మేనేజ్ మెంట్ సంస్థ షోబోట్ ప్రతినిధులు వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు సందర్శించే ప్రదేశాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పర్యటనలో భాగంగా హైదరాబాద్ నుండి రామప్ప హరిత కాకతీయ హోటల్ కి చేరుకుంటారని, అక్కడ వారికి స్వాగతం కార్యక్రమం ఉంటుందన్నారు. వారి రాక సందర్భంగా పోలీస్ భద్రత పటిష్టంగా ఉండాలని అన్నారు. హరిత కాకతీయ నుండి రామప్ప దేవాలయానికి చేరుకుని దైవ దర్శనం చేసుకుంటారని, ఆలయం వద్ద బ్యారికేడ్ల ఏర్పాటు చేయాలని, ఆలయ విశిష్టతను తెలియజేసేందుకు గైడ్ అందుబాటులో ఉండాలన్నారు. అక్కడ ఫోటో షూట్, వాహనాల పార్కింగ్, పారిశుధ్య నిర్వహణ, తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థ షో బోట్ ప్రతినిధి , పోలీస్, పర్యాటక, ఇతర అధికారులతో చర్చించారు. యునెస్కో గుర్తింపు పొందిన దేవాలయం సందర్శన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, డిన్నర్ అనంతరం హైదరాబాద్ కు బయలుదేరుతారని అన్నారు. అలాగే మే 8వ తేది నుండి 17 వరకు శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.
మంగపేట మండల మల్లూరు గ్రామంలోని శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో మే 8వ తేది నుండి 17 వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ, మే 8వ తేది నుండి 17 వరకు శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, పారిశుద్ధ్యం, త్రాగునీటి ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలన్నారు. లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, డిఎస్పి రవీందర్, సంబంధిత శాఖల అధికారులు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో 63 మంది పోలీసు సిబ్బంది బదిలీ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సాధారణ బదిలీల్లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 63 మంది పోలీసు సిబ్బందినీ బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే వివరాలను వెల్లడించారు. ఒక పోలీసు స్టేషన్‌లో ఐదు సంవత్సరాలు పనిచేసిన సిబ్బందికి స్థానచలనం కల్పించారు. పోలీసు స్టేషన్‌లలో ఖాళీలను సిబ్బందికి తెలుపుతూ, సీనియారిటీ ప్రకారం ఆయా పోలీసు స్టేషన్‌లను కేటాయించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన బదిలీల్లో మొత్తం 63 మంది ట్రాన్స్ఫర్ కాగా, 52 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, ఏడుగురు మహిళా కానిస్టేబుళ్ళు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు) ఎఎస్సైలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, జిల్లా పోలీసు కార్యాలయ ఏవో వసీం ఫర్హాన, ఎస్ బి ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్, డిపిఓ సూపరింటెండెంట్ వంశీ, ఎస్సై శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శివరాం రెడ్డి, సీసీ ఫసియోద్దీన్, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

# బీసీల గురించి కిషన్ రెడ్డికేం తెలుసు!

- మాపై విమర్శలు చేస్తే సహించం
- విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే దానం
- తెలంగాణ ముమ్మాటికీ రోల్ మోడల్ : బీర్ల అయిలయ్య



**హైదరాబాద్, మే2 (జనంసాక్షి) :** కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి బీసీల గురించి ఏమి తెలుసని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో దానం నాగేందర్ మాట్లాడారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కిషన్‌రెడ్డికి లేదని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన ఎక్కడ చేయలేదని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణని రోల్ మోడల్‌గా తీసుకొమ్మన్నారని చెప్పారు. బీసీలం అల్ప సంతోషులమని అన్నారు. విమర్శలు ప్రతి విమర్శలు వల్ల సాధించేది ఏమీ లేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. ఇకపోతే దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో కులగణన చేసి రోల్ మోడల్‌గా నిలిచామని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సీఎల్పీ మీడియా పాయింట్‌లో బీర్ల ఐలయ్య మాట్లాడారు. సాహోసోపేత నిర్ణయాలతో దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. జనగణనలో కులగణన చేస్తామన్న మోదీ కేబినెట్‌కి ధన్యవాదాలు తెలిపారు. దేశం అంత బీసీలకి న్యాయం జరగాలని అన్నారు. ఇక్కడ ఉన్న బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. గతంలో రాహుల్ గాంధీ పాదయాత్రలో ప్రజల సమస్యలు చూసి కులగణన జరగాలని పోరాడారని చెప్పారు. తెలంగాణలో కులగణన రాహుల్ గాంధీ విజన్ అని చెప్పారు. కేంద్రమంత్రి అయ్యి ఉండి కిషన్‌రెడ్డి ఆలోచించి మాట్లాడాలని అన్నారు. ఏ లెక్కల ప్రకారం తమ కులగణన తప్పని కిషన్ రెడ్డి అంటున్నారని నిలదీశారు. రేపు కేంద్రం కులగణన చేసిన తర్వాత ఆ లెక్కలు చూసి చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణని కేంద్రం రోల్ మోడల్‌గా తీసుకున్నందుకు రాష్ట్ర బీజేపీ నేతలకి దిమ్మ తిరిగిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి భారత్‌లో హీరోగా నిలబడటం కేంద్ర మంత్రులు జీర్ణించుకోలేక పోతున్నారని బీర్ల ఐలయ్య అన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నిన్న నిజాలు మాట్లాడారని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని గత పదేళ్లలో అభివృద్ధి చేయలేదని అన్న కవిత మాటలను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు కవితకి తలసరి ఆదాయం గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కొండలు, గుట్టలు, వెంచర్లకు రైతు రైతుబంధు ఇచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ కులగణనలో పాల్గొనలేదని.. అప్పుడు కవితకి సామాజిక న్యాయం ఎందుకు గుర్తుకు రాలేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేసినప్పుడు కవిత ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నపుడు కవితకి ఏం గుర్తుకురాదని విమర్శించారు. అధికారం పోయాక సామాజిక న్యాయమని కవిత అంటు-న్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ పేదల నాయకుడని అభివర్ణించారు. ఇచ్చిన హామీలని ఒక్కొక్కటి అమలు చేస్తూ బీఆర్ఎస్ కంటే రేవంత్ ప్రభుత్వంలో మంచి పాలన అందిస్తున్నామని చెప్పారు. వరి ఏస్తే ఉరే అని చెప్పి కేసీఆర్ ఫాంహౌస్‌లో వరి పండించినప్పుడు కవితకి రైతులు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్కడ ఎన్నికలు ఉంటే అక్కడ సంక్షేమ పథకాలు వచ్చేవని అన్నారు. గత పదేళ్లు ప్రశ్నించని కవిత తన పార్టీలో ప్రాధాన్యత తగ్గగానే ప్రశ్నించటం ప్రారంభించిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు.

# రామానాయుడు స్టూడియోస్‌కు చుక్కెదురు

- ప్రభుత్వ నిర్ణయంపై జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం




**న్యూఢిల్లీ, మే 2 (జనంసాక్షి) :** సుప్రీం కోర్టులో సురేష్ ప్రొడక్షన్స్‌కి చుక్కెదురైంది. రామానాయుడు స్టూడియో భూముల వ్యవహారంలో సురేష్ ప్రొడక్షన్స్‌కు ఊరట దక్కలేదు. ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ విశాఖపట్నంలో రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. విశాఖలో ఫిల్మ్ సిటీ కోసం కేటాయించిన భూములను ఇతర అవసరాలకు కూడా వాడుకోవచ్చని అప్పట్లో జగన్ ప్రభుత్వం సురేష్ ప్రొడక్షన్స్‌కు అనుమతి ఇచ్చింది. రామానాయడు స్టూడియో కోసం కేటాయించిన భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతుందని, అందుకే సురేష్ ప్రొడక్షన్స్‌కు కేటాయించిన భూములను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేస్తూ షోకాజ్ నోటీసు ఇచ్చింది. ప్రభుత్వ షోకాజ్ నోటీసును సుప్రీంకోర్టులో సురేష్ ప్రొడక్షన్స్ సవాల్ చేసింది. విచారణ జరిపిన జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా ధర్మాసనం జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. మధ్యంతర ఉపశమనం అడుగుతున్నారని, అది కుదరదని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. అవసరం అనుకుంటే.. ప్రభుత్వ షోకాజ్ నోటీసుపై సంబంధిత కోర్టును ఆశ్రయించాలని జస్టిస్ జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా పిటిషనర్‌కు సూచించారు. పిటిషన్ ఉపసంహరించుకుంటామని సురేష్ ప్రొడక్షన్స్ కోరగా, ధర్మాసనం అనుమతించింది.

# బతుకమ్మ కుంట పనుల్లో వేగం పెంచండి

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



**హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) :** బతుకమ్మ కుంట అభివృద్ధి పనుల వేగాన్ని పెంచాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. కొద్ది రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బతుకమ్మ కుంటను సందర్శించనున్నారని... అప్పటి వరకూ చెరువు రూపాన్ని తీసుకురావాల న్నారు. శుక్రవారం బతుకమ్మకుంట అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూ. 7 కోట్లతో ఈ చెరువును అభివృద్ధి చేస్తున్న విషయం విధితమే. మోకాలు లోతు మట్టిని తీయగానే చెరువు ఆనవాళ్లు కనిపించిన బతుకమ్మకుంటను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అభివృద్ధి చేస్తోందని కమిషనర్ చెప్పారు. వచ్చే బతుకమ్మ ఉత్సవాల నాటికి చెరువు పూర్తవ్వాలని.. బతుకమ్మ ఆటలు ఇక్కడే ఆడేలా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులను చేపట్టిన కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బంది, ఆటంకాలు కలగకుండా.. హైడ్రా అధికారులు చూడాలన్నారు. ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టిన నాటి నుంచి స్థానికులు ఎంతో సంబర పడుతున్నారని.. వారి సహకారంతో పనుల్లో వేగాన్ని పెంచాలని సూచించారు. చెరువు ఇన్‌లెట్లు, ఔట్ లెట్లు ద్వరా వర్షపు నీరు చేరేలా.. పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# ప్రజావాణికి 251 దరఖాస్తులు



- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య

**హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 251 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 75, విద్యుత్ శాఖకు సంబంధించి 23, రెవెన్యూ శాఖకు సంబంధించి 46, ప్రవాసి ప్రజావాణి కి 05, ఇందిరమ్మ ఇండ్ల కోసం 41 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 61 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# మధుసూధన్ కుటుంబానికి మంచు విష్ణు బాసట

- కుటుంబ సభ్యులను కలసి ఓదార్పు
- పిల్లల చదువు బాధ్యతలు తీసుకుంటానని వెల్లడి

**నెల్లూరు, మే2 (జనంసాక్షి) :** నెల్లూరు జిల్లా కావలిలోని కుమ్మరి వీధికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ రావు, ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ విషాద సంఘటన తర్వాత, మధుసూదన్ కుటుంబానికి అండగా నిలవడానికి సినీ హీరో మంచు విష్ణు ముందుకొచ్చారు. కావలిలోని మధుసూదన్ నివాసానికి చేరుకున్న విష్ణు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మధుసూదన్ సతీమణి కామాక్షి, వారి ఇద్దరు పిల్లలను కలిసిన మంచు విష్ణు, దాడి జరిగిన తీరును గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. మధుసూదన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన విష్ణు, కుటుంబ సభ్యులకు తన పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంచు విష్ణు మాట్లాడుతూ, ఈ విషాదం తనను ఎంతగానో కలిచివేసిందని, మధుసూదన్ పిల్లల బాధ్యతను తాను స్వీకరిస్తానని ప్రకటించారు. మధుసూదన్ ఇక లేరనే నిజాన్ని ఒప్పుకోవడం కష్టంగా ఉన్నా, వారి పిల్లల భవిష్యత్తు కోసం నేను అండగా ఉంటాను. వారిని దత్తత తీసుకొని, వారి విద్యాభ్యాసం మరియు ఇతర అవసరాల కోసం నేను బాధ్యత వహిస్తానని విష్ణు హామీ ఇచ్చారు. మధుసూదన్ గత 12 సంవత్సరాలుగా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన తల్లిదండ్రులు తిరుపాలు మరియు పద్మావతి, కావలిలో అరటి పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దాడి సమాచారం వారి వృద్ధ తల్లిదండ్రులకు తెలియజేయడం కూడా కుటుంబ సభ్యులకు పెద్ద సవాలుగా మారింది.

## ఓయూ పరిధిలో పరీక్షల తేదీలు ఖరారు

**హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్మెంట్ (ఎండీహెచ్ఎం) నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్ లాగ్, ఇంప్రూవ్మెంట్ పరీక్షలను ఈనెల 14వ తేదీ నుంచి, బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ లో బ్యాక్లాగ్ పరీక్షలను ఈనెల 15వ తేదీ నుంచి, దూరవిద్య ద్వారా అందించే ఎంసీఏ, పీజీడీసీఏ, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సుల మెయిన్, బ్యాక్ లాగ్ పరీక్షలను ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీన పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

## మోసం కేసులో అఘోరి శ్రీనివాస్‌కు 14రోజుల రిమాండ్

**షాద్‌నగర్, మే2 (జనంసాక్షి) :** సినీ నిర్మాత వద్ద డబ్బులు తీసుకొని మోసగించారనే ఫిర్యాదుపై అఘోరీ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసిన మోకిల పోలీసులు శుక్రవారం కేసు విచారణలో భాగంగా మరోమారు షాద్‌నగర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రవి ముందు ప్రవేశపెట్టారు. చేవేళ్ల కోర్టులో ప్రవేశపెట్టవెల్సి ఉండగా అక్కడి కోర్టు ఇంచార్జ్ న్యాయమూర్తిగా ఉన్న రవి.. షాద్‌నగర్ న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకోవడంతో మోకిల పోలీసులు షాద్‌నగర్ కోర్టులోని న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టారు. పోలీసులు నమోదు చేసిన కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి రవి అఘోరీ శ్రీనివాస్‌కు మరో 14 రోజుల పాటు- రిమాండ్ విధించారు. దీంతో మోకిల పోలీసులు అఘోరిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. అఘోరీతో మీడియా ప్రతినిధులు మాట్లాడేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

## ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన మసీదుల మూత

**లక్నో, మే2 (జనంసాక్షి) :** ఉత్తర్ ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అక్రమ మసీదులు, మదర్సాలపై ఉక్కుపాదం మోపుతోంది. ముఖ్యంగా భారత్- నేపాల్ సరిహద్దుల్లోని ఉన్నవాటిపై అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. జిల్లా పాలనాధికారులు, స్థానిక పోలీసులు, సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) వంటి కేంద్ర దళాల సమన్వయంతో శుక్రవారం పెద్ద ఎత్తున యాక్షన్ చేపట్టింది. అక్రమ మసీదుల్ని మూసేయడంతో పాటు- ప్రభుత్వ భూముల్లో అనధికారికంగా నిర్మించిన మతపరమైన నిర్మాణాలు కూల్చేశారు. మహారాజ్‌గంజ్ జిల్లాలో, అధికారులు 11 మదర్సాలను సీజ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించిన మసీదులు, మందిరాలతో సహా అనేక భవనాలను కూల్చేశారు. శ్రావస్తిలో గుర్తింపు లేని 41 మదర్సాలను మూసేశారు. రెవెన్యూ కోడ్‌లోని సెక్షన్ 67 ప్రకారం, ఇండో-నేపాల్ సరిహద్దు నుండి 15 కిలోమీటర్ల వ్యాసార్థంలో శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలతో సహా 139 అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించినట్లు- అధికారులు తెలిపారు. బహ్రైచ్ జిల్లాలో, రుపైదిహ్, మోతీపూర్ వంటి సరిహద్దు ప్రాంతాలలో కూడా ఇలాంటి చర్యలు కొనసాగుతున్నాయి.

# ఈదుగాలులకు నేలకొరిగిన చెట్లు

- మామిడి పంట నేలరాలడంతో రైతన్నల ఆవేదన



**ఖమ్మం, మే2 (జనంసాక్షి) :** ఈదురు గాలులతో కూడిన వర్షం బయ్యారంలో శుక్రవారం తెల్లవారుజామున బీభత్సాన్ని సృష్టించింది. రెండు గంటల పాటు ఈదురు గాలులు, రాళ్లతో కురిసిన వర్షం ప్రజలను అతలాకుతలం చేసింది. గాలుల కారణంగా మండలంలోని కొత్తపేట, బయ్యారం, బాలాజీ పేట, వెంకట్రాంపురం, జగ్గు తండా, బంజర తండా, నామలపాడు, నర్సాతండా ఉప్పలపాడు, మిర్యాల పెంట కంబాలపల్లి, కాచనపల్లివంటి గ్రామాల్లో పెద్ద పెద్ద చెట్లు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో ఇండ్లపై కప్పులు , రేకులు గాలికి కొట్టుకుపోయాయి. ఇల్లందు-మహబూబాబాద్ జాతీయ రహదారి బయ్యారం శివారులో చెట్టు- రహదారిపై పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొత్తపేట, ఉప్పలపాడు, బయ్యారం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతోనే నష్టపోయామని రైతులు వాపోయారు. ధాన్యం భద్రపరచుకునేందుకు పట్టాలు కప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందారు. విపరీతమైన గాలి కారణంగా మామిడికాయలు రాలిపోవడంతో కౌలు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రంగాపురం ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న 150 ఏళ్ల మర్రి వృక్షం వేర్లతో సహా కూలిపోగా, బయ్యారంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పురాతన మర్రిచెట్టు- కొమ్మలు విరిగిపడ్డాయి. పలుచోట్ల స్తంభాలు, వైర్లు విరిగిపోవడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యుత్ పునరుద్ధరణకు ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు ప్రారంభించారు. వర్షం కారణంగా జరిగిన నష్టాన్ని తహసిల్దార్ విజయ, సీఐ రవికుమార్, ఎస్ఐ తిరుపతి పర్యవేక్షించారు.

# పాలమూరుకు రేవంత్ ద్రోహం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శలు




**హైదరాబాద్, మే2 (జనంసాక్షి) :** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న వైఖరిని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఒక్క అడుగు ముందుకు వేయకపోవడం మాతృద్రోహం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఏడాదిన్నర కాలంగా తట్టె-డు మన్ను కూడా ఎత్తని ప్రభుత్వం ప్రాజెక్టుపై ప్రాధాన్యం లేకుండా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్యాకేజీ 3లో కేవలం 8 కిలోమీటర్ల కాలువ మాత్రమే మిగిలి ఉండగా, దానికి సంబంధించిన కాంట్రాక్ట్‌ను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీ-డీపీ నేతకు అప్పగించడం అనుమానాస్పదమని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఆ కాంట్రాక్టును ప్రారంభించకపోవడానికి అక్కడి రాజకీయ నాయకుల ఒత్తిడి ఉందేమో అనిపిస్తోందని అన్నారు. ప్రాజెక్టు కోసం 27,000 ఎకరాల భూసేకరణ జరగగా, కేవలం 100 ఎకరాలు మాత్రమే మిగిలివున్నాయని తెలిపారు. ప్రజలకు పాలమూరు ప్రయోజనాలు త్వరగా అందకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పనులను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుత పరిస్థితిని సమీక్షించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. డిండి పనులను హడావిడిగా ప్రారంభించడం అనవసరం. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టును నీటి పారుదల శాఖ మంత్రి ఎందుకు సమీక్షించడం లేదని నిలదీశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టాల్సిన సమయంలో, జూరాల నుంచి కొడంగల్ ఎత్తిపోతల చేపట్టడం అనేది కక్షసాధింపు చర్య అని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం జూరాలలో నీరు వదులుకోవడం వల్ల ప్రాజెక్టు డిజైన్ ప్రమాదంలో పడుతుందని, అల్మట్టిలో నీళ్లు నిలుపుకునే అవకాశం తక్కువ అని అన్నారు. ప్రాజెక్టుపై ఇప్పటివరకు రూ.32 వేల కోట్ల వ్యయం జరిగిందని, 90 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా అంగీకరించారని గుర్తు చేశారు. జరిగిన పనులకు అభినందనలు చెప్పే ముందు, మిగిలిన వాటిని పూర్తిచేసి ప్రజలకు ఫలితాలు అందించాలంటూ డిమాండ్ చేశారు. సాగునీళ్లు ఇవ్వడం లేదు, పంటలు కొనడం లేదు. రైతులకు బోనస్ ఇవ్వలేదు. రుణమాఫీ సగం కూడా కాలేదని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రూ.లక్షా 70 వేల కోట్ల అప్పులు చేసిన ఈ ప్రభుత్వం ఇప్పుడు అప్పుల గురించి మాట్లాడడం ఆక్షేపణీయమైనదని నిరంజన్ రెడ్డి వ్యాఖ్యానించారు. మూసీ ప్రాజెక్టు, హైడ్రా వంటి మంచి అవకాశాలను ధ్వంసం చేశారు. అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని విమర్శలు గుప్పించారు.

# కొలను దొరికింది. బెబ్బులి చల్లబడింది..



**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి) :** ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. 45డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఎండ వేడి భరించలేక చల్లదనం కోసం ఏదైనా కొలను కనిపించక పోతుందా అని ఓ బెబ్బులి పులి అడవిలో కొలను కోసం వెతుక్కుంటూ వెళ్ళే దారిలో ఓ సెలయేరు కనిపించింది. వెంటనే పులి అందులో దిగి ఎండ నుంచి ఉపశమనం పొందిన ఈ దృశ్యం ఆదిలాబాద్ జిల్లాకు కూత వేటు దూరంలో ఉన్న తిప్పేశ్వర్ పులుల అభయారణ్యంలో జనంసాక్షి కెమెరాకు శుక్రవారం చిక్కింది. పులులు ఎండనుంచి రక్షించుకోవడం కోసం అడవుల్లో ఉండే వాగులు, నీటి కుంటలను వెతుక్కుంటూ అందులో గంటల తరబడి సేద తీరుతాయని జిల్లాకు చెందిన ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370